




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం : ఒక్కరూ మనవెనుక రాలే!

యుద్ధం.. ప్రపంచానికి భారమే!

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 163 | మంగళవారం | 13-05-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# పాకిస్థాన్‌పై చర్యలు నిలిపివేత తాత్కాలికమే

## వారి ప్రవర్తన ఆధారంగానే భవిష్యత్తు చర్యలు

### ఇది యుద్ధాల యుగం కాదు... ఉగ్రవాద యుగం కాదు

- అణు బెదిరింపును భారత్ సహించబోదు
- చర్చలంటూ జరిగితే అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే
- ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా జాతినుద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్ భారత దేశ నూతన విధానమని, పాకిస్థాన్ పై చర్యలు తాత్కాలికంగా నిలిపివేశామని, వారి ప్రవర్తనను బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇది యుద్ధాల యుగం కాదని, అలాగే ఉగ్రవాద యుగం కూడా కాదని స్పష్టం చేశారు. భారతదేశం ఎలాంటి 'అణు బెదిరింపు'ను సహించబోదని తెలిపారు. చర్చలంటూ జరిగితే అది ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) గురించే ఉంటాయని చెప్పారు. ఆపరేషన్ సిందుర్ తర్వాత మొదటిసారిగా జాతిని ఉద్దేశించి ప్రధాని మోదీ సోమవారం నాడు టివి ద్వారా 22 నిమిషాల పాటు ప్రసంగించారు. పాకిస్థాన్ సైనిక దాడిని ఆపబోమని భారతదేశాన్ని వేడుకున్నప్పటికీ, తమ దుస్సాహసాన్ని ఆపుతామని వారు హామీ ఇచ్చిన తర్వాత మాత్రమే న్యూఢిల్లీ దానిని పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. పహల్గాం దాడిని 'ఉగ్రవాదం అత్యంత క్రూరమైన ముఖం'గా ప్రధానమంత్రి అన్నారు. ఇది తనను వ్యక్తిగతంగా బాధించిందని పేర్కొన్నారు. మన మహిళల నుదుటి నుండి సిందూరం తొలగించిన పర్యవసానాలను శత్రువు ఇప్పుడు గ్రహించాడని అన్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ తరువాయి 2లో




"పాకిస్థాన్ సైన్యం, ప్రభుత్వం నిరంతరం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయి. ఇలాంటి చర్యలు చివరికి పాకిస్తాన్ పతనానికి దారితీస్తాయి.పాకిస్థాన్ మనుగడ సాగించాలంటే, దాని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయాలి. శాంతికి మరో మార్గం లేదు. ఉగ్రవాదం, చర్చలు సహజీవనం చేయలేవు. ఉగ్రవాదం, వ్యాపారం సమాంతరంగా సాగలేవు. రక్తం నీరు కలిసి ప్రవహించలేవు. గౌతమ బుద్ధుని బోధనలను గుర్తు చేసుకుంటూ, శాంతి మార్గం బలం ద్వారా మార్గనిర్దేశం చేయబడాలి. శాంతిని కాపాడాలంటే భారతదేశం బలంగా ఉండాలి. అవసరమైనప్పుడు ఆ బలాన్ని ప్రయోగించాలి.

– ప్రధాని నరేంద్ర మోదీ


ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనమేలా?:కాంగ్రెస్ 02


## యుద్ధాన్ని మేమే ఆపాం



### అనేక కారణాలు ఉన్నా... వ్యాపారం ఒక పెద్ద కారణం

ఆపితే మరింత వ్యాపారం చేస్తామని చెప్పా : ట్రంప్ వివాదాస్పద వ్యాఖలు

**వాషింగ్టన్ డి.సి. :** భారతదేశం, పాకిస్తాన్ మధ్య 'అణ్వాయుధ సంఘర్షణ'ను తమ ప్రభుత్వం ఆపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. శత్రుత్వాలను ముగింపు పలికితే దక్షిణ ఆసియా పొరుగు దేశాలతో అమెరికా 'మరింత వ్యాపారం' చేస్తుందని చెప్పారు. 'భారతదేశం , పాకిస్తాన్ మధ్య పూర్తి, తక్షణ కాల్పుల విరమణకు శనివారం మా ప్రభుత్వం సహాయపడింది. మా అభిప్రాయం ప్రకారం, పెద్ద సంఖ్యలో అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల ప్రమాదకరమైన సంఘర్షణను ముగించే శాశ్వతమైన కాల్పుల తరువాయి 2లో

## రెండు వైపుల నుండీ ఒక్కతూటా పేలకూడదు

- కాల్పుల విరమణ కొనసాగిద్దాం
- సరిహద్దుల్లో సైన్యాన్ని తగ్గిద్దాం
- భారత్–పాక్ డిజిఎంఒల నిర్ణయం

**న్యూఢిల్లీ :** కాల్పుల విరమణను కొనసాగించాలనీ, భారత్–పాకిస్థాన్‌లు ఏ ఒక్కవైపు నుండీ ఒక్క తూటా కూడా పేలకుండా నివారించాలని రెండు దేశాల మిలిటరీ డైరెక్టర్ జనరల్స్ (డిజిఎంఓ) నిర్ణయించారు. నిర్ణీత ప్రకారం నిర్దేశించిన సైనిక డైరెక్టర్ జనరల్స్ సమావేశం ఐదు గంటలు ఆలస్యంగా సోమవారం సాయంత్రం జరిగింది. భారత ఆర్మీ ఒక ప్రకటన చేస్తూ, కాల్పుల విరమణకు కట్టుబడి ఉండాలనీ, ఒక్క తూటాను కూడా ఏ ఒక్కరూ పేల్చకూడదనీ లేదా ఒక్క తూటా కూడా పేల్చేందుకు ఎలాంటి చొరవా చెయ్యకూడదనీ సంభాషణల్లో డిజిఎంఓలు నిర్ణయించినట్లు పేర్కొంది. అదేవిధంగా రెండు దేశాలూ సరిహద్దుల నుండి సైన్యం సంఖ్యను తగ్గించేందుకు భరోసా ఇచ్చేలా తక్షణం చర్యలను పరిశీలించాలని కూడా రెండు తరువాయి 2లో

# హైదరాబాద్ జిసిసి హబ్

- సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఎఐ-రెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోంది
- హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటి కంపెనీలు విస్తరించాయి
- సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్థికవృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటే సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని సమతుల్యం చేసుకుంటూ సమగ్రమైన సమ్మిళితమైన అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. 'తెలంగాణ రైజింగ్' అనే ఆలోచనలో ఈ దార్శనికత ఇమిడి ఉందని అన్నారు. హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జిసిసి) హబ్‌గా మారిందని, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఎఐరెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోందని, మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటి కంపెనీలు హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించాయని సిఎం చెప్పారు. నానక్‌రామ్ గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సోనాటా సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్, సిఈఓ సమీర్ ధీర్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళికలను సిఎం ఈ వేదికగా వివరించారు. అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడంలో, తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం తరువాయి 2లో



భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గవర్నర్ జిష్టుదేవ్ వర్మతో సోమవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

# టెర్రరిస్టులను మట్టుబెట్టాలి

- మతాన్ని హింసకు వాడుకోవడం ఆటవిక సాంప్రదాయం
- ఉగ్రవాదానికి శాశ్వత పరిష్కారం చూపాలి
- మత ప్రాతిపదికన చంపడం దారుణం
- పశ్య కన్నమ్మ సంతాప సభలో వక్తల ఉద్ఘాటన



ప్రజాపక్షం/హుజూర్‌నగర్

ప్రపంచంలో ఏ దేశంలోనైనా టెర్రరిస్టులను మట్టు పెట్టాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో సిపిఐ సీనియర్ నేత ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య సమర యోధురాలు, మహిళ సమాఖ్య నాయకురాలు దివంగత పశ్య కన్నమ్మ సంతాప తరువాయి 12లో



## వాణిజ్య పన్నుల శాఖలో 6 శాతం ప్రగతి

- రాష్ట్ర ఖజానాకు రూ.500 కోట్లు ఆదాయం
- భవిష్యత్తులోనూ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

గత సంవత్సరంతో పోలిస్తే వాణిజ్య పన్నుల శాఖలో మొత్తంగా 6 శాతం ప్రగతి కనిపించిందని, ఇదొక మంచి పరిణామం అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మార్చి మాసంలో సిఎస్‌టి,వ్యాట్ మొత్తంగా వృద్ధి రూ 600ల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంటే, సుమారు రూ. 500ల కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు సమకూరిందన్నారు. భవిష్యత్తులో కూడా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన 'రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ 'సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్స్ విక్రయాల్లో మంచి ప్రగతి కనిపిస్తున్నప్పటికీ, వ్యవసాయ భూములు, ఓపెన్ ఫ్లాట్స్ విక్రయాల్లో తరువాయి 2లో



బోరెడ్డి అయోధ్యరెడ్డి



పివి శ్రీనివాసరావు



దేశాల భూపాల్



మొహసినా పర్వీన్

## నలుగురు ఆర్‌టిఐ కమిషనర్ల నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నియామకాలు చేపట్టింది. రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కమిషనర్లుగా నలుగురిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంత కాలంగా ఈ పదవులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.నూతనంగా నియమితులైన వారిలో పివి శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, తరువాయి 2లో

## యుఎస్, చైనా వాణిజ్య యుద్ధానికి 90 రోజుల విరామం

- వాణిజ్య యుద్ధానికి 90 రోజుల విరామం
- సుంకాలు తగ్గించుకున్న అమెరికా, చైనా
- జెనీవాలో శనివారం ఇరుదేశాల చర్చల్లో ఒప్పందం
- పరస్పరం 115 శాతం తగ్గింపు
- చైనా సరుకులపై 30 శాతం, అమెరికా సరుకులపై 10 సుంకం
- 90 రోజుల్లో వివాదాల పరిష్కారానికి సంప్రదింపులు



**జెనీవా :** ఇటీవల పరస్పరం పెంచుకున్న టారిఫ్‌లను దాదాపుగా తగ్గించుకునేందుకు అమెరికా, చైనా దేశాలు అంగీకారానికి వచ్చాయి. అలాగే, వాణిజ్య వివాదాల పరిష్కారానికి మరిన్ని చర్చలకు వీలుగా వాణిజ్య యుద్ధానికి 90 రోజుల పాటు విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. చైనా సరుకులపై అమెరికా ప్రతిగా సుంకాన్ని 145 శాతం నుంచి 30 శాతానికి, అమెరికా సరుకులపై చైనా విధించిన సుంకాన్ని 125 శాతం తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## సాయుధ పోరాటానికి కుర్దుల పార్టీ నిర్ణయం
### ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి ప్రవేశించాలని నిర్ణయం

**ఇస్తాంబుల్ :** టర్కీ ప్రభుత్వం గతంలో ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన కుర్దిష్ వర్కర్స్ పార్టీ(పికెకె) కీలక నిర్ణయం తీసుకుంది. సాయుధ పోరాటానికి స్వస్తి పలకాలని, తమ సంస్థను రద్దు చేసి, ప్రజాస్వామ్య రాజకీయాలలోకి ప్రవేశించాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రకటించారు. స్వతంత్ర్య కుర్దిష్ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో 1984లో పికెకె ఏర్పాటైంది. నాలుగు దశాబ్దాలుగా సాయుధపోరాటాన్ని కొనసాగించింది. ఇందులో వేలాది కుర్దులు, టర్కీ ప్రజలు మరణించారు. గత వారం ఉత్తర ఇరాక్‌లో జరిగిన పికెకె 12వ కాంగ్రెస్‌లో పికెకె సంస్థాగత నిర్మాణాన్ని రద్దు చేయాలని, సాయుధ పోరాటాన్ని నిలిపివేయాలని నిర్ణయించిందని ఫిరాత్ వార్తా సంస్థ పేర్కొంది. పికెకె అధికార ప్రతినిధి ఒకరు తమ నిర్ణయాన్ని నిర్ధారించడంతో పాటు, సాయుధ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. పికెకెను రద్దు చేయాలని టర్కీ జైలులో యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్న ఆ సంస్థ నాయకుడు అబ్దుల్లా ఒకలాన్ ఫిబ్రవరిలో ఇచ్చిన పిలుపుకు స్పందనగా పికెకె కాంగ్రెస్ నిర్వహించి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# నిర్బంధంలో ఉన్న జర్నలిస్టులను విడుదల చేయాలి

### వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ విలువైన బహుమతులు
### మౌఢ్యం, విద్వేషాలకు మీడియా చోటు ఇవ్వొద్దు
### నూతన పోప్ లియో 14 విజ్ఞప్తి




**వాటికన్ సిటీ :** నిర్బంధంలో ఉన్న జర్నలిస్టులను విడుదల చేయాలని పోప్ లియో 14 విజ్ఞప్తి చేశారు. ఈ చర్య వాక్, పత్రికా స్వేచ్ఛకు బహుమతి వంటిదని పేర్కొన్నారు. పోప్ ఎన్నిక ప్రక్రియను కవర్ చేసేందుకు రోమ్‌కు వెళ్ళిన 6 వేల మంది జర్నలిస్టులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సాధారణ పౌరుల ప్రతినిధులతో మొదటిసారి సమావేశమయ్యేందుకు వాటికన్ ఆడిటోరియంలోకి నూతన పోప్ ప్రవేశించగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో స్వాగతం పలికారు. మొదటిసారి అమెరికా నుంచి ఎన్నికైన 69 ఏళ్ల పోప్ ప్రసంగిస్తూ శాంతి , యుద్ధ తిరస్కరణ, గొంతు లేని వారికి గొంతు కోసం తమ పదాలను ఉపయోగించాలని వాడాలని జర్నలిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. నిజాన్ని తెలుసుకునేందుకు, రాసేందుకు చేసిన ప్రయత్నంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జైలు పాలైన జర్నలిస్టుల పట్ల ఆయన సంఘీభావం వ్యక్తం చేశారు. వారిని విడుదల చేయాలని కోరారు. యుద్ధ సమయంలో తమ జీవితాన్ని సైతం పణంగా పెట్టి వార్తలు రాసేందుకు వెళ్లే వారి గురించి తాను ఆలోచిస్తున్నానని, గౌరవం, న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణ గురించి వారికి తెలియజేసేందుకు చూపుతున్న సాహసాన్ని ఆయన కొనియాడారు. కేవలం విషయం తెలిసిన వ్యక్తులే స్వేచ్ఛగా ఎంపిక చేసుకుంటారని అన్నారు. నిర్బంధంలో ఉన్న జర్నలిస్టుల బాధలు దేశాలు, ప్రపంచ సమాజం అంతర్మాతలకు సవాలు విసురుతున్నాయని, మనమంతా వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛకు అనే విలువైన బహుమతిని పరిరక్షించాలని అన్నారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో జాగ్రత్త :** పక్షపాత వైఖరితో కాకుండా నిజాలు రాయడంపై దృష్టి సారించాలని, ''మౌఢ్యం, విద్వేషాల''లకు స్థానం ఇవ్వవద్దని మీడియాను పోప్ కోరినట్లు బిబిసి తెలిపింది. ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ పట్ల పోప్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని బాధ్యతగా, వివేచనతో వినియోగించాలని సూచించారు. మానవాళి ప్రయోజనం కోసమే ఎఐని వాడుకునేలా చూడాలని అన్నారు.

# 15న రష్యా, ఉక్రేన్‌ల చర్చలపై పీటముడి

### బేషరతుగా ప్రత్యక్ష చర్చలు
### పునఃప్రారంభానికి పుతిన్ ప్రతిపాదన
### పుతిన్‌తో నేనే చర్చిస్తానని జెలెన్‌స్కీ తిరకాసు



**క్యీవ్ :** రష్యా, ఉక్రేన్‌ల మధ్య చర్చలు జరిగే పరిస్థితి కనపడడం లేదు. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో మే 15న బేషరతుగా ప్రత్యక్ష చర్చలను తిరిగి ప్రారంభించాలని(గతంలో 2022లో ఇరు దేశాల మధ్య చర్చలు అర్థాంతరంగా నిలిచిపోయాయి) ఉక్రేన్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించారు. అయితే, ఈ చర్చల్లో పుతిన్ తనతో ముఖాముఖి చర్చించాలని ఉక్రేన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తిరకాసు పెట్టారు. దీంతో మే 15న ఉభయ దేశాల చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది. 30 రోజుల పాటు కాల్పులు విరమించాలని అమెరికా, యూరోపియన్ యూనియన్ నాయకులు గత గురువారం చేసిన ప్రతిపాదన చేశారు. అదే రోజు దానిని తిరస్కరించిన రష్యా, నేరుగా బేషరతుగా ఉక్రేన్‌తో చర్చలను కొనసాగించేందుకు ప్రతిపాదించింది. రష్యా ప్రతిపాదనను ఆమోదించాలని ఉక్రేన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అయితే, టర్కీలో పుతిన్‌తో వ్యక్తిగతంగా చర్చించేందుకు సిద్ధమని జెలెన్‌స్కీ తిరకాసు పెట్టారు. ఉక్రేన్ యుద్ధానికి అంతం పలకాలని కోరుకుంటుందని, అందుకు అవసరమైన ప్రతి పనిని చేస్తామని, రష్యా నుంచి కూడా అందుకు అనుగుణమైన చర్యలు ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన టెలిగ్రామ్‌లో అన్నారు. నూతన పోప్ లియో 14తో మొదటి సంభాషణలో శాంతి ప్రయత్నాల గురించి వివరించినట్లు ఆయన తెలిపారు. పోప్‌ను ఉక్రేన్ సందర్శించాలని ఈ సందర్భంగా కోరినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్‌పై వందకు పైగా డ్రోన్‌లను రష్యా ప్రయోగించిందని ఉక్రేన్ ఎయిర్‌ఫోర్స్ సోమవారం నాడు ఆరోపించింది. ఇటీవల విక్టరీ డే సందర్భంగా రష్యా బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ, రష్యాపై ఉక్రేన్ డ్రోన్‌ల దాడిని కొనసాగించింది. జెలెన్‌స్కీ మాటలకు చర్యలకు పొంతనలేకుండా పోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై
# మోదీ మౌనమేలా?
### జైరామ్ రమేశ్ : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, మధ్యవర్తిత్వం చేసినట్లు ప్రకటనలపై ప్రధానమంత్రి తన ప్రసంగంలో పూర్తిగా మౌనం వహించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. ప్రధాని ప్రసంగంపై ఆయన తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. ఆయన స్పందన ఇలా ఉంది.''ప్రధానమంత్రి చాలా ఆలస్యంగా చేసిన దేశ ప్రజల ప్రసంగాన్ని, కొద్ది నిమిషాల ముందు అధ్యక్షుడు ట్రంప్ బైటపెట్టిన అంశాలు పూర్తిగా నీరుగార్చాయి. వాటి గురించి ప్రధాని పూర్తిగా మౌనంగా ఉన్నారు. అమెరికా మధ్యవర్తిత్వానికి భారతదేశం అంగీకరించిందా? పాకిస్తాన్‌తో చర్చల కోసం 'తటస్థ స్థలానికి' భారతదేశం అంగీకరించిందా? ఆటోలు, వ్యవసాయం, ఇతర రంగాలలో భా రతీయ మార్కెట్లను తెరవాలని అమెరికా డిమాండ్లకు భారతదేశం ఇప్పుడు లొంగిపోతుందా? ప్రధాని ఇంకా చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది.'' అని జైరామ్ రమేశ్ అన్నారు. మన సాయుధ దళాలను తాము నిస్సంకోచంగా అభినందిస్తున్నామని, వారికి సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. మరో కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చౌహాన్ ముంబైలో 'పిటిఐ'తో మాట్లాడు తూ ప్రధాని ప్రసంగంలో కశ్మీర్ సమస్య అంతర్జాతీయమైందా అనే గురించి, సిమ్లా ఒప్పందం గురించి ఎటువంటి ప్రస్తావన లేదని అన్నారు. డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని పాకిస్థాన్‌తో సమానంగా పరిగణించారని, ఈ స్థానాన్ని అంగీకరించడానికి భారతదేశం సిద్ధంగా ఉందా' అని ఆయన ప్రశ్నించారు.

## ఒక్కతూటా పేలకూడదు
(మొదటి పేజీ తరువాయి)

దేశాల సైనిక జనరల్స్ అంగీకరించారు.రెండు దేశాల డిజిఎంఓలమధ్యా మే 10వ తేదీ శనివారం మధ్యాహ్నం మొదటి సమావేశం జరిగింది. పాకిస్థాన్ డిజిఎంఓ స్వయంగా భారత డిజిఎంఓకు ఫోన్‌చేసి కాల్పుల విరమణ అంగీకారం గురించి చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వం తర్వాత ఆ ఫోన్‌కాల్ వచ్చింది. ఐతే వారి మొదటి సమావేశంలోనే మరోసారి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మాట్లాడుకోవాలని నిర్ణయించారు. ఐతే కాస్త ఆలస్యంగా సాయంత్రం ఐదు గంటలకు ఈ సమావేశం పూర్తయిందని భారత గగనతల సైనిక కార్యకలాపాల ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి చెప్పారు.

# మిస్రీ కుటుంబంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్

### ఎఐడి,ఎన్‌సిడబ్ల్యు ఖండన
### కఠిన చర్యలకు డిమాండ్

**న్యూఢిల్లీ:** భారత్‌–పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకపాత్ర వహించిన కేంద్ర ప్రభుత్వ ఉన్నతశ్రేణి వృత్తి నిపుణుడు విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబం పైన, ప్రత్యేకించి ఆయన కుమార్తెకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకునేందుకు, వారికి సమస్యలు సృష్టించేందుకు సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేస్థాయిలో ట్రోలింగ్స్ చేయడాన్ని భారత దౌత్యవేత్తల సంఘం (ఎఐడి), జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) తీవ్రంగా ఖండించాయి. నిష్కళంకమైన చరిత్రగల, సరోత్కృష్టమైన ప్రభుత్వ సేవల్లో ఉన్న మిస్రి కుటుంబంపై ఈ విధంగా ట్రోలింగ్‌లు భయంకరమైన విషయమని, పూర్తిగా ఎట్టిపరిస్థితుల్లోనూ సమ్మతింపరానిదని వారు పేర్కొన్నారు. ఈ విధమైన ట్రోలింగ్‌లకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రముఖ మహిళా మాజీ దౌత్యవేత్త నిరుపమా మీనన్ రావు, ఎఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ వంటివారు మిస్రి కుటుంబానికి అండగా నిలిచారు. ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా గట్టి మద్దతు తెలియజేశారు. మిస్రి నిష్కళంకమైన వ్యక్తి, మర్యాద,మన్ననగల అధికారి అని పేర్కొన్నారు.భారత్‌–పాకిస్థాన్ దేశాల సైనిక డైరెక్టర్ జనరల్స్ మధ్య ఒక అవగాహన కుదిరిందని ఆయన ప్రకటన చేసిన మరునాటి నుండి ఆయనపై తీవ్ర పదజాలంతో దూషణ ప్రారంభమైంది. ఆయన కుటుంబం లక్ష్యంగా ట్రోలింగ్ మొదలైంది. మిస్రి కుమార్తెపై తీవ్ర పదజాలంతో దూషణలు చేశారు. ఐతే ప్రభుత్వంగానీ, మంత్రులుగానీ ఆయనకు రక్షణకల్పించేవిధంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సమాజ్‌వాదీ లాంటి పార్టీలు విమర్శించాయి.

**ఆన్‌లైన్–ఆఫ్‌లైన్‌లో హుందాగా వ్యవహరించండి :** భారత్‌–పాకిస్థాన్ దేశాల మధ్య ఈనెల పదో తేదీన ఉద్రిక్తతలు సడలిపోవడానికి, సైనిక చర్యల ఉపసంహరణకు వీలుగా ఒక అవగాహన కుదరడంలో కీలకపాత్ర వ హించిన భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబం లక్ష్యంగా రెచ్చగొట్టేపద్ధతుల్లో ట్రోలింగ్ చేయడాన్ని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ డిప్లొమాట్స్ తీవ్రంగా ఖండించింది. ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ సోమవారం ఒక ప్రకటన చేస్తూ, మిస్రి కుమార్తె వ్యక్తిగత సమాచారం, ఆమెను సంప్రదించే నంబర్లను సోషల్ మీడియాలో షేరింగ్ చేయడాన్ని ఖండించారు. ఈ విధమైన షేరింగ్ పూర్తిగా బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఈ విధంగా వ్యక్తిగతంగా దాడిచేయడం నైతికంగా వారి కుటుంబానికి రక్షణ లేకుండా చేయడమేనన్నారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో అందరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ఈ విధమైన చర్యలకు దూరంగా ఉండాలని ఆమె పౌరులకు విజ్ఞప్తి చేశారు. హుందాగా,బాధ్యతాయుతమైన ప్రవర్తనతో సోషల్ మీడియాలో,బయట వ్యవహరించాలని ఆమె కోరారు. 2024 జులై 15వ తేదీన విక్రమ్ మిస్రి భారత విదేశాంగశాఖ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ 1989వ బ్యాచ్‌కు చెందిన దౌత్యవేత్త మిస్రి ప్రధాన మంత్రి కార్యాలయంలో, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో అనేక బాధ్యతలు నిర్వహించారు. యూరప్, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికా సహా అనేక దేశాలలో దౌత్యవ్యవహారాలు నడిపారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెబ్‌సైటులో ఈ అధికారిక సమాచారం లభ్యమైంది. విదేశీ వ్యవహారాల్లో పాకిస్థాన్‌కు సంబంధించిన విషయాలను, ఆ బాధ్యతలను ఆయన నిర్వహించారు. ఒకనాటి విదేశాంగమంత్రులు ఐ.కె.గుజ్రాల్, ప్రణబ్ ముఖర్జీలున్నప్పుడు వారికి ముఖ్యమైన సిబ్బందిలో ఒకరిగా బాధ్యతలు పంచుకున్నారు. గడచిన కొద్ది రోజులుగా భారత్‌–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకున్న పరిణామాల పూర్వరంగంలో ఆయన అనేక పత్రికాగోష్ఠులలో పాల్గొన్నారు. ముఖ్యంగా మే పదో తేదీన భారత్‌–పాకిస్థాన్ మధ్య సైనిక చర్యల విరమణ, ఉద్రిక్తతల సడలింపునకు సంబంధించిన అవగాహనా ఒప్పందంలో ఆయన కీలకపాత్ర వహించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో మొట్టమొదట కాల్పుల విరమణ అవగాహన గురించి పోస్టింగ్ చేశారు. ఈ మధ్యవర్తిత్వం తామే చేశామనీ, అమెరికా విజయమనీ ట్రంప్ పోస్టింగ్ పెట్టి కొద్దిసేపటికి విక్రమ్ మిస్రి భారత్ తరపున కాల్పుల విరమణ అవగాహనపై ప్రకటన చేశారు. రెండు దేశాలకు చెందిన మిలిటరీ డైరెక్టర్ జనరల్స్ శనివారంనాడు (మే 10) మధ్యాహ్నం 3.35 గంటలకు ఒక అవగాహనకు వచ్చారనీ, తదుపరి చర్చలు మే 12వ తేదీ మధ్యాహ్నం జరుగుతాయని ప్రకటించిన మరునాటి నుండి ట్రోలింగ్ ప్రారంభమైంది.

**ప్రభుత్వం పట్టించుకోలేదు:** మిస్రికి మద్దతుగా అఖిలేశ్ యాదవ్ ఎక్స్ వేదికగా హిందీలో ఆదివారంనాడు సుదీర్ఘమైన పోస్టింగ్ పెట్టారు. మిస్రి కుటుంబానికి కళంకం తెచ్చేవిధంగా ట్రోలింగ్ ఎంతో నిజాయతీగల అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఆయన దేశంకోసం రాత్రిపగలూ కష్టపడి అంకితభావంతో పనిచేస్తున్నారన్నరు. ''నిర్ణయాలు తీసుకునే బాధ్యత ప్రభుత్వానిదేగానీ, వ్యక్తిగత అధికారులది కాదు, కొన్ని సంఘవ్యతిరేక నేరశక్తులు బాహాటంగా పరిధులు దాటి క్రూరమైన దూషణలతో మిస్రి, మిస్రి కుటుంబంపైన ట్రోలింగ్ చేస్తున్నారు, బిజెపి ప్రభుత్వంగానీ ఏ ఇతర మంత్రులుగానీ ముందుకు వచ్చి ఆయనను ఆయన గౌరవాన్ని కాపాడే ప్రయత్నం చేయలేదు. వారి మర్యాద కాపాడేవిధంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పలేదు'' అని అఖిలేశ్ యాదవ్ పోస్టింగ్ పెట్టారు. ఒక సీనియర్ దౌత్యవేత్తపై ట్రోలింగ్ సిగ్గుచేటు అని నిరుపమారావు అన్నారు. మిస్రి కుమార్తెపై తీవ్రపదజాలంతో దూషణలు చేశారన్నారు.

### బిజెపి ఎందుకు మౌనం వహించింది?
### తక్షణ విచారణకు వామపక్షాల డిమాండ్

భారతవిదేశాంగ కార్యదర్శి మిస్రి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఆయనకు మద్దతు ప్రకటించాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎందుకు మౌనం వహించిందని వామపక్షాలు ప్రశ్నించాయి. మతప్రాతిపదికపై భారతదేశాన్ని విభజించాలని ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారనీ, భారత ప్రజలు ఐక్యంగా ఈ ప్రయత్నాలను ఓడించారనీ మిస్రి ప్రకటించినందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ఎక్స్ వేదికగా విమర్శించింది. మనదేశ ఐక్యతను, ప్రజాస్వామ్యాన్ని ఎవరు ద్వేషిస్తున్నారో చాలా స్పష్టమైన విషయమని కూడా సిపిఐ పేర్కొంది. తక్షణం దీనిపై విచారణ జరిపించాలని, హోంమంత్రి చర్యలు తీసుకోవాలని కోరాయి. రాజ్యసభలో సిపిఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నాయకుడు బ్రిట్టస్ ఈ ట్రోలింగ్‌ను ఖండించారు. ఆన్‌లైన్‌లో వరద ప్రవాహంలా ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా ఎందుకు ట్రోలింగ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో ఎంతో సమన్వయంతో ఆయనపై దాడి జరుగుతోందన్నారు. హోంమంత్రి అమిత్ షా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా సిపిఐ(ఎం) పోస్టింగ్ పెడుతూ, మిస్రి కుమార్తెపై ట్రోలింగ్ జరుగుతోందని పేర్కొంది. వాటి ఇమేజస్‌ను షేర్ చేసింది. ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? ఇది సిగ్గుచేటు కాదా? అని ప్రశ్నించింది. అధికారపార్టీ నిర్ణయాలు తీసుకుంటుందని, వాటికి వ్యక్తిగతంగా ఉన్నతాధికారుఉ ఎలాంటి బాధ్యతా వహించలేరని పేర్కొంది. ఆయనపై వ్యక్తిగత దాడి చేస్తున్నారనీ, ఆయనను ఒంటరిని చేసి ట్రోలింగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. అదేవిధంగా పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన నావికాధికారి లెఫ్టినెంట వినయ్ నర్వాల్ భార్య హిమాంషి నర్వాల్‌కు వ్యతిరేకంగా కూడా సైబర్‌మార్గంలో విద్వేష ప్రచారం చేస్తున్నారని బ్రిట్టస్ విమర్శించారు. సిపిఐ (మార్క్సిస్ట్–లెనినిస్టు) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా ఖండించారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మిస్రిపై ట్రోలింగ్ చేస్తున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి నిర్ణయం తీసుకుంటే మిస్రికి వ్యతిరేకంగా ఎందుకు ట్రోలింగ్ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదులు చేసిన మతోన్మాద కుట్రలను భారతదేశ ప్రజలు విఫలం చేశారంటూ మిస్రి కృతజ్ఞతలు చెప్పినందుకే ఆయనకు వ్యతిరేకంగా ట్రోలింగ్ జరుగుతోందా? అని ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు.

## 6 శాతం ప్రగతి (మొదటి పేజీ తరువాయి)

ఆశించినంత వేగం కనిపించలేదని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. ఎక్సైజ్ శాఖ ద్వారా ఆదాయం పెంచుకునే క్రమంలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వాటిని గుర్తించి సరి చేయాలని తెలిపింది. రవాణా శాఖలో కొత్తగా తీసుకొచ్చిన ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికోగ్నైజేషన్ (ఎఎన్‌పిఆర్) వివిధ శాఖల్లోనూ విస్తృతంగా వినియోగించుకుని, పెద్ద మొత్తంలో తనిఖీలు చేపట్టాలని మంత్రుల బృందం ఆదేశించింది.

**విలువైన భూములను సంరక్షించండి:** జిల్లా కేంద్రాల్లో ఉన్న విలువైన భూములను గుర్తించి, వాటిని సంరక్షించే బాధ్యతలు వెంటనే చేపట్టాలని రెవెన్యూ అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. నిర్మాణాల అనుమతుల విషయంలో హెచ్ఎండిఎ వేగాన్ని పెంచాలని సూచించింది. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సొసైటీల ద్వారా ఇసుక అమ్మకాలు జరపాలని, నిజమైన వారిని గుర్తించి గిరిజన సొసైటీ లో సభ్యులుగా చేర్చాలని, గిరిజన సంక్షేమ శాఖ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి పకడ్బందీగా అమలు చేసి, అసలైన గిరిజనులకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, రోడ్డు,భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, సిసిఎల్ఎ కమిషనర్ నవీన్ మిట్టల్, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, మైన్స్ అండ్ జియాలజీ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, రవాణ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి , డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నిలిపివేత తాత్కాలికమే
(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ కేవలం ఒక పేరు మాత్రమే కాదని, దాని ద్వారా భారతదేశ సంకల్పం.. చర్యగా మారడాన్ని ప్రపంచమంతా చూసిందని, 100 మందికి పైగా భయంకరమైన ఉగ్రవాదులు హతమయ్యారని అన్నారు.'భారతదేశం ఎలాంటి అణు బెదిరింపును సహించబోదు. పాకిస్థాన్ పై మా చర్యలను తాత్కాలికంగా నిలిపివేశాము. వారి ప్రవర్తనను బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ ఇప్పుడు ఉగ్రవాదంపై భారతదేశం కొత్త విధానం, ఒక కొత్త గీత గీయబడింది' అని ఆయన అన్నారు.ఉగ్రవాదులను, వారిని సహాయం అందించే దేశాలను భారతదేశం వేరువేరుగా చూడదని ప్రధాని మోదీ అన్నారు. 'ఇది యుద్ధాల యుగం కాదు, అలాగే ఇది ఉగ్రవాద యుగం కూడా కాదు' అని ఆయన అన్నారు. 'పాకిస్థాన్ తన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయాలి. శాంతికి మరో మార్గం లేదు అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'పహల్గాం దాడి ఉగ్రవాదపు అత్యంత క్రూరమైన ముఖం, అది నన్ను వ్యక్తిగతంగా బాధించింది. ఉగ్రవాదులను మట్టి కరిపించేందుకు మేము సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాము. మన మహిళల నుదుటి నుండి 'సిందూరం' తొలగించిన పర్యావసానాలను శత్రువు ఇప్పుడు గ్రహించాడు. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు మాత్రమే కాదు... మే 7న,మన సంకల్పం చర్యగా మారడాన్ని ప్రపంచమంతా చూసింది' అని ఆయన అన్నారు.'మన క్షిపణులు, డ్రోన్లు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసినప్పుడు, వారి భవనాలు మాత్రమే కాదు, వారి ఆత్మ కూడా ధ్వంసమైంది. 'దేశమే ముందు' అనే సంకల్పం మనకు ఉన్నప్పుడు, గట్టి నిర్ణయాలు తీసుకోబడతాయి' అని ఆయన అన్నారు.భద్రతా దళాలకు సెల్యూట్ చేస్తూ, వారి ధైర్యాన్ని ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులు, కుమార్తెలకు అంకితం చేస్తున్నానని అన్నారు. ఉగ్రవాద శిబిరాలపై భారత దాడి తర్వాత పాకిస్థాన్ నిరాశలోకి కూరుకుపోయింది, వారు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి సహాయం చేయడానికి బదులుగా మనపైనే దాడి చేయడానికి ధైర్యం చేశారని, భారత దాడిలో 100 మందికి పైగా భయంకరమైన ఉగ్రవాదులు హతమయ్యారని మోదీ చెప్పారు. 'పాకిస్థాన్ డ్రోన్లు మన సైనిక శక్తి చేత ఏ విధంగా కూల్చివేయబడ్డాయో ప్రపంచమంతా చూసింది. పాకిస్థాన్ గుండెల్లోకి భారతదేశం చొచ్చుకుపోయింది, వారి వైమానిక స్థావరాలను దెబ్బతీసేందుకు మన క్షిపణులు ఖచ్చితత్వంతో దాడి చేశాయి' అని ఆయన అన్నారు. పాకిస్థాన్ మన సరిహద్దుల్లోకి చొచ్చుకురావాలని ప్రణాళికలు రచిస్తే, మనం వారి ఎదపైనే దాడి చేశామన్నారు.

## యుద్ధాన్ని మేమే ఆపాం
(మొదటి పేజీ తరువాయి)

విరమణకు సహాయం చేసింది' అని ట్రంప్ వైట్ హౌస్‌లో విలేకరుల సమావేశం ప్రారంభంలో చెప్పారు. భారత ఉపఖండంలో 'గత కొన్ని రోజులుగా జరిగిన చారిత్రాత్మక సంఘటనలను'' అంటూ ఆయన విలేకరుల సమావేశాన్ని ప్రారంభించారు.నాలుగు రోజుల తీవ్రమైన సరిహద్దు డ్రోన్ మరియు క్షిపణి దాడుల తర్వాత సంఘర్షణను ముగించడానికి భారతదేశం, పాకిస్తాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చాయి. భారత్, పాకిస్తాన్ దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) భూమి, గాలి , సముద్రంలో అన్ని కాల్పులు సైనిక చర్యలను తక్షణమే నిలిపివేయడానికి ఒక అవగాహనకు వచ్చారని న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో తృతీయ పక్షం ప్రమేయం లేదని వారు చెప్పారు. భారతదేశం,పాకిస్తాన్ తీవ్రంగా పోరాడుతున్నాయని, అవి ఆగేలా కనిపించడం లేదని ట్రంప్ అన్నారు. తాము చాలా సహాయం చేశామని, వ్యాపారంలో కూడా సహాయం చేసామని, ''రండి, మేము మీతో మరింత వ్యాపారం చేయబోతున్నాము. దీన్ని ఆపేద్దాం. మీరు ఆపితే, మేము వ్యాపారం చేస్తాము. మీరు ఆపకపోతే, మేము ఏ వ్యాపారం చేయం'' అని ఇరువురికి చెప్పినట్లు అని ట్రంప్ అన్నారు.'''నేను ఉపయోగించినట్లుగా ప్రజలు వాణిజ్యాన్ని ఎన్నడూ ఉపయోగించలేదు, అంత వరకు నేను చెప్పగలను. అంతే అకస్మాత్తుగా వారు (భారతదేశం, పాకిస్థాన్) 'మేము ఆపేస్తామని అనుకుంటున్నాము' అని చెప్పారు.' అని ట్రంప్ తెలిపారు.'వారు చాలా కారణాల వల్ల ఆ పని చేశారు. కానీ వ్యాపారం ఒక పెద్ద కారణం. మేము పాకిస్తాన్‌తో చాలా వ్యాపారం చేయబోతున్నాము. మేము భారతదేశంతో చాలా వ్యాపారం చేయబోతున్నాము. మేము ప్రస్తుతం భారతదేశంతో చర్చలు జరుపుతున్నాము. మేము త్వరలో పాకిస్తాన్ తో చర్చలు జరుపుతాము. మేము అణ్వాయుధ సంఘర్షణను ఆపాము' అని ట్రంప్ అన్నారు.'నా అభిప్రాయం ప్రకారం... ఇది ఒక ఘోరమైన అణ్వాయుధ యుద్ధం అయి ఉండేది. మిలియన్ల మంది ప్రజలు చనిపోయి ఉండేవారు. కాబట్టి నేను దాని గురించి చాలా గర్వపడుతున్నాను. వైస్ ప్రెసిడెంట్ వాన్స్, విదేశాంగ కార్యదర్శి రూబియో చేసిన పనికి, ప్రయత్నాలకు కూడా నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను, వారు దానిపై చాలా కష్టపడ్డారు' అని ట్రంప్ అన్నారు.'అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగిన సుదీర్ఘ రాత్రి చర్చల తర్వాత భారతదేశం, పాకిస్తాన్ 'పూర్తి , తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించాయని ట్రంప్ శనివారం ప్రకటించారు.

## హైదరాబాద్ జిసిసి హబ్
(మొదటి పేజీ తరువాయి)

ముందు చాటడానికి ప్రతి ఒక్కరి సహకారం కావాలని, హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు. హైదరాబాద్ అంతర్జాతీయ ప్రాముఖ్యత పెరిగిందని, ప్రస్తుతం మిస్ వరల్డ్ పోటీలకు ఈ నగరం ఆతిథ్యమిస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లు హైదరాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. తెలంగాణ అనేక కీలక రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం పోలీసింగ్‌లో గానీ, చట్టాలను సక్రమంగా అమలు చేయడంలోగానీ, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ కల్పన, పన్నుల వసూళ్లలో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జి) ద్వారా 66 లక్షల మందికి పైగా మహిళలకు సాధికారత కల్పిస్తూ, దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఫండింగ్, మెంటరింగ్ కార్యక్రమాన్ని తెలంగాణ అమలు చేస్తోందన్నారు. భారతదేశంలోనే అత్యంత శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని చేపట్టామని, ఇందులో ప్రత్యేకంగా 'ఎఐ సిటీ' కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. 2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు తెలంగాణ రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, దాదాపు 1 లక్షకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించామని, దావోస్ వరల్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశాల ద్వారా పెట్టుబడుల ఆకర్షణలో భారతదేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిచిందని, దావోస్ సమావేశంలోనే రూ1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు లభించాయని సిఎం వివరించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎఐ మెషిన్ లెర్నింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ప్రపంచంలోనే తెలంగాణను లీడర్‌గా తీర్చి దిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణను ఎఐ లీడర్‌గా మార్చేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించామని, 'ఎఐ సిటీ'కి శ్రీకారం చుట్టామని, ఈ సిటీలో భాగస్వామయ్యేందుకు మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపించాయి. ఎఐలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు త్వరలోనే ఎఐ యూనివర్సిటీని ప్రారంభించనున్నామన్నారు.

**గవర్నర్‌తో సిఎం భేటీ**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. భారత్‌–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో వారిరువురూ సోమవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులపై వారిద్దరు మాట్లాడుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ముఖ్యమంత్రి వివరించారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ అమలు చేస్తున్న సన్న బియ్య, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం తదితర కార్యక్రమాల తాజా వివరాలను గవర్నర్‌కు సిఎం వివరించినట్లు సమాచారం. మరోవైపు ఇటీవల జరిగిన ఎంఎల్‌సిల నియామకం, తాజాగా రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్, ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ల నియామకం తదితర అంశాలపై కూడా వారిరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

## 90 రోజుల విరామం
(మొదటి పేజీ తరువాయి)

నుంచి 10 శాతానికి తగ్గించుకున్నాయి. ఇరు దేశాలు పెంచిన సుంకాలలో 115 శాతం తగ్గించుకున్నాయి. ఇరు దేశాల మధ్య జెనీవాలో శనివారం జరిగిన చర్చల వివరాలను సోమవారం ఏర్పాటు మీడియా సమావేశంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జామైసన్ గ్రీర్, ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్‌లు సుంకాల తగ్గింపు గురించి ప్రకటించారు. చైనా సరుకులపై విధించిన సుంకంపై 115 శాతం తగ్గించడంతో, ప్రస్తుతం ఉన్న 145 శాతం తో 30 శాతానికి తగ్గించినట్లు గ్రీర్ వెల్లడించారు. అదే సమయంలో, అమెరికా సరుకులపై చైనా విధించిన టారిఫ్‌ను 10 శాతానికి తగ్గించేందుకు అంగీకరించిందన్నారు. వాణిజ్య అంశాలపై చర్చలు కొనసాగేందుకు ఇరు పక్షాలు సంప్రదింపుల వ్యవస్థకు ఏర్పాట్లు చేశాయని తెలిపారు. ఇరు దేశాల ప్రతినిధులు గత వారాంతంలో సమావేశం అయ్యామని, ఇరుపక్షాలు కూడా ప్రతిష్టంభన వీడాలనే విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని బెస్సెంట్ అన్నారు. అత్యంత అధిక సుంకాల ఫలితంగా ఆంక్షల తరహాలో దిగుమతుల నిషేదం వంటి పరిస్థితి నెలకొన్నదని, ఇరు పక్షాలు కూడా అలా కావాలని కోరుకోవడం లేదని చెప్పారు. తమకు కూడా వాణిజ్యం జరగాలని ఉన్నదని, తమకు మరింత సంతులిత వాణిజ్యం కావాలని, ఉభయ పక్షాలు కూడా దానిని సాధించేందుకు కట్టుబడి ఉన్నట్లు భావిస్తున్నానని చెప్పారు. ఈ ఒప్పందం ఇరుదేశాల విభేదాల పరిష్కారానికి ముఖ్యమైన చర్య అని, ఇది ముమ్మందు సహకారానికి పునాదులు వేస్తుందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. ఈ చొరవ ఇరు దేశాల ఉత్పత్తిదారులు, వినియోగదారుల ఆకాంక్షలను ఒకే దగ్గరకు చేర్చుతాయని, ఇరు దేశాల ప్రయోజనాలను, ప్రపంచ ఉమ్మడి ప్రయోజనాలను చేకూరుస్తుందని పేర్కొంది. అమెరికా ''ఏకపక్ష వాణిజ్య పెంపుదల వంటి అసంబద్ధ విధానాన్ని'' నిలిపివేస్తుందని చైనా ఆశిస్తుందని, చైనాతో కలిసి పని చేయడం ద్వారా ఆర్థిక, వాణిజ్య సంబంధాల అభివృద్ధికి రక్షణ కల్పిస్తూ, ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మరింత నిశ్చితి, సిరత్వాన్ని అందిస్తారని భావిస్తున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. వాషింగ్టన్, బీజింగ్ విధించిన క్లిష్టమైన సుంకాలు, ఇతర వాణిజ్య దండనల పూర్తి ప్రభావం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. తొంభై రోజుల విరామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అంతరాలను తొలగించుకునేందుకు మార్గాలను ఎంత వరకు కనుగొంటారనే అంశంపై ఇది ఆధారపడింది. అయితే, రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలకు చెందిన వాణిజ్య రాయబారులు వెనక్కి తగ్గడంతో ప్రపంచ మార్కెట్‌లు కోలుకోవడంతో, ఇన్వెస్టర్‌లకు ఊపునిచ్చింది. ఎస్ అండ్ పి ఫ్యూచర్స్ 500 2.6 శాతానికి పెరగగా, డో జోన్స్ పారిశ్రామిక సగటు 2 శాతానికి పెరిగింది. చమురు ధరలు బ్యారెల్‌పై 1.60 అమెరికన్ డాలర్‌లకు పైగా పెరగగా, యూరో, జపానీస్ యెన్‌తో పోల్చినప్పుడు అమెరికా డాలర్ విలువ పెరిగింది. చైనాలోని యూరోపియన్ యూనియన్ ఆఫ్ ఛాంబర్ అధ్యక్షుడు జెన్స్ ఎస్కెలండ్ ఈ పరిణామాన్ని స్వాగతిస్తూనే, 90 రోజుల్లో ఏమి జరుగుతోందోననే పెద్ద అనిశ్చితి కొనసాగుతుందని హెచ్చరించారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా సరుకులపై 145 శాతం సుంకాలు పెంచగా, ప్రతిగా ఆ దేశ సరుకులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. సుంకాలు అత్యధిక స్థాయిలో ఉండడంతో పరస్పరం ఉత్పత్తులను బహిష్కరించుకునే పరిస్థితికి చేరుకొని, వాణిజ్యం దెబ్బతిన్నది.గత ఏడాది ఇరు దేశాల మధ్య 660 బిలియన్‌ల అమెరికన్ డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది. కాగా, చైనా తరుపున జెనీవా చర్చల్లో స్టేట్ కౌన్సిల్ వైస్ ప్రీమియర్ హీ లైఫెంగ్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రపంచ సుందరి పోటీదారులు నీరా కేఫ్‌ను సందర్శించడం హర్షణీయం

తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ సుందరి పోటీల సందర్భంగా ఈ పోటీల్లో పాల్గొంటున్న ప్రపంచ దేశాల సుందరీమణులు నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్‌ను సందర్శించి నీరా, తాటి ముంజలు సేవించే అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ప్రాచీన వృత్తులలో ఒకటైన కల్లు గీత వృత్తిదారులు ప్రకృతి నుండి స్వీకరించే నీరా, కల్లు ముంజలు, గేగులు, తాటి పండ్లు తదితర ఆహార ఉత్పత్తులు, ఖనిజాలు, అత్యంత పోషక విలువలతో కూడిన ఇవన్నీ ఎంతో ఆరోగ్యకరమైనవన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలకు మరోసారి వెలుగులోకి తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి బొమ్మగాని ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

## ప్రజలకు మరింత చేరువగా..
# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెండవ దశలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానం సోమవారం ప్రారంభమైంది. స్లాట్ బుకింగ్ విధానం పని తీరును రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఆయా జిల్లాల్లో స్లాట్ బుకింగ్ పనితీరును, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన వారి స్పందనను అడిగి తెలుసుకున్నారు. అలాగే మొదటి దశలో ప్రారంభమైన 22 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులో ఉన్న స్లాట్‌బుకింగ్ పనితీరును కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రజలకు మరింత చేరువచేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌బుకింగ్ విధానం అమలులోకి వచ్చిందని, వచ్చే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించి క్యూ లైన్లలో నిల్చునే పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు, పారదర్శకతను తీసుకురావడానికి ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పే రోజులు వస్తాయని, దళారుల ప్రమేయం కూడా ఉండబోదన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్ registration.telangana.gov.in స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏరోజు వీలుంటే ఆరోజు, ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందన్నారు. సేవలల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల్లో రిజిస్ట్రార్ల సంఖ్య కూడా పెంచుతున్నామని మంత్రి వివరించారు.

**10 నిముషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి**
**సంతోష్ కుమార్ ( ఉప్పల్ ఎస్ఆర్ఒ ఆఫీస్)**
ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో శుక్రవారం ఇంటి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నాను. ఐఐసిటి కాలనీ, బోడుప్పల్‌లో ఉంటున్నా.. రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లినంత సమయంలో కేవలం 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయింది. అరగంట వ్యవధిలోనే డాక్యుమెంటు తీసుకొని బయటికి వచ్చాం. ఈ విధానం చాలా బాగుంది. దీనివల్ల ఎక్కడా ఇబ్బంది పడలేదు, సమయం కూడా చాలా ఆదా అయింది.

**అరగంటలో రిజిస్ట్రేషన్ పూర్తి.. చేతికి డాక్యుమెంట్లు**
**ఎ.శ్రీలత (కాప్రా- ఎస్.ఆర్.ఒఆఫీస్)**
రెండు, మూడు రోజుల సమయం పట్టే రిజిస్ట్రేషన్ ప‌క్రియ 15 నిమిషాల్లోనే పూర్తయింది. సోమవారం కాప్రా ఎస్.ఆర్.ఒ ఆఫీస్‌లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. గతంలో రిజిస్ట్రేషన్‌కు ఒక రోజంతా ఉండేవాళ్లం. తరువాత 2 నుంచి 3 రోజుల తర్వాత మాకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చేవారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ 15 నిముషాల్లో పూర్తయింది. మరో 15 నిమిషాల్లో డాక్యుమెంట్లు సిద్ధమయ్యాయి. రద్దీ లేకుండా ప్రశాంత వాతావరణంలో పని పూర్తయింది. దీనినే కొనసాగించడం ఎంతో ఉత్తమం

**ఒకే రోజు స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి :**
**ఎన్.సరళ (హనుమకొండ-ఎస్.ఆర్.ఒ ఆఫీస్)**
హనుమకొండ ఎస్.ఆర్.ఒ ఆఫీస్‌లో సోమవారం ఒకే రోజు స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తవ్వడం చాలా సౌకర్యంగా ఉన్నది. గతంలో రిజిస్ట్రేషన్ ఒక తంతు అయితే మ్యుటేషన్ మరో తంతుగా మూడు రోజులకు మించి జరిగేది. ఈ కొత్త స్లాట్ విధానంతో మా స్లాట్ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిపోయింది. డాక్యుమెంట్ రైటర్ సాయంతో మేం స్లాట్ బుక్ చేసుకున్నాం. మాకు ఎక్కడా అదనపు ఖర్చులు లేవు. ఇదొక సూపర్ సిస్టమ్.

**రిజిస్ట్రేషన్ తొందరగా పూర్తయింది :**
**ఎ.భారతమ్మ (కల్వకుర్తి ఎస్.ఆర్.ఒ ఆఫీస్)**
కల్వకుర్తి ఎస్.ఆర్.ఒ ఆఫీస్‌లో సోమవారం మా ఇంటి స్థలం కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తయింది. నిన్ననే స్లాట్‌ను బుక్ చేయించాం. గతంలో తరహా డాక్యుమెంట్ రైటర్ల హవా కనిపించలేదు. అధికారులు చాలా బాగా సహకరించారు. పని చాలా తొందరగా పూర్తయింది. మొదటి నుంచి స్లాట్ బుకింగ్‌కు అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంతో హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ జరిగింది. ఇటువంటి విధానాలు ప్రజలకు ఉంటే ఉపయోగం. మాతో పాటు రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## 50ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, చరిత్ర కలిగిన ..
# 'అరుణోదయ' మరింత బలోపేతం కావాలి

సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మట్టి మనుషులను జ్ఞానం వైపు నడిపిన గొప్ప సాంస్కృతికోద్యమ సంస్థ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అని పలువురు వక్తలు కొనియాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల స్ఫూర్తి సభ సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జెండాను సంస్థ రాష్ట్ర నాయకులు అరుణోదయ రామన్న ఆవిష్కరించారు. అనంతరం విమలక్క అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథులుగా సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రచయిత బుర్ర రాములు, మానవ హక్కుల నేత జీవన్‌కుమార్, రచయితలు, కవులు, సంస్థ ప్రతినిధులు డాక్టర్.ఎ.కె. ప్రభాకర్, కొల్లాపురం విమల, రాంసత్తయ్య, ఎనిశెట్టి శంకర్, అంబిక హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, చరిత్ర కలిగిన అరుణోదయ సాంస్కృతిక సంస్థ మరింత బలోపేతం కావాలన్నారు. ఇందుకు జార్జిరెడ్డి, రాజన్న, జంపాల, ప్రసాద్, చంద్రశేఖర్ చౌరవతో ఏర్పడిన పిడిఎస్‌యు, పిఒడబ్ల్యు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలు ఏకం కావాలన్నారు. విమల మాట్లాడుతూ సాంస్కృతికోద్యమం భవిష్యత్ తరాలకు ఆయుధంలాంటిదని, ఇందుకు అరుణోదయ సాంస్కృతిక సంస్థ నాయకత్వం వహించాలన్నారు. ప్రపంచ దేశాల్లో మహిళలు నిర్వహిస్తున్న ఉద్యమ సంస్థలు ఒకటి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కాగా, మరోటి లాటిన్ అమెరికాలోని జపతిష్ట్ ఉద్యమ సంస్థ అన్నారు. ఎలిశెట్టి శంకర్ మాట్లాడుతూ 100 ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అన్ని రకాల పీడనలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర మాత్రం పూర్తిస్థాయిలో రికార్డు కాలేకపోయిందన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు తమ సౌహార్ద సందేశాలను ఇచ్చారు. ప్రారంభ సభ అనంతరం అరుణోదయ సావనీర్‌ను ఎలిశెట్టి శంకర్ ఆవిష్కరించగా, మూడు విప్లవ సంస్థల 50 ఏళ్ల పాటను అంబిక ఆవిష్కరించారు. అనంతరం ప్రజాసంస్కృతి సాంస్కృతికోద్యమ నిర్మాణ ఆవశ్యకత అనే అంశంపై మోత్కూర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రొఫెసర్ కాసిం, ప్రొఫెసర్ లక్ష్మి, రచయితలు బి.ఎస్.రాములు, జిలుకర శ్రీనివాస్, జూపాక సుభద్ర సహా పలువురు వక్తలు ప్రసంగించారు. అనంతరం సాయంత్ర 7 గంటల నుంచి 9.30 గంటల వరకు అరుణోదయ కళాకారులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు సభికులను ఆకట్టుకున్నాయి. సభ ప్రారంభానికి ముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం చుట్టూ అరుణోదయ కళాకారులు కళా ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు మల్సూర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.

## సవివరమైన నివేదికకు తెలంగాణ బిసి కమిషన్ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తిట్టు పదాలుగా ఉన్న పేర్లను మార్చాలని కోరిన దొమ్మర, పిచ్చకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, వీరముష్టి, పర్యాయపదాలు చేర్చాలని కోరిన కుమ్మర, రజక, మేర కులాల విషయంలో నిర్దిష్ట సిఫారసులతో కూడిన ఒక సవివరమైన నివేదికను తెలంగాణ బిసి కమిషన్ ఆమోదించింది. ఈ నివేదికను కమిషన్ ప్రభుత్వానికి అందజేయనుంది. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయంలో సోమవారం కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయాదేవి, ఉపసంచాలకులు యు.శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి జి. సతీష్ కుమార్, పరిశోధన అధికారి జి.లక్ష్మి నారాయణలు పాల్గొన్నారు. సుమారు 3 గంటలపాటు వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, కమిషన్ పలు నిర్ణయాలను తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి వెనుకబడిన తరగతుల జాబితాను రూపొందించే క్రమంలో తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చే విషయమై బహిరంగ విచారణ జరిపి, ఈ విషయంలో వినతులు, అభ్యంతరాలను స్వీకరించాలని కమిషన్ నిర్ణయించింది. ఇందుకోసం ఈనెల 15వ తేదిన ఒక నోటిఫికేషన్‌ను జారీ చేయాలని సభ్యులు నిర్ణయించారు. వచ్చే నెల 9, 10, 11 తేదీలలో ఈ బహిరంగ విచారణ నిర్వహణతో పాటు ఈనెల 31వ తేదీ నుండి వచ్చే నెల 13వ తేది వరకు పోస్టు ద్వారా, స్వయంగా కమిషన్ కార్యాలయంలో వినతులు, అభ్యంతరాలను సమర్పించవచ్చు.

## కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను
# ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి





గుర్తింపు కార్డులు జారీ చేయాలి

కౌలు రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని వివిధ రైతు సంఘాల నాయకులు, పలువురు రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో సోమవారం కౌలు రైతుల సమస్యలపై రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు, కౌలు రైతుల నుంచి కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, భవాని రెడ్డిలు అభిప్రాయాలను సేకరించారు.
ఈ సందర్భంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రైతు సంఘాల నాయకులు , కౌలు రైతులు కమిషన్‌కు విన్నవించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తమకు సంబంధమే లేదంటూ కౌలు రైతులను పూర్తిగా నడిరోడ్డుపైకి నెట్టివేసిందని, కాంగ్రెస్ వస్తే తమ బతుకులు బాగుపడుతాయని ఎంతో ఆశపడిన కౌలు రైతులకు నిరాశ మిగులుతోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కౌలు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, తక్షణం 2025 ఖరీఫ్ సీజన్ నుంచి కౌలు రైతుల గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కౌలు రైతులు కురువ మంజుల( వికారాబాద్), రమాకాంత్ (ఆదిలాబాదు), మాదాసు మాధవి( కరీంనగర్), చాపల సుజాత, (మహబూబాబాద్), ఎడ్ల మానస (జయశంకర్), ముదస్తు సుమలత(జయశంకర్), శ్రీనివాస్( ఆదిలాబాదు), రాందాస్ (యాదాద్రి భువనగిరి), రమేష్ (ఆదిలాబాదు), రైతు స్వరాజ్య వేదిక నాయకులు బి. కొండల్, కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్, ఎస్. ఆశాలత పాల్గొన్నారు.
**కౌలు రైతుల మీడియా సమావేశం :** కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పలువురు కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చూపాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం కౌలు రైతులతో కలిసి రైతు స్వరాజ్య వేదిక నాయకులు బి. కొండల్, కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్, ఎస్. ఆశాలత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ తమ వరంగల్ డిక్లరేషన్‌లోనూ, ఆరు గ్యారంటీలలోనూ కౌలు రైతులకి పథకాలు అందిస్తామని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 16 నెలలు అవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పూర్తి అన్యాయం వారు అవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు ఆత్మహత్యలలో 75 శాతం కౌలు రైతులవే అని, కౌలు రైతులను గుర్తించి వారికి పూర్తి మద్దతు అందిస్తేనే రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణను సాధించగలమని నాయకులు పేర్కొన్నారు.. వరి పంట కొనుగోలులో ఇస్తున్న రూ.500 బోనస్‌ను కౌలు రైతులకి కూడా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, చాలా తక్కువ శాతం కౌలు రైతులకి మాత్రమే అది అందిందని, అందరికీ అందించాలని వారు డిమాండ్ చేశారు.

**రాష్ట్రంలో 2011 మనీ లెండింగ్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలి : రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**
రాష్ట్రంలో 2011 మనీ లెండింగ్ యాక్ట్, రూల్స్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేసింది. సోమవారం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, భవానిరెడ్డిలు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిశారు. ఈసందర్భంగా వారు గత 10ఏళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన రైతు ఆత్మహత్యలకు గల కారణాలపై కమిషన్ రూపొందించిన నివేదికను అందజేశారు. ఈ సందర్భగా గడిచిన 10ఏళ్లలో రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ప్రైవేట్ అప్పులేనని చైర్మన్ కోదండరెడ్డి వివరించారు. ప్రైవేట్ అప్పులు, వడ్డీరేట్లు ఎక్కువగా ఉండడం వల్ల ప్రధానంగా కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవిందు, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా వాట్సప్ గ్రూపులో పోస్టు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** ఆర్థిక ఇబ్బందులతో ఓ యువ రైతు ఇంట్లోనే ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడపలో గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. రెండు రోజుల ముందుగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా వాట్సప్ గ్రూపులో విడియో పోస్టు షేర్ చేసి ఆత్మ హత్య చేసుకోవడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుప్ప సంజీవులు(38) అనే రైతు తనకున్న రెండు ఎకరాలలో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయ సాగు కోసం చేసిన అప్పులు, తన కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురికావడంతో మరిన్ని అప్పులు అధికం కావడంతో ఇటీవల కొంత వ్యవసాయ భూమి అమ్మినట్లు తెలిపారు. అయినప్పటికీ అప్పులు పూర్తిగా తీరకపోవడంతో మానసిక వేదనకు గురైన యువకుడు శనివారం సాయంత్రం తాను క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు చేసుకుంటున్నట్లుగా తాను విడియో తీసుకోని గ్రామ వాట్సప్ గ్రూపులో షేర్ చేశాడు. అయితే అప్పుడప్పుడు మద్యం సేవించి అలాగే ప్రవర్తిస్తాడాన్న నేపంతో గ్రామస్థులు ఎవరూ పట్టించుకోలేదు. కాగా గత వారం రోజుల క్రితం భార్యతో గొడవ పడటంతో తన పిల్లలతో ఆమె పుట్టింటికి వెళ్లిపోగా ఒక్కడే గ్రామంలో ఉటుంటున్నారు. సోమవారం ఉదయం తాళం వేసి ఉన్న తన ఇంట్లో నుండి దుర్వాసన వస్తుండటంతో ఇరుగుపొరుగు వారు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో రెండు రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకోని, శవ పంచనామా నిర్వహించిన అనంతరం మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కేసు విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతునికి వృద్ధ తల్లితో పాటు ముగ్గురు కూమార్తెలు ఉన్నారు.

## దేశ సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగి వస్తున్న తెలంగాణ పౌరులకు
# రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తల మధ్య దేశ సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగి వస్తున్న తెలంగాణ పౌరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నోడల్ ఆఫీస్‌గా పనిచేస్తోంది. సోమవారం మధ్యాహ్నం వరకు 162 మంది పౌరులు తెలంగాణ భవన్‌కు చేరుకోగా, వీరిలో జమ్మూకశ్మీర్‌లోని వివిధ విద్యాసంస్థల నుండి 56 మంది, పంజాబ్ రాష్ట్రం నుండి 106 మంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటివరకు 133 మంది తమ స్వగ్రామాలకు బయలుదేరగా, మిగిలినవారికి తెలంగాణ భవన్‌లో తాత్కాలిక వసతి, భోజనం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సోమవారం తెలంగాణ భవన్ అధికారులతో సమీక్ష జరిపి, అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ "పరిస్థితి నెమ్మదిగా సాధారణమవుతుండటంతో మా విద్యాసంస్థలు తిరిగి క్లాసులకు హాజరు కావాలని సూచిస్తున్నాయి. అయితే మేము ముందుగా ఇంటికెళ్లి, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకున్న తర్వాతే మళ్లీ క్యాంపస్‌కు వెళ్లాలనుకుంటున్నాం" అని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సంబంధిత యూనివర్సిటీల అధికారులతో మాట్లాడి, విద్యార్థులకు తాత్కాలికంగా ఆన్‌లైన్ తరగతులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీలు అందుకు సానుకూలంగా స్పందించాయి. కాగా కొంతమంది చివరి సంవత్సరం విద్యార్థులు పరిస్థితి మెరుగుపడే వరకు ఢిల్లీలోనే వేచి చూసి తిరిగి క్యాంపస్‌కు వెళ్ళాలనుకుంటున్నట్టు తెలపగా వారు తిరిగి వెళ్లేవరకు తెలంగాణ భవన్‌లో ఉండేందుకు అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. ఇక, గడిచిన 24 గంటలుగా సహాయం కోసం చేసే అత్యవసర ఫోన్ కాల్స్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, చాలా తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తెలంగాణ భవన్‌కు వచ్చే అవకాశం ఉందని తమ అంచనా అని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరు సహాయం కోసం వస్తే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని డాక్టర్ గౌరవ్ ఉప్పల్ స్పష్టం చేశారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పలపాలు చేసి ఆగం చేశారు

నిజాన్నే సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల ముందుంచారు

మున్నేరు బాధితులందరికీ రివర్‌ఫ్రంట్ కాలనీలో చోటు

మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** బిజెపి, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలని..ఒకరు స్క్రిప్ట్ రాసిస్తే మరొకరు డెలివరీ చేస్తారని డిల్లీ స్థాయిలోనే మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని తెలంగాణ రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వేకువ జామున మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో జరుగుతున్న రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ధనిక రాష్ట్రం అంటూ గత పాలకులు షో చేశారని కాంగ్రెస్ పార్టీ అధికారంతోకి రాగానే లోగుట్టు మొత్తం బైటపడిందన్నారు. తినడానికి తిండి లేకున్నా మీసాలకు సంపెంగ నూనె రాసి ప్రజలను మభ్య పెట్టారని యద్దేవ చేశారు. సాక్షాత్తు సిఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే నిజం అయ్యిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టా చూసి బాదేసిందన్నారు. దాదాపు రూ.8లక్షల19కోట్ల అప్పు ఉందని వెల్లడించారు. ఆ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారన్నారు. ఇంటి పెద్దగా కుటుంబాన్ని సక్రమంగా నడిపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. క్యాన్సర్ సోకితే ఒప్పుకోవాలని బైటకు తెలియకపోతే రోగం ముదురుతుందన్నారు. ఇదే నిజాన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఒప్పుకోవాలని సూచించారు. చివరకు గాలిని, నీటిని, ప్రజలు తినే ఆహారాన్ని మేమే కొనుగొన్నామని అంటే ఎలా అని ప్రశ్నించారు. విమర్శలు చేయడం తప్పు కాదని, సోయిలేకుండా చేయవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ రావద్దని విపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరవెనుక ఉండి కొందరు రైతులను ఉసిగొల్పుతున్నారని ప్రతిపక్ష నాయకులపై విమర్శలు గుప్పించారు.

**పురపాలక కార్యాలయము : బెల్లంపల్లి : జిల్లా :: మంచిర్యాల**
ఈ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్
ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెం.ఇ1/01/టెండర్/2025-26/BPL/MPTLY తేది : 09-05-2025
ఈ కార్యాలయములో అంచనా విలువ రూ.51.00 లక్షల విలువ గల (12) పనులకు పట్టణ ప్రగతి మరియు 15వ ఆర్థిక సంఘ నిధులకు గాను సివిల్ రిజిస్ట్రేషన్ కాంట్రాక్టర్/ఫర్మ్ వారి నుండి ఈ కార్యాలయం ఈ – ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి. **టెండర్ తేదీల వివరములు : 01. డౌన్‌లోడ్ మొదలు తేదీ మరియు సమయం : 12.05.2025 నుండి మధ్యాహ్నం 4 గం.ల వరకు 02. డౌన్ లోడ్ చివరి తేదీ మరియు సమయం 19.05.2025 మధ్యాహ్నం 4 గం.ల వరకు.** ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.
DIPR R.O. No: 1693-PP/CL/ADVT/1/2025-26 Date:12.05.2025 Sd/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటి

**మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ**
(ఎన్ఏఏసి ద్వారా 'బి+' గ్రేడ్‌తో గుర్తింపు పొందినది)
నాలుగవ స్నాతకోత్సవం ప్రకటన
NOT.NO.01/MGU/NLG/2025-26 తేది 12-05-2025
నల్లగొండలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం 2025 జులైలో తాత్కాలికంగా జరుగనుంది. 2021-22, 2022-23 మరియు 2023-24 విద్యా సంవత్సరాల కాలంలో డాక్టోరల్ డిగ్రీ / పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ / అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులైన లేదా ప్రదానం చేయబడిన అభ్యర్థులు ఎవరైతే ఉన్నారో వారు తేదీ 16.06.2025 లోపు కాన్వకేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ఇంకా ఏమైనా అదనపు వివరాలు తెలుసుకోదల్చిన వారు www.mguniversity.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.
DIPR R.O. No: 1725-PP/CL/ADVT/1/2025-26 Date:12.05.2025 Sd/- రిజిస్ట్రార్

ప్రజాపక్షం
మంగళవారం, మే 13

# సరిహద్దుల్లో ప్రశాంతత

మూడు వారాలపాటు అర్ధరాత్రి మిలటరీ దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లిన భారత్ – పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాలు, విభజిత కశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఓసి) వెంబడి జనావాసాలు ఆదివారం రాత్రి ప్రశాంతతకు నోచుకున్నాయి, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సాయంత్రం 5గంటలనుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. పాక్ వైపునుంచి కొన్ని ఉల్లంఘనలు కొనసాగాయి. అయితే సైనిక బలగాల అప్రమత్తత కొనసాగుతోంది. సాంప్రదాయ యుద్ధం కన్నా సాంకేతిక విజ్ఞానం అత్యంత ప్రాధాన్యం వహించిన ప్రస్తుత సంఘర్షణలో భారత్ మిలటరీదే పైచేయి. జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గాంలోని బైసారన్ పచ్చిక బయళ్లలో పాక్ ప్రేరేపిత టెర్రరిస్టు ముష్కరులు ఏప్రిల్ 22 మిట్టమధ్యాహ్నం విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మంది భారత టూరిస్టులు, ఒక నేపాలీని నిష్కారణంగా హతమార్చిన ఘోరకలికి ప్రతీకారంగా భారత వైమానిక దళం మే 7న పాకిస్తాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 టెర్రరిస్టు స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేసిన తదుపరి ప్రజ్వరిల్లిన పరస్పర సైనిక చర్యలకు కొద్దిరోజుల్లోనే ముగింపు పలకడం హర్షించదగింది. అయితే ఇది తాత్కాలికమా, శాశ్వతమా అన్నది సోమవారం సాయంత్రం మొదలైన ఇరు దేశాల ఉన్నత సైనికాధికారుల స్థాయి (డిజిఎంఒ) హాట్‌లైన్ చర్చల ఫలితాలు నిర్ణయిస్తాయి. పాకిస్తాన్ లోపలి ప్రాంతాల్లో – కరాచీ, లాహోర్, రావల్పిండి వగైరా ప్రదేశాల్లో ఎయిర్‌బేస్‌లను, రన్‌వేలను ధ్వంసం చేసిన భారత్ రక్షణపాటవం ప్రపంచానికి వెల్లడైంది. పాక్ ప్రయోగించిన వందలాది డ్రోన్‌లను, క్షిపణులను భారత్ గగనతల రక్షణ వ్యవస్థ గాలిలోనే ధ్వంసం చేసింది. అయితే ఇది పాకిస్తాన్‌తో భారత్ పూర్తిస్థాయి యుద్ధం కాదు. టెర్రరిస్టుల మౌలిక వసతులను ధ్వంసం చేయటమే ధ్యేయంగా సాగింది. పాకిస్తాన్ సైన్యం ఎదురుదాడులకు దిగటం వల్ల ఈ సంఘర్షణ ఒకింత తీవ్రరూపం దాల్చింది. భారత్ యుద్ధ విమానాలను కూల్చినట్లు, సైనిక వసతులకు తీవ్రనష్టం కలుగజేసినట్లు పాకిస్తాన్ సైన్యం చేసిన నిరాధార క్లెయింలు తమ మిలటరీ వసతులకు జరిగిన నష్టం నుంచి తమ ప్రజల కన్నుగప్పటానికే అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అయితే వారి సైన్యం కశ్మీర్‌లో ఎల్ఓసి వెంట జనావాసాలపై ఫిరంగి దాడులు చేసి ఆస్తులకు నష్టం కలుగజేయటంతోపాటు స్త్రీలు, పిల్లలు సహా 16 మంది పౌరుల ప్రాణాలు తీశారు.

ఎటువంటి ముఖాముఖీ చర్చలు లేకుండా ఆకస్మికంగా కాల్పుల విరమణ ప్రకటనలు రావటం ఆశ్చర్యకరం. భారత్ సానుకూలంగా స్పందించే పక్షంలో కాల్పుల విరమణకు తాము సిద్ధమని పాకిస్తాన్ ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం ప్రకటించింది. ఇంతలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ఇరు దేశాల మధ్య తమ మధ్యవర్తిత్వంతో (ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగమంత్రి రూబియో) కాల్పుల విరమణ సాధించామని, ఇరుదేశాల నాయకులు వివేకం, విజ్ఞత ప్రదర్శించినందుకు వారికి ధన్యవాదాలు' అంటూ ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. ఆ తర్వాత భారత ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించింది. అయితే శనివారం రాత్రి పాకిస్తాన్ అనేక ఉల్లంఘనలకు పాల్పడింది. మన దళాలు తిప్పికొట్టాయి. భారత్ హెచ్చరిక తదుపరి ఆదివారం ఉదయం నుంచి రణగొణ ధ్వనులు సద్దుమణిగాయి.

అయితే ఎవరి మధ్యవర్తిత్వంలేదని, పాకిస్తాన్ ప్రతిపాదనను అంగీకరించామని భారత ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ట్రంప్ ప్రకటన విశ్వసనీయతను కొట్టివేయదగింది కాదు. తమ 'ప్రియమిత్రుడు' ట్రంప్ ఒత్తిడికి ప్రధాని నరేంద్రమోదీ లొంగిపోయారనే మాటలు వినిపిస్తున్నాయి. అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తే అంగీకారం కుదిరిన షరతులేమిటని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని, పాకిస్తాన్ తూటా పేల్చితే క్షిపణులతో జవాబు ఇవ్వాలని మోదీ సైనికాధికారులకు చెప్పినట్లు, వచ్చిన వార్త ఆయన పెంపకున్న ప్రతిష్టకు తగిలిన దెబ్బను కప్పిపుచ్చుకోవటానికే కావచ్చు. అయితే మోదీ భావజాల అనుచరగణంలో చాలామంది కాల్పుల విరమణపట్ల అసంతృప్తితో ఉన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుని పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పాలన్నది వారి ఆకాంక్ష. పాకిస్తాన్ మరిన్ని ముక్కలు కావాలన్నది వారి కల. అది వారి తప్పుకాదు. అది ఆర్ఎస్ఎస్, బిజెపిలు ప్రచారం చేసే 'అఖండ భారత్' నినాదం, నేతలు మత ద్వేషంతోచేసే ప్రకటనల ఫలితం. ప్రస్తుత సంఘర్షణ సందర్భంలో భారతీయ ముస్లింలంతా ముక్తకంఠంతో భారత ప్రభుత్వం వెనుక నిలబడటం మత విభజన తెచ్చే దుష్టశక్తుల పన్నాగాలను భగ్నం చేసింది. అయితే భారత్–పాకిస్తాన్ల మధ్య యుద్ధమే సంభవిస్తే అది ఇరుదేశాలకు అపారనష్టమేగాక భారత్ అభివృద్ధి ఆకాంక్షలకు తీవ్రమైన విఘాతం అవుతుంది. కాబట్టి ప్రస్తుత కాల్పుల విరమణ అంగీకారం ఇరుదేశాలకు ప్రయోజనకారి. టెర్రరిస్టు సమస్యతోపాటు ఇరుదేశాల మధ్య వివాదాలను సిమ్లా ఒప్పందం ప్రకారం ముఖాముఖీ చర్చల ద్వారా పరిష్కరించుకోవటమే ఉత్తమమార్గం.

# పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ రుణం : ఒక్కరూ మనవెనుక రాలే!



ఎం. కోటేశ్వరరావు

పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) రెండు ఖాతాలలో 350 కోట్ల డాలర్లు ఇచ్చేందుకు అంగీకరించింది. దీన్లో తక్షణమే వందకోట్ల డాలర్లు ఇస్తారు. వాషింగ్టన్ డిసిలో శుక్రవారం నాడు జరిగిన బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ మంజూరును అడ్డుకొనేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తామని భారత్ ప్రకటనలు చేసినా వాటిని ఖాతరు చేయకుండా రుణం ఖరారైంది. మనకు మద్దతుగా ఒక్కరంటే ఒక్క ఇతర డైరెక్టర్‌లు రాలేదు.

తమకు రుణం ఇవ్వకుండా చూసేందుకు భారత్ ప్రయత్నించినప్పటికీ ఐఎంఎఫ్ అంగీకరించటం పట్ల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతృప్తి వెల్లడించినట్లు పిటిఐ వార్తా సంస్థ పేర్కొన్నది. మన ప్రధాని నరేంద్రమోదీ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. అయితే ఆర్థికశాఖ ఒక ప్రకటన చేస్తూ ఉగ్రవాదానికి ఊతమిస్తున్నందుకు రుణాన్ని బహుమతిగా ఇచ్చారని, ప్రపంచ మానవాళికి ప్రమాదకర సంకేతాన్ని పంపారని, ఇది నిధులు ఇచ్చే సంస్థలు, దాతలకు గౌరవాలకు భంగకరమని, ప్రపంచ విలువలను తక్కువగా చూసిందని విమర్శించింది. పాకిస్తాన్‌కు రుణమిస్తే ఆ మొత్తాన్ని సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేందుకు ఉపయోగిస్తుందని, గతంలో ఇచ్చిన రుణాలను దుర్వినియోగం చేసిందని మన ప్రభుత్వం గట్టి అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఓటింగ్ సందర్భంగా మన నిరసన నమోదు చేసి ఓటింగ్‌ను బహిష్కరించింది.

పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవం. దేశ విదేశీ రుణభారం 2024 నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ బ్యాంకు 48 బిలియన్ డాలర్లు ఇచ్చింది, 2025 మార్చి నెలాఖరుకు ఐఎంఎఫ్ ఇచ్చిన రుణాలు 6.2బిలియన్ డాలర్లు ఉన్నాయి. అనేక దేశాల నుంచి చేబదులు మాదిరి సాయం పొందుతున్నది. తిరిగి కోలుకొనేందుకు, నిర్వహణకు అవసరమైన నిధి(ఆర్ఎస్ఎఫ్) పేరుతో 140 కోట్ల డాలర్లు, మరో ఖాతా కింద 210 కోట్ల డాలర్లను ఇచ్చేందుకు సూత్రప్రాయంగా 2024, సెప్టెంబరు 25న ఐఎంఎఫ్ ఆమోదించింది. మార్చి నెల 25న అధికారుల స్థాయిలో ఐఎంఎఫ్, పాకిస్తాన్ రుణం గురించి ఒప్పందానికి వచ్చాయి. ఏడువందల కోట్ల డాలర్లను వంతుల వారీగా ఇస్తారు. 2025 మే నెల తొమ్మిదిన వాటి గురించి సమీక్షించి రానున్న 37నెలల్లో వాటిని విడుదల చేసేందుకు అంగీకరించింది. మొత్తం 700 కోట్ల డాలర్ల రుణం కావాలని పాకిస్తాన్ కోరింది. గతేడాది ఆగస్టు నాటికి 9.4బిలియన్ డాలర్లు ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఏప్రిల్ చివరి నాటికి 10.3బి.డాలర్లకు పెరిగాయి, వాటిని జూన్ నాటికి 13.9 బిలియన్లకు పెంచాలన్నది లక్ష్యం. ఆర్ఎస్ఎఫ్ నిధులతో ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినపుడు పునరుద్ధరణ, చార్జీల వసూలుతో సహా నీటిని మరింత పొదుపుగా వాడేందుకు చర్యలు, కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం, సమాచార వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు చేపట్టాల్సి ఉంది. సవాళ్ల వాతావరణం ఉన్నప్పటికీ స్థూల ఆర్థిక స్థిరత్వం పునరుద్ధరణ జరుగుతున్నదని ఐఎంఎఫ్ పేర్కొన్నది. వ్యవసాయ ఆదాయంపై పన్ను విధింపుతో సహా అనేక సంస్కరణలను చేపట్టినట్లు తెలిపింది. సకాలంలో విద్యుత్ ఛార్జీల సవరణ ద్వారా రుణభారం తగ్గిందని, పాకిస్తాన్ రిజర్వుబాంకు గట్టి చర్యల కారణంగా రికార్డు స్థాయికి ద్రవ్యోల్బణం తగ్గిందని, వ్యవస్థాగత సంస్కరణలు చేయాలని పేర్కొన్నది. జనానికి వ్యతిరేకమైన షరతులతో పాకిస్తాన్ రుణాలు తీసుకున్నది. ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల నిలిపివేత, మూసివేత, తెగనమ్మటం, వినియోగదారుల నుంచి సేవలకు ఛార్జీలు, విద్యుత్ ఇతర రంగాలలో సంస్కరణల వంటివి వాటిలో ఉన్నాయి.




ఐఎంఎఫ్ నిబంధనల ప్రకారం ప్రతి దేశానికి ఓటింగ్ సంఖ్య ఉంటుంది. ఆ మేరకు ఇతర సందర్భాలలో ఓటు వేయవచ్చు. రుణాల మంజూరు విషయంలో ఏకాభిప్రాయమేగాని ఓటింగ్ ఉండదు. అంగీకారం లేని దేశం దూరంగా ఉండటం తప్ప వ్యతిరేక ఓటు వేసేందుకు అవకాశం లేదు.

తాజాగా మనదేశం అదే చేసింది. ఐఎంఎఫ్‌లో ఓటింగ్ బలాబలాల విషయాన్ని చూద్దాం. అమెరికా 16.49, జపాన్ 6.14, చైనా 6.08. మొత్తం 25 మంది డైరెక్టర్లలో ఈ మూడు దేశాలకు ఒక్కొక్క డైరెక్టర్ నిరంతరం ఉంటారు. మిగిలిన 22 మందిని దేశాలతో కూడిన 22 బృందాలు వంతుల వారీ ఎన్నుకుంటాయి. ఉదాహరణకు బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక, భారత్ కలసి ఒక బృందం. ఈ దేశాల నుంచి ఎవరో ఒకరు మాత్రమే ఉంటారు. వీటన్నింటి ఓటింగ్ బలం 3.05 మాత్రమే. మొత్తం ఓట్లు 49,91,063 కాగా చైనాకు 3,06,281, మన బృంద దేశాలన్నింటికీ కలిపి ఉన్నది 1,53,610. కాగా వాటిలో దేశానికి 1,32,596, బంగ్లాదేశ్ 12,118, శ్రీలంక 7,240, భూటాన్ 1,656 ఉన్నాయి. వేరే గ్రూపు లో ఉన్న పాకిస్తాన్‌కు 21,762 ఉన్నాయి. ప్రస్తుతం మన దేశం నుంచి పరమేశ్వరన్ అయ్యర్ తాత్కాలిక డైరెక్టర్‌గా ఉన్నారు.

పాక్‌పై గతంలోనే ఒక అంచనాకు వచ్చిన ఐఎంఎఫ్ రుణం ఇవ్వకుండా ఉంటుందని ఎవరైనా అనుకుంటే పొరపాటే. ఉగ్రవాదులకు మద్దతు, శిక్షణ ఇవ్వటం, ఇతర దేశాల మీదకు వదలటం ఇస్లామాబాద్‌కు కొత్త కాదు. తాము శిక్షణ ఇచ్చినట్లు ఆ దేశ మంత్రే స్వయంగా చెప్పాడు. అయినప్పటికీ దశాబ్దాలుగా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ రుణాలు, గ్రాంట్లు ఇస్తూనే ఉన్నాయి. ఉగ్రవాదానికి వాటికి లంకె పెట్టలేదు. ఒక్క పాకిస్తానే కాదు, ఏ దేశానికీ అలాంటి షరతులేదు. అలాంటి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలనే నిబంధన ఉండి ఉంటే అసలు ఏ దేశానికీ రుణం పొందే అర్హత, అవకాశం ఉండదు. ఏదో ఒక ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపణ లేదా విమర్శలకు గురికాని దేశం ఒక్కటంటే ఒక్కటి లేదు. పహల్గాం ఉగ్రదాడితో నిమిత్తం లేకుండానే ముందే చెప్పినట్లు నెల రోజుల ముందే అధికారుల మధ్య కుదిరిన ఒప్పందానికి లాంఛనప్రాయంగా ఆమోద ముద్రవేయటం తప్ప మే తొమ్మిది సమావేశానికి మరొక అజెండా లేదు. ఈ విషయాలన్నీ మన విధాన నిర్ణేతలు, పరిశీలకులకు తెలుసు.

2019లో పుల్వామా దాడికి ప్రతిగా మనం బాలాకోట్‌పై మెరుపుదాడి చేశాము. అప్పటి నుంచి లేదా అంతకు ముందు జరిగి న దాడుల నాటినుంచి ఐఎంఎఫ్ లేదా ప్రపంచ బ్యాంకు, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఇస్లామాబాద్‌కు రుణాలు ఇస్తే వాటిని ఉగ్రవాదులకు మళ్లిస్తారని మన దేశం చేసిన ప్రయత్నాలు ఏమైనా ఉన్నాయా అంటే మీడియాలో అలాంటి ఛాయలు లేవు. అంతర్గతంగా వత్తిడి తెచ్చారేమో మనకు తెలియదు కదా అని అమాయకంగా చెప్పేవారు ఉండవచ్చు. ఆ ప్రకారం చూసినా నిజమే అనుకుంటే ఒక్క దేశం కూడా మన మాటకు గౌరవమిచ్చి మనతో పాటు కలసి రాలేదు.

మన నిరసన తెలిపేందుకు బహిష్కరించామని ఇప్పుడు కొంత మంది చెబుతున్నారు. దానికి ముందు అడ్డుకుంటామని, మరేదో చేస్తామనే ప్రచార ఆర్భాటం ఎందుకు?

# యుద్ధం.. ప్రపంచానికి భారమే!



ఫిరోజ్ ఖాన్
9640466464

'యుద్ధాన్ని ప్రపంచం భరించ లేదు'. భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్ ప్రకటన ఇది. ఆయన ప్రకటన వెనక ఎంతో అంతరార్థం దాగి ఉంది. ఇప్పటికే గాజా–ఇజ్రాయెల్, ఉక్రెయిన్–రష్యా మధ్య సంవత్సరాలుగా యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యంపైనా తీవ్ర ప్రభావం పడింది. అనేక వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగాయి. ఇది నిరుపేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. లక్షలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి.

ఈ నేపథ్యంలో భారత్–పాకిస్తాన్ యుద్ధం మొదలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా అస్థిరత ఎదుర్కొనే ప్రమాదముంది. ప్రపంచ అనేక దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక దేశాల అధినేతలు యుద్ధ పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందారు.

**ప్రపంచ దేశాల్లో ఆందోళన**

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక అంశాలపై ప్రభావం పడింది. రెండు దేశాల్లో ఉత్పత్తి అయ్యే వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. యుద్ధం వల్ల గ్లోబల్ ద్రవ్యోల్బణం 23% పెరిగింది. రష్యా, ఉక్రెయిన్ గోధుమల సరఫరాలో 25 శాతం వాటాను కలిగి ఉన్నయి. అయితే యుద్ధం వల్ల 40–50 శాతం ధరలు పెరిగి ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఆహార సంక్షోభం సైతం ఏర్పడింది. పామాయిల్ ధరలు 40–50% పెరిగాయి, ఎరువుల ధరలు 30% పెరిగి వ్యవసాయ ఖర్చులు భారమయ్యాయి. అయితే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతో కొన్ని నెలల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. కానీ అప్పటికే ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది.

**ఎగుమతులు, దిగుమతులపై..**

భారతదేశం ప్రస్తుతం 4.27 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇండియా ఐటి, ఫార్మా, వ్యవసాయం, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్ రంగాల్లో ప్రధాన ఎగుమతిదారు. ప్రపంచంలో 40 శాతం బియ్యం సరఫరాలో ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. 10శాతం సరఫరాతో పాకిస్తాన్ నాలుగో స్థానంలో ఉంది. అయితే ఒకవేళ యుద్ధం వల్ల ఓడరేవులు, రవాణా మార్గాలకు అంతరాయం కలిగితే మలేషియా, సింగపూర్, సౌదీ అరేబియా, యుఎఇ, బంగ్లాదేశ్, ఇండోనేషియాతోపాటు మరి కొన్ని దేశాల్లో 20 నుంచి 30 శాతం బియ్యం ధరలు పెరగవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం 5–10% పెరగవచ్చు. ఆసియాలోని దేశాల్లో చమురు ధరల్లో కూడా అస్థిరత ఉండవచ్చు. ఉల్లిపాయలు, ఔషధాల సరఫరా, టెక్స్‌టైల్స్, ఐటీ సేవలపైనా ప్రభావం పడుతుంది. ఇండియా నుండి జెనరిక్ ఔషధాలు దిగుమతి చేసుకునే నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి ఆఫ్రికా దేశాల్లో ఔషధ ధరలు 20– 30% పెరగడం వల్ల ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముంది. బియ్యం కొరత ఆహార సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది. ఇండియా నుంచి ఐటి సేవలు, టెక్స్ టైల్స్, ఫార్మా ఎగుమతులు ఆగిపోతే అమెరికా, యూరప్ దేశాల్లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఖర్చులు, దుస్తులు, ఔషధ ధరలు 5–15% పెరగవచ్చు. చైనా ఇండియా నుండి రసాయనాలు, ఫార్మా మూలవస్తువుల ను దిగుమతి చేసుకుంటుంది. యుద్ధంవల్ల ఈ సరఫరా ఆగిపోతే చైనా ఔషధ ఉత్పత్తి ఖర్చులు పెరగవచ్చు.

**స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం**

భారత్ పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారితే వివిధ దేశాల్లో స్టాక్ మార్కెట్లపైన తీవ్ర ప్రభావం పడి మదుపరుల సంపద ఆవిరి అయ్యే ప్రమాదమున్నది. పహెల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామాలతో పాకిస్తాన్ కు చెందిన కరాచీ స్టాక్ ఎక్స్చేంజ్ 13 శాతానికి పైగా పడిపోయింది. ఆ దేశంలో కొన్ని రోజుల్లోనే 80 వేల కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. భారత స్టాక్ మార్కెట్లు స్థిరంగానే ఉన్నా.. శుక్రవారం నిఫ్టీ 250 పాయింట్లకు పైగా, సెన్సెక్ 800 పాయింట్లకు పైగా నష్టపోయాయి. అయితే ప్రస్తుతం భారత్ దగ్గర ఆర్థిక బలం ఎక్కువ. ఈ క్షీణత తాత్కాలికమే. కాల్పుల విరమణతో సోమవారమే భారీగా మార్కెట్లు కోలుకున్నాయి. చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ లో చైనా ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టింది. యుద్ధం జరిగితే, ఈ పెట్టుబడులపై రిస్క్ పెరుగుతుంది, ఇది చైనా స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలిక అస్థిరతను కలిగించే అవకాశముంది. ఐటి, ఫార్మా రంగాల్లో అమెరికాకు భారత్ కీలక సరఫరాదారు. యుద్ధం వల్ల ఈ సరఫరాలకు ఆటంకం ఏర్పడితే, అమెరికన్ టెక్, హెల్త్ కేర్ స్టాక్‌లపై స్వల్ప ప్రభావం పడవచ్చు. యూరప్ లోనూ దీని ప్రభావం ఉండొచ్చు. బంగ్లాదేశ్ టెక్స్ టైల్ ఎగుమతులు ఇండియాపై ఆధారపడతాయి. వాణిజ్యానికి అంతరాయం ఏర్పడితే ఆ దేశ టెక్స్ టైల్ స్టాక్‌లు దెబ్బ తినొచ్చు.



**పాకిస్తాన్ అత్యుత్సాహంతో..**

పహెల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరు తో భారతదేశం సర్జికల్ స్ట్రైక్ చేపట్టింది. ఉగ్రవాద కేంద్రాలను టార్గెట్ గా చేసుకొని దాడి చేసింది. సంయమనం పాటించాల్సిన పాకిస్తాన్ అత్యుత్సాహం చూపిం ది. రెచ్చగొట్టేలా ఇండియాలోని పలు చోట్ల డ్రోన్లతో దాడులు చేయడానికి ప్రయత్నించడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభం లో కూరుకుపోయి ఉన్నది. కేవలం 348 బిలియన్ డాలర్లతో అత్యంత బలహీనంగా ఉంది.

130 బిలియన్ డాలర్ల రుణంలో కూరుకుపోయి ఉంది. ఫారెక్స్ రిజర్వు నిల్వలు సైతం అతి తక్కువగా ఉన్నాయి. ఐఎంఎఫ్ బెయిలౌట్లపై ఆధారపడుతున్నది.

భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగా ఇండియా నుంచి దిగుమతులను నిషేధించింది. ఇది ఆ దేశ వైద్యరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం అక్కడ అత్యవసర మందులు దొరకని పరిస్థితి నెలకొన్నది. యుద్ధం వస్తే ఆ దేశ పరిస్థితి మరింత దిగజారుతుంది. పాకిస్తాన్ రూపాయి మరింత పడిపోతుంది. నీటి కొరతతో పాటు గోధుమలు, బియ్యం, కూరగాయల ధరలు పెరుగుతాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్న ధరలను భరించడం అక్కడి ప్రజలకు కష్టతరంగా మారింది. అంతేకాకుండా ప్రపంచ దేశాలు సైతం పాకిస్తాన్‌ను దోషిగానే చూస్తున్నా యి.

# తెలుగు వెనకబడి.. సంస్కృతం ముందుకు

భాష అనేది ఒక జాతికి జీవస్వరూపం. భాష ఆధారంగా సంస్కృతి, సాంప్రదాయం, ఆత్మగౌరవం నిలుస్తాయి. కానీ మన దేశంలో, ప్రత్యేకం గా తెలుగు రాష్ట్రాలలో, గత కొన్ని దశాబ్దాలుగా కనిపిస్తున్నదేమిటంటే మన సొంత భాష అయిన తెలుగు కొనసాగిస్తూ, శాసన వ్యవస్థలు, పాలక వర్గాలు సంస్కృతాన్ని ముందుకు నెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యా విధానాల్లో సంస్కృత భాష కు అప్రతిహత ప్రాధాన్యం లభిస్తోంది. ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాలలో, కొన్ని రాష్ట్రాల సిలబస్ పునఃసంఘటనలలో సంస్కృతం తప్పనిసరి భాషగా ప్రవేశపెట్టబడుతోంది. ఇది మాతృభాషా అభివృద్ధికి విఘాతం కలిగించేదిగా అభిప్రాయపడాల్సి వస్తోంది. తెలుగు విద్యార్థికి తొలుత తన మాతృభాష మీద పట్టుండాలి. పాఠశాల స్థాయి నుంచే తెలుగులో విషయాలను నేర్పితే అభివృద్ధి దిశగా ప్రయాణం జరుగుతుంది. కానీ, సంస్కృతం మా సంస్కృతి భాష అంటూ దానిని మరింతగా ప్రోత్సహించడం, తెలుగు చదవడం, అభివృద్ధి చెందడాన్ని నీరసపరిచేలా మారుతోంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యా శాఖలు కొన్ని పాఠశాలల పేర్లను 'సంస్కృత విద్యాలయాలు'గా మార్చడమేకాక, వాటిలో సంస్కృ తం చదివేందుకు ప్రత్యేక విద్యార్థుల ఎంపిక చేస్తున్న పరిస్థితి చూస్తే, ఇది వర్గీకరణ వైఖరికి దారితీస్తోంది. ప్రభుత్వ నిధులతో నడిచే విద్యా వ్యవస్థలో సంస్కృతానికి మాత్రమే అధిక ప్రాధాన్యం ఇవ్వడం, తెలుగు భాషను అణచివేతకు గురిచేస్తోంది. సంస్కృతాన్ని విద్యా విధానంలో ముందుకు నెట్టే ప్రయత్నం వెనుక ఉన్నది. భాష అభివృద్ధి కాదు. ఇది ఒక రాజకీయ వైఖరి. ఓ నిర్దిష్ట వర్గ సంస్కృతి ఆధిపత్యాన్ని బలపరచే ప్రయత్నం. ఎందుకంటే సంస్కృత భాష ఆధారంగా బ్రాహ్మణిక సాంప్రదాయాన్ని, వేదాధికారాన్ని, పురాణ సంప్రదాయాలను పెంపొందించాలన్న దృక్కోణమే ఇందుకు మూలం. తెలుగు వంటి ప్రాచీన, ప్రజలతో మమేకమైన భాషను పక్కనపెట్టి, 'అభిజాతమైన సంస్కృతి' అనే ముసుగులో సంస్కృతాన్ని ముందుకు తేవడం, సామాన్య ప్రజల అక్షర జ్ఞానాన్ని కూడా కల్తీ చేసే ప్రమాదం కలిగి ఉంది.
ఇప్పుడు మన భవిష్యత్తు తరాలకు మన భాషను అందించాలంటే:

1. పాఠశాల స్థాయి నుంచే తెలుగు మాధ్యమంలో బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి.
2. తెలుగు భాషాభివృద్ధికి వాడుక భాష విద్యా భాష ప్రభుత్వ భాషలో సమాన స్థానం కల్పించాలి.
3.భాషా విధానాలను రాజకీయ ప్రయోజనాలకోసం వాడకూడదు. 4.తెలుగు ఉపాధ్యాయులు తమ పాత్రను నిబద్ధతతో నిర్వహించాలి. తెలుగు వెనుకపడడం అనేది సహజమైన ప్రక్రియ కాదు. అది మానవీయ ప్రమేయంతో, వ్యవస్థాపిత విధానాలతో జరిగిన తర్క సహితం. సంస్కృతాన్ని భవిష్యత్ భాషగా ఊహించటం ఒక ఉద్దేశ్యపూరిత ప్రయోగం. మన సంస్కృతి, మన భాష కోసం, మన భావి తరాల కోసం స్పందించాల్సిన సమయం ఇదే.

కె. కృష్ణమూర్తి,
తెలుగు భాషా నిపుణులు, హన్మకొండ, 9705196097.


# 'రిశాట్–1బి' అంతరిక్షంలో భారత అకుంఠిత నేత్రం

ఒకప్పుడు దట్టమైన మేఘాలు కమ్మేసినా, చిమ్మచీకట్లు అలుముకున్నా భూమిని చూడలేని నిస్సహాయత. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు స్పష్టమైన సమాచారం కోసం ఎదురుచూపులు. కానీ ఇప్పుడు కాలం మారింది.

ఒక చారిత్రక ఘట్టం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అలుపెరగని కృషితో రూపుదిద్దుకున్న ఒక అద్భుత సాంకేతిక చక్షువు మన జాతికి అండగా నిలవడానికి సిద్ధమవుతోంది. అదే 'రిశాట్1బి' – రాడార్ ఇమేజింగ్ శాటిలైట్. దీనికి ఇఒఎస్09 గా కూడా పిలుస్తారు. మే 18, 2025 ఆ రోజు కోసం ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. ఆ రోజు ఉదయం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి భారత కాలమానం ప్రకారం ఉదయం 6.59 గంటలకు జరగనుంది. ఇస్రో నమ్మకమైన వాహక నౌక పిఎస్ఎల్‌విసి61, రిశాట్1బిని గుండెల్లో పెట్టుకుని గగనసీమ వైపు దూసుకెళ్లనుంది. ఆ క్షణం ప్రతి భారతీయుడి గుండె గర్వంతో ఉప్పొంగుతుంది. శాస్త్ర సాంకేతిక రంగంలో మన దేశం సాధిస్తున్న ప్రగతికి అది నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత కొన్ని రోజులకే వస్తున్న ఈ ప్రయోగం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే ఇది పాకిస్తాన్, చైనా వెంట భారతదేశ సున్నితమైన సరిహద్దులను పర్యవేక్షించడంలో, దేశంలోని విస్తారమైన తీరప్రాంతాలను కాపాడటంలో రక్షణ దళాలకు కీలకమైన శక్తిని ఇస్తుంది. ఇది భవిష్యత్ పథంలో ఒక దిక్సూచి అవుతుంది. కక్ష్యలోకి చేరిన తర్వాత రిశాట్1బి సుమారు పదేళ్లపాటు మనకు సేవలందిస్తుందని అంచనా. ఇది అందించే సమాచారం, చిత్రాలు మన దేశ భవిష్యత్ ప్రణాళికలకు దిక్సూచిగా మారతాయి. ఇస్రో ఇప్పటికే నాసాతో కలిసి 'నిసార్' అనే మరో అత్యాధునిక రాడార్ ఉపగ్రహాన్ని రూపొందిస్తోంది. రిశాట్1బి విజయం ఆ భవిష్యత్ ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూరుస్తుంది.

**ఆద్యంతం ఒక అన్వేషణ:**

రిశాట్ ప్రస్థానం ఒక్క రోజులో మొదలైంది కాదు. దశాబ్దాల శాస్త్రవేత్తల మేధోమథనం, అలుపెరగని పరిశోధనల ఫలం ఇది. సాధారణ ఉపగ్రహ కెమెరాలకు కొన్ని పరిమితులున్నాయి. అవి సూర్యరశ్మి ఉన్నప్పుడు, ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు మాత్రమే భూమిని స్పష్టంగా చూడగలవు. కానీ దేశ రక్షణ, విపత్తు నిర్వహణ వంటి కీలక సమయాల్లో ప్రతి



క్షణం సమాచారం అవసరం. ఈ అవసరాన్ని గుర్తించిన ఇస్రో, రాడార్ సాంకేతికత వైపు అడుగులు వేసింది. రాడార్ తరంగాలు మేఘాలను, చీకటిని ఛేదించుకుని ప్రయాణించి భూమిని స్పష్టంగా చిత్రీకరించగలవు – ఇదే రిశాట్ శ్రేణికి పునాది. 2008 ముంబై దాడుల తర్వాత, దేశ భద్రతకు నిరంతర నిఘా ఎంత అవసరమో యావత్ జాతికి తెలిసొచ్చింది. తక్షణ అవసరాల రీత్యా, 2009లో 'రిశాట్2' (ఇజ్రాయెల్ సహకారంతో) అంతరిక్షంలోకి వెళ్లింది. అది ఎక్స్‌బ్యాండ్ రాడార్‌తో మన సరిహద్దులకు ఒక కవచంలా నిలిచింది. ఆ తర్వాత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో సిబ్యాండ రాడార్‌తో 'రిశాట్1'ను 2012లో ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఇది ప్రధానంగా వ్యవసాయం, అటవీ సంపద, వరదల అంచనా వంటి పౌర సేవలకు అంకితమై, అన్నదాతలకు, ప్రకృతి పరిరక్షకులకు నేస్తమైంది. ఈ విజయాల స్ఫూర్తితో మరింత ఆధునిక పరిజ్ఞానంతో రిశాట్2బి, రిశాట్2బిఆర్1 వంటి ఉపగ్రహాలు మన రక్షణ, పర్యవేక్షణ సామర్థ్యాన్ని ఇనుమడింపజేశాయి.

**నవశకపు నేత్రం – రిశాట్–1బి ప్రత్యేకతలు:**

ఈ అద్భుత పరంపరలో మరో కలికితురాయిగా మునుపటి ఉపగ్రహాల అనుభవాన్ని ఆధునిక సాంకేతికతను రంగరించి 'రిశాట్1బి' రూపుదిద్దుకుంది. ఇది కేవలం ఒక ఉపగ్రహం కాదు, అంతరిక్షంలో మన జాతికి అదనపు నేత్రం. దీనిలో అమర్చిన అత్యాధునిక సిబ్యాండ సింథటిక్ అపెర్చర్ రాడార్ దీని ప్రత్యేకత. ఈ రాడార్‌కు ఒక విశిష్ట శక్తి ఉంది – అది పగలురాత్రి, ఎండావాన, మంచుపొగమంచు తేడా లేకుండా భూమిని అత్యంత స్పష్టంగా చూడగలదు. ఒకప్పుడు సైనికుడు సరిహద్దులో చిన్న కదలికను పసిగట్టాలన్నా, విపత్తు సమయంలో సహాయక బృందం మారుమూల గ్రామానికి దారి కనుక్కోవాలన్నా ఎన్నో సవాళ్లు. కానీ రిశాట్1బి తన ఐదు విభిన్న ఇమేజింగ్ మోడ్‌లతో ఈ సవాళ్లను అధిగమించనుంది. ఒకవైపు అత్యంత సూక్ష్మమైన వస్తువులను కూడా గుర్తించగల 'సూపర్ ఫైన్' చిత్రాలను అందిస్తూనే మరోవైపు విశాలమైన ప్రాంతాలను వేగంగా స్కాన్ చేసి పరిస్థితిని అంచనా వేయగలదు. సుమారు 1710 కిలోల బరువుతో భూమికి 529 కిలోమీటర్ల ఎత్తులో తన కక్ష్యలో పరిభ్రమిస్తూ, నిరంతరాయంగా మన భూభాగాన్ని కాపలా కాయనుంది.

**అంతరిక్షంలో అకుంఠిత నేత్రం:**

రిశాట్1బి ప్రయోగం కేవలం ఒక సాంకేతిక విజయం మాత్రమే కాదు. అది స్వావలంబన దిశగా భారతదేశం వేస్తున్న మరో దృఢమైన అడుగు. మన శాస్త్రవేత్తల ప్రతిభకు, మన దేశపు ఆకాంక్షలకు అది నిదర్శనం. అంతరిక్షంలో మన అకుంఠిత నేత్రంగా మారి, ఈ దేశాన్ని సదా కాపాడుతూ, ప్రగతి పథంలో నడిపించాలని ఆశిద్దాం. ఈ ప్రస్థానం, భావి తరాలకు స్ఫూర్తినిస్తూ భారతదేశ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేయడం ఖాయం. జై భారత్ !

డిజె. మోహన రావు, 8247045230



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కాల్పుల విరమణకు ముందే... కేంద్రం సమావేశాలు నిర్వహిస్తే బాగుండేది

### విలేకరుల సమావేశంలో కర్ణాటక సిఎం సిద్ధరామయ్య

**మైసూరు :** పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ అవగాహనకు ముందే కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశం, అన్ని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించి ఉంటే బాగుండేదని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాదులపై చేపట్టిన సైనిక చర్యల క్రెడిట్ అంతా సాయుధ బలగాలకే చెందుతుందని సిద్ధరామయ్య చెప్పారు. దీనిని ఏ ఒక్కరూ రాజకీయ పరపతి కోసం వాడుకునే హక్కును కలిగి ఉండరని ఆయన స్పష్టంచేశారు.'ఇరుదేశాలు (భారత్–పాక్) కాల్పుల విరమణకు ఒక అవగాహనకు వచ్చి ఒక ప్రకటన చేశారు. ఇరు దేశాలకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్ (డిజిఎం) సమావేశమై అక్కడ ఏమి నిర్ణయిస్తారన్నది తెలుసుకునేందుకు మరికొంత సమయం నిరీక్షించాలి' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా సిద్ధరామయ్య చెప్పారు. కాల్పుల విరమణకు ముందే అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్నది తన అభిప్రాయమన్నారు.

## తిరిగి తెరుచుకున్న 32 విమానాశ్రయాలు

**న్యూఢిల్లీ :** భారత్–పాక్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను అధికారులు మూసివేసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో సరిహద్దు రాష్ట్రాల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా మూసివేసిన ఎయిర్‌పోర్ట్స్‌ను అధికారులు తిరిగి తెరిచారు. 32 విమానాశ్రయాలను సోమవారం తిరిగి తెరిచినట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజాగా వెల్లడించింది. పహల్గామ్ ఉగ్రదాడితో భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇరు దేశాలు దాడులు ప్రతిదాడులతో సరిహద్దుల్లోని ప్రాంతాలు దద్దరిల్లాయి. పాక్ డ్రోన్లు, క్షిపణులతో భారత్‌పై దాడులు చేస్తుండటంతో పౌర విమానాల రాకపోకలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిషేధం విధించింది. దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని మొత్తం 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అధంపూర్, అంబాలా, అమృత్‌సర్, అవంతీపురా, బతిండా, బికనేర్, భూజ్, చండీగఢ్, హల్వారా, హిండన్, జమ్ము, జామ్‌నగర్, జోథ్‌పూర్, జైసల్మేర్, కండాలా, కాంగ్రా, కేషోడ్, కిషన్‌గఢ్, కులు మనాలి, లేహ్, లూథియానా, ముంద్రా, నలియా, పఠాన్‌కోట్, పటియాలా, పోర్‌బందర్, రాజ్‌కోట్, సర్సావా, శ్రీనగర్, షిమ్లా, తోయిస్, ఉత్తర్‌లాయ్ ఎయిర్‌పోర్టులను మూసివేస్తున్నట్లు తెలిపింది. ఈ నెల 15 వరకు ఆయా ఎయిర్‌పోర్టుల నుంచి ఎలాంటి విమానాల రాకపోకలు ఉండవని స్పష్టం చేసింది. అయితే, తాజాగా కాల్పుల విరమణ ఒప్పందంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరడంతో అధికారులు ఆయా విమానాశ్రయాలను తిరిగి తెరిచారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### 13 మంది మృత్యువాత

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయ్‌పూర్‌లో ఒక ట్రైలర్, గూడ్స్ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 13 మంది మరణించగా, 14 మంది గాయపడ్డారని పోలీసులు సోమవారం తెలిపారు. రాయ్‌పూర్ జిల్లా రాయ్‌పూర్–బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు చిన్నారులు తొమ్మిది మంది మహిళలు మరణించారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. పెద్ద మొత్తంలో ఒకే కుటుంబానికి చెందిన వారితో సహా మొత్తం 35 మంది బనాబన్సారీ గ్రామంలో నిర్వహించిన ఒక కుటుంబ కార్యక్రమం నుండి తిరిగి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న గూడ్స్ ట్రక్కు ఎదురుగా వస్తున్న ట్రైలర్‌ను ఢీకొట్టి, మరో భారీ వాహనాన్ని ఢీకొట్టిందని రాయ్‌పూర్ సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ లాల్ ఉమేద్ సింగ్ చెప్పారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసు బృందాన్ని ఘటనా స్థలానికి పంపామని, గాయపడిన వారిని రాయ్‌పూర్‌లోని డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి సాయి విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

# ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే పోరు

### భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయ్

### పాక్ ఆటలు సాగనివ్వకుండా చేశాం

### అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం

### చైనా తయారుచేసిన పిఎల్-15 క్షిపణిని నేలకూల్చాం

### ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశంలో రక్షణశాఖ అధికారులు వెల్లడి



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఈనెల 7న జరిపిన దాడుల్లో ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే తమ పోరు అని ఆపరేషన్ సిందూర్‌పై నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పాకిస్థాన్‌పై దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయన్నారు. దాయాది ఆటలు సాగనివ్వకుండా చేశామన్నారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. అనంతరం పాక్‌లోని నూర్ ఖాన్, రహీమ్‌యార్ ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

**పిఒకెలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఎకె భారతి**

పాకిస్థాన్, పిఒకెలో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం. పిఒకెలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా మనం యుద్ధం చేశాం. అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్‌ను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకూ ఎలాంటి నష్టం చేయలేదు. అదే సమయంలో పాకిస్థాన్ వైపు నుంచి దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. చైనా తయారు చేసిన పిఎల్–15 క్షిపణిని నేలకూల్చాం. పాకిస్థాన్‌కు చెందిన అనేక డ్రోన్లు, క్షిపణులనును కూల్చివేశాం. ఉగ్రవాదంపై పోరాటంలో పాక్ సైన్యం జోక్యం చేసుకుంటే తిప్పికొట్టాం. కరాచీ సమీపంలోని లక్ష్యాలపైనా దాడులు చేశాం' అని ఎయిర్ మార్షల్ ఎకె భారతి వెల్లడించారు.

**పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్**

భారత్ వైపు గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామన్నారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని చెప్పారు. డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు పేర్కొన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నాం. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. మన స్వదేశీ ప్రతిస్పందన దాడి వ్యవస్థ చాలా బలమైంది. సైన్యానికి అండగా నిలిచిన 140 కోట్ల మంది ప్రజలకు ధన్యవాదాలు. ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది అని వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు.

**మా పోరాటం ఉగ్రవాదులపైనే..**

మన గగనతల రక్షణ వ్యవస్థలోని దశలను చూస్తే మీకు ఇంకా బాగా అర్థమవుతుంది. శత్రువులు ఎన్ని హద్దులు దాటి వచ్చినా.. ఈ గ్రిడ్ సిస్టమ్‌లోని ఒక లేయర్ వారిని నాశనం చేస్తుంది. మన ఎయిర్ డిఫెన్స్ అంత శక్తిమంతమైనది, విలువైనది అని ఆర్మీ డిజిఎంఒ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. అయితే, తమ పోరు ఉగ్రవాదంపైనే అని, అనవసరంగా పాక్ ఆర్మీ ఇందులో జోక్యం చేసుకుందన్ని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చిందని.. ఉగ్రవాదులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని రాజీవ్ ఘాయ్ అన్నారు.

**కిరానా హిల్స్‌ను టార్గెట్ చేయలేదు : భారతి**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఎకెభారతి వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అణుస్థావరాన్ని భారత్ లక్ష్యంగా చేసుకున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ అసత్య ప్రచారంపై స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్ తన అణ్వాయుధాలను కిరానా హిల్స్ వద్ద నిల్వ చేస్తుందని చెప్పినందుకు థ్యాంక్స్. అక్కడ ఏమైనా ఉండనీ.. మేం మాత్రం ఆ హిల్స్‌ను టార్గెట్ చేయలేదు. మేం లక్ష్యంగా చేసుకున్నామని చెప్పిన జాబితాలో అది లేదు అని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ అణు స్థావరంపై దాడి గురించి అనేక వార్తలు చక్కర్లు కొట్టాయి. అణ్వాయుధాలను నిల్వచేసి ఉండొచ్చని చెప్తున్న హిల్స్. సర్గోధా వైమానిక స్థావరానికి దగ్గర ఉన్నాయని వాటి సారాంశం. ఆ వైమానిక స్థావరాన్ని భారత్ టార్గెట్ చేసినట్లు మన సైన్యం ధ్రువీకరించగానే ఆ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. పాక్‌లో ఇటీవల సంభవించిన భూకంపాలకు.. అణు నిల్వలు ఉంచిన ప్రదేశాన్ని ఢీకొట్టడానికి ముడిపెట్టిన సిద్ధాంతాలు చక్కర్లు కొట్టాయి. వీటన్నింటికి తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఏకే భారతి చెక్ పెట్టారు.

**క్రికెటర్ కోహ్లీ ప్రస్తావన**

స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రస్తావన తెచ్చారు. మన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సామర్థ్యాన్ని ఆస్ట్రేలియా దిగ్గజ ఫాస్ట్ బౌలర్లు జెఫ్ థామ్సన్, డెనిస్ లిల్లీ ద్వయంతో పోలుస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఎంతోమంది అభిమానుల్లాగే నాక్కూడా ఆయన ఎంతో ఇష్టమైన క్రికెటర్. అందువల్ల క్రికెట్ గురించి మనం ఇప్పుడు మాట్లాడుకోవచ్చు. 1970ల్లో నేను స్కూల్ రోజుల్లో ఉన్నప్పుడు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య ఓ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఆ సమయంలో ఆసీస్ మేటి బౌలర్లు జెఫ్ థామ్సన్, డెనిస్ లిల్లీ విధ్వంసం సృష్టించారు. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను ఊచకోత కోశారు. అప్పుడు ఆస్ట్రేలియా ఓ పద ప్రయోగం చేసింది. యాషె స్ టు యాషెస్ (బూడిదను ఉద్దేశిస్తూ).. డస్ట్ టు డస్ట్.. థామ్సన్‌కి దొరక్కపోతే.. లిల్లీకి చిక్కాల్సిందే అని పేర్కొం ది. ఇప్పుడు పాకిస్థాన్‌పై పోరులో భారత్ ఆధిపత్యాన్ని అలాగే అభివర్ణించొచ్చు అని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు.

# పాలనలో కొనసాగింపునకు 'బ్రహ్మోస్' ఒక అద్భుత రుజువు



కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్

### బ్రహ్మోస్ క్షిపణిని సైన్యంలోకి చేర్చింది కాంగ్రెస్ పాలనలోనే

### దానిని అంత సులభంగా 'తిరస్కరించలేము'... 'తుడిచివేయలేము' అని వ్యంగాస్త్రాలు

**న్యూఢిల్లీ :** పాలనలో కొనసాగింపునకు బ్రహ్మోస్ క్షిపణి ఒక అద్భుతమైన రుజువు అని, దీనిని 'తిరస్కరించలేము', 'తుడిచివేయలేము' అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఇది ప్రస్తుత పాలక సంస్థలకు ఒక అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన 'ఎక్స్'పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. జైరమేష్ మాట్లాడుతూ బ్రహ్మోస్ క్షిపణిని 2005లో భారత నావికాదళంలోకి, 2007లో ఇండియన్ ఆర్మీలోకి చేర్చారని చెప్పారు. గాలి నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ 2012లోనే కనిపించిందని, ఇదంతా అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ హయాంలోనే జరిగిందన్నారు. 'మన్మోహన్ నాయకత్వంలో 2005లోనే చారిత్రక ఇండోయుఎస్ న్యూక్లియర్ ఒప్పందానికి దారితీసింది. పదకొండు ఏళ్ల తర్వాత భారతదేశం మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ పాలనా వ్యవస్థలోకి చేరేందుకు మార్గం సుగమం అయ్యింది. హైదరాబాద్‌లోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్, బ్రహ్మోస్ ఏరోస్పేస్ తిరువనంతపురం లిమిటెడ్ అదే కాలంలో స్థాపించబడింది. బ్రహ్మోస్ ఇటీవల కాలంలో బాగా వార్తలలోకి ఎక్కింది. బ్రహ్మపుత్ర, మోస్కవా పేర్ల తర్వాత భారత్‌రష్యా సహకారానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందన్నారు. అంతేకాకుండా ఇది పాలనలో కొనసాగింపునకు మరొక అద్భుత అనుకూలత. దీనిని అంత సులభంగా 'తిరస్కరించలేము', 'తుడిచివేయలేము' అని జైరామ్ రమేష్ అన్నారు. కానీ ఇది న్యూఢిల్లీలోని అధికార పాలనావ్యవస్థకు ఒక నిరంతర అలవాటుగా మారిందని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ విమర్శలు గుప్పించారు. భారతదేశం ఇంటిగ్రేటెడ్ క్షిపణి అభివృద్ధి 1983లో ప్రారంభమైందని, అది అద్భుత విజయాలు సాధించిందని అన్నారు. 1990వ దశకంలో ఒకానొక సమయంలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్, ఆయన సహచరులు డాక్టర్ శివథాను పిళ్లె తదితరులు సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్ల కోసం రష్యన్ల సహకారం తీసుకోవడం అవసరమని భావించారని జైరామ్ రమేష్ వివరించారు. 1998లో ప్రధానమంత్రిగా ఐకె.గుజ్రాల్ ఉన్నప్పుడు ఒక అంతర్ ప్రభుత్వ ఒప్పందంపై సంతకం చేశారని, యాధృచ్ఛికంగా ఆయన 1976 నుండి 1980 వరకూ యుఎస్ఎస్ఆర్‌కు భారత రాయబారిగా ఉన్నారని తెలిపారు. అటల్‌బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మొదటి ఒప్పందంపై 199, జులై 19న సంతకం చేశారని చెప్పారు. 2001, జూన్ 12న మొట్టమొదటి ప్రయోగం విజయవంతమైందని జైరామ్ రమేష్ వివరించారు. బ్రహ్మోస్ ప్రధానకార్యాలయాన్ని 2004, డిసెంబరు 4న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రారంభించారని రమేష్ తెలిపారు.

# ప్రజా భద్రతకోసం పది ఉపగ్రహాలు పనిచేస్తున్నాయ్

### 2040 నాటికి భారత్‌కు సొంత అంతరిక్షకేంద్రం

### ఇస్రో చైర్మన్ నారాయణన్

**ఇంఫాల్ :** దేశ ప్రజల భద్రత, ప్రజల సంక్షేమానికి పూర్తి భరోసా ఇవ్వడానికి వ్యూహాత్మక ప్రయోజనాల నిమిత్తం పది ఉపగ్రహాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయని భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) చైర్మన్ డా.వి.నారాయణన్ చెప్పారు. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య నాలుగు రోజులపాటు జరిగిన సైనిక ఘర్షణ, మే ఏడో తేదీన భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పూర్వరంగంలో ఆయన ప్రసంగం ప్రాధాన్యం సంతరించుకుంది. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ, భారతదేశం ''ఒక అంతరిక్ష మహాశక్తి''గా రూపుదాలుస్తోందని, 2040 నాటికి భారతదేశం తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకుంటుందని చెప్పారు. ''మనం దేశాన్ని భద్రంగా చూసుకోవాలంటే మన ఉపగ్రహాల ద్వారా సేవలు పొందాల్సిన అవసరం ఉంది. భారతదేశ ఉత్తరప్రాంత భూభాగాన్ని ఎంతో అప్రమత్తంగా కనిపెట్టుకుని ఉండాలి, మన దేశానికి ఏడువేల కిలోమీటర్ల విస్తారమైన సముద్ర తీర ప్రాంతం ఉంది, ఈ తీరప్రాంతాన్ని నిరంతరం కనిపెట్టుకుని ఉండాల్సి ఉంది, ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం లేకుండా, డ్రోన్ టెక్నాలజీ లేకుండా ఈ లక్ష్యాలను మనం సాధించలేమన్నారు. జి–20 దేశాల ప్రయోజనాలకోసం ఒక ఉపగ్రహాన్ని ఇస్రో అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ ఉపగ్రహం ద్వారా జి–20 దేశాలలో వాతావరణ మార్పుల అధ్యయనం, గాలి కాలుష్యం, శీతోష్ణస్థితిగతుల పర్యవేక్షణ చర్యలు చేపడతామన్నారు.



''ఈరోజునాటికి భారతదేశం 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించింది, ఆయా దేశాల అవసరాలకు అనుగుణంగా స్థిరకక్ష్యల్లోకి పంపింది, ఈ విషయాన్ని ఈ రోజున మీతో పంచుకోవడానికి నేనెంతో సంతోషపడుతున్నాను, పది ఉపగ్రహాలు దేశ ప్రజల భద్రత కోసం, వారి క్షేమాన్ని ఆశించి వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడేందుకు ఇరవైనాలుగు గంటలూ విరామం లేకుండా పనిచేస్తున్నాయి'' అన్నారు. భారత్–పాకిస్థాన్ రెండు దేశాలూ శనివారంనాడు కాల్పుల విరమణ అవగాహనకు వచ్చాయి. దీంతో సైనిక ఘర్షణను తక్షణ ప్రాతిపదికపై రెండు దేశాలూ విజ్ఞతతో నిలిపివేశాయి. ఒక తరం ఉపగ్రహ ప్రయోగ వాహనాలను ఈ రోజున మన దేశం అభివృద్ధి చేసింది, 1975లో మన మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగం జరిగింది. ఈనాటి వరకూ మనం వివిధ రకాల సామర్థ్యంతో కూడి వివిధ రకాల 131 ఉపగ్రహాలను మనం నిర్మించాం, భారత్, అమెరికా దేశాలు రెండు సంయుక్తంగా అత్యంత ఖరీదైన, ముందుతరానికి కూడా ఉపయోగపడేవిధంగా భూ చిత్రాల ఉపగ్రహాలను నిర్మించబోతున్నాం, భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పటి నుండీ ఇప్పటివరకూ అసాధారణమైనరీతిలో పురోగతి సాధించింది'' అని నారాయణన్ చెప్పారు. ''మనదేశం స్వాతంత్ర్యం పొందేనాటికి దేశంలో 97.5 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారు, వారి సగటు జీవన ప్రమాణాలు కూడా 32 సంవత్సరాలుగానే ఉండేది, కానీ ఈనాడు మన సగటు జీవన ప్రమాణాలు 72 సంవత్సరాలకు పెరిగింది, ప్రతిరంగంలోనూ భారతదేశం వృద్ధి సాధించింది'' అని చెప్పారు. విద్యారంగంలో కూడా మన అక్షరాస్యత స్వాతంత్ర్యం నాటికి 12 శాతంగానే ఉండేది, ఆనాడు ప్రాథమిక పాఠశాలలు గట్టిగా చూస్తే 2,825 ఉండేవికావు, కానీ ఈనాడు మన ప్రాథమిక పాఠశాలలసంఖ్య 8.40 లక్షలకు చేరుకుంది, 1947లో మనదేశానికి ఎలాంటి అంతరిక్ష కార్యక్రమం లేద, 1962 నాటికి ప్రాథమికంగా మనం అంతరిక్షరంగ ప్రయాణానికి శ్రీకారం చుట్టాం, 1969వ సంవత్సరం భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ చరిత్రలో ఒక గొప్ప సంవత్సరం ఎందుకంటే ఆనాడు ఇస్రో ఆవిర్భవించింది, మనం మన అంతరిక్ష కార్యక్రమాలను ప్రారంభించేనాటికి పోల్చి చూసుకుంటే అభివృద్ధి చెందిన దేశాలకంటే 70 సంవత్సరాలు వెనకబడి ఉన్నాం, ఆనాడు మనకు ఎలాంటి ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం లేదు, ప్రతిరంగంలోనూ భారతదేశం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది, వ్యవసాయరంగం దేశంలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది, దేశ వృద్ధిలో దానిదే కీలకపాత్ర'' అని ఆయన చెప్పారు. ''మీరు ఈరోజున తీసుకున్న డిగ్రీలు భారతదేశానికి ఎంతో ముఖ్యమైనవి, 2047 నాటికి వికసిత్ భారత్ అనే లక్ష్యాన్ని దార్శనిక ప్రయోజనాలను సాధించాలంటే మీరు కీలకపాత్ర నిర్వహించాలి, విద్యార్థులదే కీలకపాత్ర'' అని నారాయణన్ చెప్పారు.

# కాల్పుల మోత లేదు

### ప్రశాంతంగా సరిహద్దు జిల్లాలు



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణ (ఎల్‌ఒసి) వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వెంబడి ప్రశాంతత నెలకొంది. ఆదివారం రాత్రి ఎలాంటి కాల్పుల మోత లేదు. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్తాన్ సరిహద్దుల్లో ప్రజలు సాధారణ కార్యకలాపాలు సాగించారు. పంజాబ్‌లో ముందస్తు చర్యల్లో భాగంగా స్కూళ్లు, పాఠశాలలు మూసివేశారు. రాజస్థాన్‌లోని సరిహద్దు జిల్లాల్లో బ్లాక్ అవుట్ పాటించారు. కాగా, జమ్ముకశ్మీర్‌లో సరిహద్దు వెంట భారత్, పాకిస్థాన్ సైన్యాల మధ్య ఎటువంటి ఘర్షణలు లేవు. ఈ మేరకు భారత సైన్యం సోమవారం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ఇతర ప్రాంతాలలో రాత్రి చాలావరకు ప్రశాంతంగా ఉన్నట్లు ఒక సంక్షిప్త ప్రకటనలో తెలిపింది. ఇటీవలి రోజుల్లో తొలిసారి ప్రశాంత రాత్రిని చూసినట్లు తెలిపింది. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసేందుకు ఈనెల 7న ఆర్మీ ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. నాశనం చేయడానికి భారతదేశం మే 7 ప్రారంభంలో ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. అయితే భూమి, వాయు, సముద్రంలో అన్ని కాల్పులు, సైనిక చర్యలను ఆపడానికి భారత్, పాకిస్థాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చాయని ప్రకటించాయి. అయినప్పటికీ శనివారం రాత్రి పాక్ సైన్యం కొన్ని ఉల్లంఘనలు చేసింది.

**పంజాబ్‌లోని కొన్ని జిల్లాల్లో స్కూళ్లు మూసివేత**

పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో సోమవారం సాధారణ పరిస్థితులు కనిపించాయి. మార్కెట్లు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. అయితే ముందుజాగ్రత్త చర్యగా కొన్ని జిల్లాల్లో పాఠశాలలు మూసివేశారు. పరిస్థితి అదుపులో ఉందని, సరిహద్దు జిల్లాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయలేదని జిల్లా అధికారులు తెలిపారు. అయితే ఎటువంటి పుకార్లను నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని ప్రజలను కోరారు. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా, పఠాన్‌కోట్, అమృత్‌సర్, తర్న్ తరణ్, గురుదాస్‌పూర్ జిల్లాల్లోని పాఠశాలలు మూసివేశారు. పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్‌లలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు కూడా మూశారు. అయితే, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించుకోవచ్చని గురుదాస్‌పూర్ అధికారులు తెలిపారు. సరిహద్దు జిల్లాల్లోని పఠాన్‌కోట్, పాకిస్థాన్ ప్రారంభించిన బహుళ డ్రోన్ దాడులను చూసింది, వాటిని భారత భద్రతా దళాలు తిప్పికొట్టాయి. ఫిరోజ్‌పూర్‌లో, సురక్షిత ప్రదేశాలకు వెళ్లిన గ్రామస్తులు తమ గ్రామాలకు తిరిగి వస్తున్నారు. సరిహద్దుకు సమీపంలోని జల్లోకె గ్రామానికి చెందిన దలేర్ సింగ్ మాట్లాడుతూ సమీప ప్రాంతాల నివాసితులు చాలా మంది తమ ఇళ్లను విడిచిపెట్టి వెళ్లిపోయారనిన్నారు. ఇప్పుడు వారిలో ఎక్కువ మంది తిరిగి వచ్చారని, అయితే జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారన్నారు. మొత్తంమీద, జీవితం సాధారణంగా మారింది, తాము తమ పొలాలకు తిరిగి వెళ్తున్నామని చెప్పారు. కాల్పుల విరమణ తర్వాత రద్దు చేయబడిన, స్వల్పకాలిక నిలిపివేసిన రైలు సర్వీసులను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, మోగాలోని అధికారులు ఆదివారం సాయంత్రం ప్రజలు తమ ఇళ్ల వద్ద స్వచ్ఛందంగా లైట్లు ఆపివేయాలని, అవసరమైతే తప్ప బయటికి వెళ్లవద్దని సూచించారు.

**రాజస్థాన్ సరిహద్దు జిల్లాల్లో బ్లాక్ అవుట్**

భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తరువాత ముందు జాగ్రత్త చర్యగా రాజస్థాన్ సరిహద్దు జిల్లాల్లో ఆదివారం రాత్రి పూర్తిగా బ్లాక్ అవుట్ విధించారు. బర్మేర్‌లో ఆకాశంలో డ్రోన్లుగా భావించిన రెడ్‌లైట్లు కనిపించాయని వార్తలు వచ్చాయి. ఇన్‌కమింగ్ డ్రోన్ కార్యకలాపాలు గుర్తించినట్లు జిల్లా యంత్రాంగం ఎక్స్‌ల ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. దయచేసి అందరూ ఇళ్లలోనే ఉండి బ్లాక్ అవుట్‌ను పాటించాలని డిఎం బర్మేర్ విజ్ఞప్తి చేశారు. అయితే డ్రోన్‌ను పేల్చివేసినట్లు సోషల్ మీడియా వస్తున్నవి తప్పుడు పోస్టులు అని జిల్లా యంత్రాంగం తోసిపుచ్చింది. సోమవారం ఉదయం నాటికి, సరిహద్దు జిల్లాల్లో టీ స్టాళ్లు, దుకాణాల వద్ద ప్రజలు గుమిగూడి, సాధారణ సంభాషణల్లో పాల్గొనడంతో సాధారణ పరిస్థితి ఏర్పడినట్లు అనిపించింది. జైసల్మేర్ స్థానికుడు జలం సింగ్ మాట్లాడుతూ ఇప్పుడు పరిస్థితులు యథావిధిగా కనిపిస్తున్నాయని, రాత్రి ప్రశాంతంగా ఉందని చెప్పారు. రాత్రి జిల్లాలలో బ్లాక్‌అవుట్ సమయాలు మారుతూ ఉన్నాయి. జైసల్మేర్‌లో సాయంత్రం 7:30 నుండి ఉదయం 6 గంటల వరకు, బికనీర్‌లో సాయంత్రం 7 నుండి ఉదయం 5 గంటల వరకు, గంగానగర్‌లో సాయంత్రం 7 నుండి సూర్యోదయం వరకు, బర్మేర్‌లో రాత్రి 8 నుండి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే, ముందు జాగ్రత్త చర్యగా సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు మూసివేశారు. భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నా యి. ఏదైనా పరిస్థితిని ఎదుర్కొనేందుకు అన్ని జిల్లాలలో అన్ని ఏర్పాట్లు చేసిటన్లు జైపూర్‌లో హోం శాఖ అధికారి ఒకరు తెలిపారు.

## వయనాడ్ కొండచరియల బాధితులకు సకాలంలో పునరావాసం

### సిఎం పినరయ్ విజయన్ హామీ

**తిరువనంతపురం :** వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితులకు పునరావాస కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం హామీ ఇచ్చారు. బాధితుల వసతి కోసం నెలవారీ అద్దెను అత్యవసరంగా అందించాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. గత సంవత్సరం కొండచరియలు విరిగిపడిన వయనాడ్‌లోని ముండక్కై, చూరల్‌మల గ్రామాల నుండి ప్రాణాలతో బయటపడిన వారి కోసం ప్రతిపాదిత టౌన్‌షిప్ నిర్మాణ పనుల పురోగతిని అంచనా వేయడానికి జరిగిన సమావేశంలో ఆదేశాలు జారీ చేసిటన్లు సిఎంఒ తెలిపింది. టౌన్‌షిప్ నిర్మాణానికి పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక అనుమతులు పొందేందుకు కాలపరిమితి నిర్ణయించినట్లు వెల్లడించింది. ముండక్కై, చూరల్‌మలలో కొండచరియలు విరిగిపడిన వారికి పునరావాసం సకాలంలో పూర్తవుతుందని సమావేశం తర్వాత విజయన్ చెప్పినట్లు ప్రకటనలో అధికారులు ఉటంకించారు. ముఖ్యమంత్రితో పాటు, కేబినెట్ మంత్రులు కె రాజన్, కె ఎన్ బాలగోపాల్, ప్రధాన కార్యదర్శి ఎ జయతిలక్ మరియు ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారని సిఎంఒ ప్రకటనలో తెలిపింది.

**IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY**
**O.S.No. 79 OF 2025**

**Between:-**

1. Vakula Rammurti Vanamamula, W/o. Rammurti Vanamamula. Age: 77 yrs. Occu: Household, R/o. Ankisa, Rangadhampeth, Gadchiroli, Sironcha, Maharastra.
2. Pullakandam Indira. W/o. Rangaiah. Age: 62 yrs. Occu: Household, R/o.Nallabelli village & Mandal, Warangal Dist., Telangana - 506349.
3. Thirunahari Venkatramnarsaiah. S/o, Late. Lakshminarsaiah, Age: 57 yrs, Occu: Agril, R/o. Ghanpur(M) village & Mandal, Jayashankar Bhupalpally Dist., Telangana - 506345.
4. Thirunahari Jitender Swamy. S/o. Late. Thirunahari Laxmi Narsaiah, Age: 53 yrs. Occu: Govt. Employee, R/o. Ghanpur(M) village & Mandal, Jayashankar Bhupalpally Dist., Telangana - 506345.
5. Ramanujapuram Sumathi, W/o.Late. Anjaneyulu, Age: 50 yrs, Occu: Household. R/o. Shanthi Nagar, Balaji Nagar, Jawaharnagar, K.V. Rangareddy. Telangana - 500087.

... Plaintiffs

**AND**

1.The State of T.G. Represented by the District Collector. Jayashankar Bhupalpally district

2.The Tahasildar, Ghanpur (M) Mandal

3. Whom so ever it may concern

... Defendants

**PUBLIC NOTICE**

To.
Whom so ever it may concern

Please take notice that the above named plaintiffs filed the suit for declaring them as legal heirs of late. Kum. Thirunahari Venkataramana, D/o. Late. Thirunahari Laxmi Narsalah, R/o. H.No. 5-62, Ghanpur(m) Village & Mandal. Jayashankar Bhupalpally District, who died on 18.10.2024. If any person or persons having any objection with regard to declaring the plaintiffs as legal heirs of Late. Kum.Thirunahari Venkataramana, they may file objections either in person or through an advocate before the Hon'ble Court on **10.06.2025 at 10-30 A.M,** and if no such objections are filed or received in the above suit, the matter will be decided on merits as per law.

//By order of the court//

Sd/-
**CH.VENUGOPALA CHARY,**
**RAJENDER CH,**
ADVOCATES
#Opp: District Court Complex.
Mulugu Town & District.
Phone No. 9908983854.

## చిన్నతనంలోనే విశాల దృక్పథం



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇటీవల ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరుగుతుండడంతో భారత సైన్యానికి తన వంతు కర్తవ్యంగా రూ.లక్ష విరాళాన్ని తన తల్లి (ప్రభుత్వ విప్ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సతీమణి) అనితతో కుమారుడు శివమణి వెళ్లి స్వయంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేసి తాను దాచుకున్న సొమ్మును మాత్రమే తనవంతు కర్తవ్యంగా సైనికులకు విరాళంగా జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. చిన్నతనంలోనే ఇంతటి ఔదార్యాన్ని కనబరిచిన శివమణి భవిష్యత్తులో మరింత ప్రయోజకుడు కావాలని, ఎన్నో సమాజ హితం కోరే కార్యక్రమాలు చేపట్టాలని తాను మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా శివమణితో శివమణి మాతృమూర్తి అయిన ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణిని కలెక్టర్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/చివ్వెంల:** త్వరగా కాంటాలు, వేసి కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం చివ్వెంల మండలంలోని కుడకుడ మోప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 9725.06 క్వింటాళ్ల ధాన్యం కుడుకుడ కొనుగోలు కేంద్రం నుండి తరలించడం జరిగిందని తెలిపారు. రైతులు తాలు లేకుండా తూర్పాలపోసి శుభ్రమైన ధాన్యంను తీసుకరావాలని, తేమ శాతం17 రాగానే సీరియల్ ప్రకారం కాంటావేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి చిట్టెమ్మ, సభ్యురాలు గీత, రైతులు పాల్గొన్నారు.



## వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

### స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని స్వయంభు వెంకటగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో సోమవారం రోజున స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలు పాల్గొని స్వామివారికి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వారు సమర్పించిన తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందచేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సీఎం సీపీఆర్వో బోరెడ్డి అయోధ్యరెడ్డి పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వంశ పారంపర్య పూజారి రమాకాంత్ శర్మ, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూద గాని హరిష్ శంకర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయి, దేవాలయ కమిటీ సభ్యులు కల్లూరి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

## భావిభారత పౌరులు ధృడంగా ఉండాలి

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహ




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పిల్లలు భావిభారత పౌరులుగా ధృడంగా ఉండాలని, తల్లిదండ్రులు, గురువులు చెప్పేది బుద్ధిగా నేర్చుకోవాలని, మంచి పౌరులుగా అందరికి మంచిపేరు తెస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహ్ అన్నారు. వేసవి సెలవులు సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట పట్టణంలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో పిల్లలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో పిల్లలకు మేధస్సు, జ్ఞాపక శక్తి, ప్రయోగాత్మక విధానం పెంపొందించే విధంగా ప్రయోగాత్మక ఇంటలిజెన్స్, యోగా, క్రాఫ్ట్ మ్యూజియం, కర్రసాము, సంప్రదాయ నృత్యం, సంగీత పరికరాలు, ఇండోర్ ఆటలపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసులకు, డయల్ 100 తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డిఎస్పీ పార్థసారధి, జిల్లా భాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి, బాలభవన్ సభ్యులు, రిటైర్డ్ అధ్యాపకులు అమీద్‌ఖానఖ్,యోగా గురువు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులందర్నీ అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం : వీరారెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరా రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలో మహిళల అక్షరాస్యత కూడా పెరగాలన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక పరంగా కృషి చేయాలన్నారు. ముందుగా ట్యూటర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. తద్వారా జిల్లా స్థాయిలోనూ మండల స్థాయిలోనూ గ్రామస్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేసి ట్యూటర్ల చే శిక్షణ ఇప్పించాలని అంచలంచలుగా నిరక్షరాస్యతను రూపుమాపాలని తెలియజేశారు. జిల్లాలో సుమారు 99 వేల మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు నివేదిక ఉన్నందున 21 వేల మంది అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. ఉల్లాస్ యాప్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఎన్ఐసిపి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, వయోజన విద్య ఉపసంచాలకులు మమత, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఉల్లాస్ జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు బాలాజీ, డిపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని సుద్దాల గ్రామంలో సోమవారం రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుండే ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యకు స్వామి వార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. విగ్రహ దాత శివరాత్రి యాదగిరి వారి కుటుంబ సభ్యులు, వారి కుమార్తె అల్లుడు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, సోమన్న, యాదయ్య, కృష్ణమూర్తి, యాదగిరి, ఉప్పలయ్య, వీరస్వామి, శ్రీశైలం, నర్సింహాచారి, నర్సయ్య, ఎల్లయ్య, పాండరి, మల్లయ్య, రాజబోస్, మల్లయ్య, ఐలయ్య, కృష్ణారెడ్డి,గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

### జిల్లా వెబ్ పోర్టల్‌లో శాఖల వారీగా వార్షిక కార్యాచరణ ప్రణాళికలు అప్‌డేట్ చేయాలి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజావాణిలో దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వెబ్ పోర్టల్ నందు శాఖల వారిగా డిపార్ట్‌మెంట్ ప్రొఫైల్, జిల్లా స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు సిబ్బంది వివరాలు, జాబ్‌చార్ట్, వార్షిక నివేదిక, శాఖల వారిగా అమలు చేసిన పథకాలు, లబ్ధిదారులు వివరాలు అప్డేట్ చేయాలని తెలిపారు. ప్రతి శాఖఖ కార్యాలయంలో ఒక్క అధికారిని నోడల్ అధికారిగా నియమించి శాఖపరంగా స్కీమ్స్ ప్రొగ్రామ్, సమస్యలు ఏమైనా ఉన్న తమకు తెలియజేయాలన్నారు. ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేయాలని, జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు సమన్వయం చేసుకుంటూ త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని కోరారు. ఈనెల 25వ లోపు సంక్షేమ అధికారులు, రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులని పరిశీలించి బ్యాంకు క్లియరెన్స ఇప్పించి లబ్ధిదారులని ఎంపిక చేయాలని, జూన్ 2 న ఎంపికైన లబ్ధిదారులకు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలకి సంబంధించి 21 దరఖాస్తులు, వివిధ ఎంపీడీవోలకు 18 దరఖాస్తులు, మున్సిపల్ కమిషనర్లకి 8, పంచాయతీ రాజ్ శాఖ 4, మిగిలిన 15 వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయని మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి అప్పారావు, డిపివో యాదయ్య, డిడబ్ల్యూవో నర్సింహారావు, సిపివో కిషన్, డిఇవో అశోక్, డిఎంహెచ్‌వో కోటచలం, డిఏవో శ్రీధర్‌రెడ్డి, వేల్ఫేర్ అధికారులు శంకర్, దయానందరాణి, జగదీష్‌రెడ్డి, శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.




## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/దేవరకొండ:** మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, నూనె రామస్వామిలు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి 44 ఉన్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి పెట్టుబడిదారులు, పారిశ్రామికవెత్తలకు అనుకూలంగా కార్మిక చట్టాలను కోడ్ రూపంలో తీసుకువచ్చి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేసిందన్నారు. భారత దేశానికి స్వాతంత్రానికి పూర్వ మే 1926లో కార్మిక చట్టాలు పెట్టుకునే చట్టం పోరాడి సాదించుకోవడం జరరిగిందని అటువంటి చట్టాలను కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో కరోనా కాలంలో మెజార్టీ పార్లమెంట్ సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండానే ఏకపక్షంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి తీసుకువచ్చిందని దీనికి వ్యతిరేకంగా యావత్తు కార్మిక వర్గం మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ కోశాధికారి వెంకటరాములు, నీల వెంకటయ్య, మల్లయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, ధనయ్య, సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం అభివృద్ధే ధ్యేయం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం తూర్పుపల్లినుండి కొమ్మేపల్లి వరకు 2.70కోట్ల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబ్‌నగర్ జాతీయ రహదారి నుండి దౌరాజ్‌తండా వరకు 1.60 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దేవేందర్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, ధనలక్ష్మీ , రాంసింగ్, ఎంపిడివో డానియల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల విజ్ఞప్తులకు సత్వరమే పరిష్కారం



యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తు లను 56 స్వీకరించారు. అందులో కొన్ని ఇలా ఉన్నాయి. గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన కందాల శాంతమ్మ దరఖాస్తు అందిస్తూ భర్త కృష్ణా రెడ్డి మృతి చెందారని, వికలాంగురాలు అయినందున 4 ఎకరాల 32 కుంటల భూమి తనకు తెలియకుండా ఇద్దరు కొడుకులు వాళ్ళ పేర్లపై మార్చుకున్నారని, ఇల్లు కూడా విక్రయించుకున్నారని, తనను చూడడం లేదని తన భూమి తనకు ఇప్పించాలని కోరారు. భువనగిరి మండలం గౌస్ నగర్‌కు చెందిన సిహెచ్ మల్లారెడ్డి తన దరఖాస్తును అందిస్తూ సర్వే నెంబరు 144, 147లలో 17 ఎకరాల 26 గుంటల భూమి ఉందని ప్రక్కనే 148 సర్వేనెంబర్ లోని పల్లెర్ల మైసయ్య, యాదమ్మ, జంగం వెంకమ్మ, కందుకూరి జయమ్మ, వెల్వర్తి పోచమ్మ, నల్లెర్ల చంద్రయ్యలు తన భూమిని ఆక్రమిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి మండలం ఎల్బీ నగర్‌కు చెందిన బాలమణి తన భర్త చనిపోయాడని రేషన్ కార్డులో తన కొడుకు పేరు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హనుమపురంకు చెందిన ఎర్రబోయిన ఆండాలు భర్త పెద్ద నరసింహ పింఛన్ రావడంలేదని కూలి పనులపై ఆధారపడి జీవిస్తున్నామని దరఖాస్తు అందించారు. మోత్కూరు మండలం పొడిచెడు గ్రామానికి చెందిన మార్పాక స్వామి తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం పావు భూమి ధరణిలో ఇతరుల పేరుపై నమోదయిందని తన పేరుపై చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, సర్వే ల్యాండ్స్, హౌసింగ్, ఆర్‌టిసి, లేబర్, విద్య శాఖ, ఇంటర్మీడియట్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలకు దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభా రాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మునుగోడు:** విత్తనాలు ఎరువులు పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి పద్మజ మండల ఎరువుల దుకాణాల డీలర్లకు సూచించారు.సోమవారం మునుగోడు మండలం లోని ఎరువుల దుకాణాల డీలర్లకు మునుగోడు రైతువేదిక లో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందుబాటులో ఉంచాలని విత్తనాలు,ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతి రోజు పొందుపరచాలని సూచించారు. రైతులకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు మరియు లూజ్ విత్తనాలు ఎవరైనావా విక్రయం చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని మరియు నకిలీ విత్తనాలు కొని రైతులను మోసపోవద్దని లైసెన్స్ వున్న దుకాణాల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లుల ను పంట కాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్త చేసుకో వాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మునుగోడు మండల డీలర్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిర్వీర్యం చేయడానికి కుట్ర




**ప్రజాపక్షం/మర్రిగూడ:** : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మర్రిగూడ మండలం మహాసభ మర్రిగూడ మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో జిల్లా బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి బొల్లురి నరసింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని దానిలో భాగంగానే గత బడ్జెట్లో మాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి 80 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు ఈ పథకానికి అవసరమైన 2.50 లక్షల కోట్ల రూపాయలు కేటాయించి ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగాబందిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఉపాధి హామీ కార్మికులకు పని చేసే దగ్గర కనీస అవసరాలు అయినా మంచినీళ్లు , టెంటు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్టు పని ప్రదేశాల్లో అందుబాటు ఉంచాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన 6 గ్యారంటీలని అమలు చేయాలని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని ఇంటి స్థలాలు ఉండి ఇల్లు లేని వారికి ఎలాంటి నిబంధనలు లేకుండా ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జానీ మియా సిపిఐ మండల కార్యదర్శి బిక్షం రెడ్డ బాలకృష్ణ అంజయ్య రామలింగయ్య లింగస్వామి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :** అధ్యక్షులుగా జిల్లా బాలకృష్ణ కార్యదర్శిగా జక్కలి అంజయ్య సహాయ కార్యదర్శిగా శిరసాల రామలింగం ఉపాధ్యక్షులుగా బుర్ర నరసింహ కోశాధికారిగా లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.

# పోలీస్ కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని , రాంబాబు కుటుంబాన్ని పోలీస్‌శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో కోదాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టుబుల్ రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. దివంగత పోలీస్ సిబ్బంది కుటుంబాల ఆవసరాల తీర్చడంలో భాగంగా రాంబాబు కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల చెక్కును ఎస్పీ అందజేశారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీస్ సిబ్బంది నుండి నెల జీతం నుండి విరాళం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్‌గౌడ్, వేల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, రాంబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె.నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వివిధ ప్రాంతల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

## సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి అన్నారు. సోమవారం తిరుగండ్లపల్లి గ్రామ శాఖ సమావేశం లో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చాటాలని ఈ సభ్యులకు సూచనలు ఇచ్చారు. అనంతరము జరిగిన సమావేశంలో నూతన కార్యదర్శిగా శిరసవాడ నరసింహను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు అల్వాల నరసింహ, రామిడి లింగారెడ్డి, అయితే పాక హరికృష్ణ, కాగు ముత్యాలు, కాగు సత్తయ్య, లింగం, బత్తుల నరసింహ తదితరులు పాల్గొన్నారు. బట్లపల్లి నూతన శాఖ సమావేశం సోమవారం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాధగోని నరసింహ, సహాయ కార్యదర్శిగా ఆవుల భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా బడేటి రామస్వామి. ఎన్నుకోవడం జరిగింది.

# దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ప్రజాపక్షం/ మునుగోడు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గోస్కొండ లింగయ్య డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మునుగోడు ఇంచార్జ్ తహసిల్దార్ నరేష్ కు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించడంలో దళితులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని నియోజకవర్గానికి 3500 కేటాయించితే ప్రతి గ్రామానికి ఒక బూతుకు ఎనిమిది ఇండ్లను కేటాయించారు. ఫలితంగా గ్రామస్థాయిలో దళితులకు సరైన ప్రాధాన్యత లేక ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో తీవ్రమైనటువంటి అన్యాయం జరుగుతుందని దళితులకు ఇందిరమ్మ ఇండ్లలో 50శాతం కేటాయించాలన్నారు.దళిత యువతకు రాజీవ్ యువ వికాస్ పథకంలో సిబిల్ సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలకు ప్రాధాన్యత ఇస్తామని అంటున్నారు. రోజ కూలి పని చేసుకుని బతికే వారికి బ్యాంకు సిబిల్‌స్కోర్ ఏ విధంగా పెరుగుతుందని ఈఅంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఇంటి స్థలాలు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్ పి ఎస్ నాయకులు దుబ్బ వెంకన్న, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఈదులకంటి కైలాస్, దుబ్బ ముత్యాలు, ఏర్పుల నరేష్ ఉన్నారు.



## సామాన్యుడిలా మనస్సును దోచిన ఖమ్మం ఎంపి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** హంగు ఆర్భాటానికి దూరంగా ఉంటూ ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమయ్యే ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం ఉదయం రోడ్డు వెంట టిఫిన్ బండి వద్ద దోస తిన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి వెళ్తూ పోలీస్‌స్టేషన్ రింగ్ సెంటర్‌లో ఆగారు. రోడ్డు వెంట ఉన్న టిఫిన్ బండి వద్ద ఓ సామాన్యుడి మాదిరిగా వెళ్లి హాఫ్ దోస, సింగల్ ఇడ్లీ తినగా సార్ భలే సింపుల్‌గా ఉన్నారంటూ స్థానికులు ఒకింత ఆశ్చర్యంగా చూశారు. అక్కడున్న స్థానిక ఆదివాసీ యువతను ఎంపి ఆప్యాయంగా పలకరించగా వారంతా ఎంపితో సెల్ఫీలు తీసుకుని ఆనందించారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన పిఎస్ఆర్ మండల అధ్యక్షుడు



**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిను యువ నేత పిఎస్ఆర్ మండల అధ్యక్షుడుజరుపుల ధోని నాయక్ కలిశారు. ఈసందర్భంగా గ్రామంలో పలు సమస్యలు పరిష్కరించడానికి వినతి పత్రం అందించారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా నిధులు కేటాయించాలని, రాబోయే రోజుల్లో గ్రామ పంచాయితీ, స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపియడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు సింగరేణి ద్వారా కల్పించాలని కోరారు. శ్రీనివాస్ రెడ్డి అనుచరునిగా గ్రామ ప్రజలు ఏకంతో స్థానిక సంస్థ ఎన్నికలలో మద్దతు తెలుపుతున్నారని ఈసందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/బోనకల్:** కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఏసి నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిఐటియూ కార్యాలయం వద్ద సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెఏసి నాయకులు మాట్లాడుతూ..భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాల దశాబ్దాల పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం1996, అంతరరాష్ట్ర వలస కార్మికుల చట్టం1979, కాంట్రాక్ట్ చట్టం1970 తదితర 29 కార్మిక చట్టాలను సాధించుకున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. భారత కార్మిక వర్గానికి గొడ్డలి పెట్టు వంటి ఈ నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలతో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు పిలుపునిచ్చాయన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, కిలారి సురేష్, సిఐటియూ మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు, షేక్ ఖాదర్‌బాబా, గుగులోత్ నరేష్, ఎఐకెఎస్ మండల అధ్యక్షుడు కొంగర భాస్కరరావు, ఐఎన్‌టియుసి మండలకార్యదర్శి,తదితరులుపాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు



**ప్రజాపక్షం/ మధిర:** మధిర టౌన్ పరిధిలోని శాంతిభద్రల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కరించకోవాలని తెలిపారు. పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఎంతటి వారిపైనైనా చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని, వాహానాలకు సంబంధిందిచిన అన్ని ధృవీకరణ పత్రాలు ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లగించిన వారిపై వారి వాహానాలను సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. శాంతిభద్రల పరిరక్షణకు పోలీస్‌శాఖ తీసుకునే చర్యలకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గణేశ్వరం గ్రామంలో ఉపాధి హామీ పనులను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పని చేసే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చట్టంలో ఉన్నట్లుగా టెంట్లు, మెడికల్ కిట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పనులు చేస్తున్న కూలీలకు ఏ రోజుకు ఎంత డబ్బులు పడ్డాయో పే స్లిప్పులు అందించాలన్నారు. కొలతలతో నిమిత్తం లేకుండా రోజుకు రూ. 600 కూలీ ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ఆయన తెలిపారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు టీచర్లకు వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/ మధిర:** 2008 డిఎస్‌సి ద్వారా కాంట్రాక్టు ఉపాధ్యాయులు నియామకం పొందిన వారికి పెండింగ్ నాలుగు జీతాలను వెంటనే చెల్లించాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిరలోని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్య ఫెడరేషన్ కార్యాలయం నందు సోమవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జీతాలు అందక కాంట్రాక్ ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులన్నింటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి షేక్.నాగూర్ వలీ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఎ.వినోద్‌రావు, మధిర మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు,ఉపాధ్యక్షులు ,తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల పంపిణీ




**ప్రజాపక్షం/ఖమ్మం :** సన్‌రైజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వైరా మండలం గొల్లెనపహాడ్ గ్రామంలో పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. బిజెపి నాయకులు ఏనుగు సుమన్‌బాబు సోదరుడు కిషోర్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా రూ. 20వేల విలువైన నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా తల్లాడ ఎంపిడిఒసురేష్‌బాబు మాట్లాడుతూ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. బిజెపి నాయకులు ఏనుగు సుమన్‌బాబు, సంస్థ అధ్యక్షులు ఎంపి దాస్, ఉపాధ్యక్షులు ఏనుగు శివరాఘవ, సంస్థ ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో రాజీలేదు

### ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు

### తిరుమలాయపాలెం మండలం పర్యటనలో మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం:** తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రభుత్వం రాజీ పడేది లేదని, అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తామని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఇబ్బందులు పడుకుంటూ అయినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూగృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం మండల పర్యటనలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో 64మంది లబ్ధిదారులకు రూ.116లక్షల కళ్యాణ లక్ష్మీ , షాదీముబారక్ చెక్కులను అందించగా వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 57మంది లబ్ధిదారుకుల రూ.18.65లక్షల విలవ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదలకు అండగా ఉండేందుకు చిత్త శుద్ధితో పనిచేస్తుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదల కష్టాల్లో పాలుపంచుకుంటూ కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్‌తో పాటు విద్య, వైద్యానికి పెద్ద పీట వేసిందని, గడిచిన సంవత్సరంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆసుపత్రుల్లో పేదలు పొందిన వైద్యానికి రూ.1056 కోట్లు విడుదల చేసిందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మే నెలాఖరు వరకు అర్హులకు రేషన్‌కార్డులు అందిస్తామని, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 4వేల మందికి చేయూతనిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా రూ.9వేలకోట్లు ఖర్చు చేసి సబ్సిడీ యూనిట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం గోపాయిగూడెంలో ఎస్‌డిఎఫ్ నిధులు రూ.13.50లక్షలతో నిర్మించనున్న మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని, తరుగు పేరిట కటింగ్ చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. మేడిదపల్లి గ్రామ ఎస్‌సికాలనీలో రూ.16లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, తిమ్మక్కపేటలో రూ.35లక్షలు, ఎర్రగడ్డ ఎస్‌సి రూ.30లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్‌డిఒ , పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఎడిఎ సరిత, ఎంపిడిఒ , ఇన్‌చార్జి తహసీల్దార్ సుధీర్, ఎంపిఒ , ఎఒ సీతారామిరెడ్డి, ఎపిఒనర్సింహారావు, ఐకెపి ఎపిఎం, కాంగ్రెస్ జిల్లా నాయకులు,పంచాయతీకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మసీదుల అభివృద్ధికి, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మం శ్రీ శ్రీ సర్కిల్‌లోని మంత్రి పొంగులేటి నివాసంలో ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల 18 మసీదుల అభివృద్ధి, మరమ్మతుల కోసం మంజూరైన చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రంజాన్ నెలలో మసీదుల అభివృద్ధి, మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తానని మాట ఇచ్చిన ప్రకారం నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఒక్కో మసీదుకు లక్ష రూపాయల చొప్పున రూ. 18 లక్షలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను మసీదుల అభివృద్ధికి, మరమ్మతులకు వినియోగించాలన్నారు. ప్రతి పనికి సంబంధించిన బిల్లులు సమర్పించాలన్నారు.జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి. పురందర్, మైనార్టీ కార్యాలయ సిబ్బంది , మసీదుల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా



**ప్రజాపక్షం/ఖమ్మం :** నగరంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏదో లెక్కలు వేస్తూ తమ పార్టీలో పనిచేసే క్యాడర్‌కే ఇస్తామంటూ క్షేత్ర స్థాయి నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని ఆయన తెలిపారు. సిపిఐ నగర విస్తృత స్థాయి సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. నూనె శశిధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ నగరంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించే విషయంలో వివక్ష జరుగుతుందని ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు తప్ప మరో రాజకీయ పార్టీకి ఇండ్లు కేటాయించే పరిస్థితిలో ప్రభుత్వం లేక పోవడం శోచనీయమన్నారు. రెండు దశాబ్దాలుగా నగరానికి పెద్ద సంఖ్యలో వలస వచ్చారని వివిధ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని అద్దె ఇండ్లలో ఇబ్బందులు పడుతున్నారని జానిమియా తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లగా రేషన్ కార్డులు ఇవ్వలేదని ఈ ప్రభుత్వంలో వందలాది మంది రేషన్ కార్డులకు దరఖాస్తు చేశారని రేషన్ కార్డులను వెంటనే విడుదల చేయాలన్నారు. నగరంలో మౌలిక సమస్యల పరిష్కారానికి సత్వరం నిధులు కేటాయించాలని జానిమియా డిమాండ్ చేశారు. ఈ ఏడాది త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్ బిజి క్లెమెంట్, నగర సహాయ కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

## కరెంటు తీగలపైన చెట్టు కొమ్మలు

### నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

### చోద్యం చూస్తున్న అధికార గణం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల వచ్చిన గాలివానకు చెట్టు కొమ్మలు విరిగి కరెంటు తీగల పై పడి వారం రోజులు గడిచినా పట్టించుకున్న నా థుడే లేడు. పక్కనే గ్రామ పంచాయతీ కార్యాల యం ఉన్నా అక్కడి అధికారులు, సిబ్బంది సైతం స్పందించిన పాపాన పోలేదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే. నూ తన కలెక్టరేట్ ఉన్న గ్రామం. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామం లో ఇటీవల కురిసిన గాలి వానకు గ్రామ పంచాయతీ పక్కన ఉన్న పశు వైద్యశాల ఆవరణలోని గా నుగ చెట్టు కొమ్మలు విరిగి పక్కనే ఉన్న విద్యుత్ తీ గలపై పడ్డాయి. దీనితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంగమ్మ గుడికి వెళ్లే విద్యుత్ లైన్ కావడంతో వారం రోజులుగా సరఫరా లేకపోవడంతో ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు నీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులు గడిచినా విద్యుత్ శాఖాధికారులు కూడా స్పందించ లేదు. గ్రామ పంచాయతీ అధికారుల పనితీరు ఈ ఘటనకు నిదర్శనం. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.


## అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి




**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలోని అగ్రి గోల్డ్ సంస్థల ఆస్తులను ప్రభు త్వం స్వాధీనం చేసుకుని ఆ సంస్థ బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ అగ్రి గో ల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యర్రా బాబు మాట్లాడుతూ అగ్రి గోల్డ్ క ంపెనీ 1996లో ప్రారంభించబడిందని కంపెనీలో డిపాజిట్లు చేస్తే ఎక్కువ లాభా లు ఉంటాయని నమ్మించి డిపాజిట్ల సేకరణ పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు రూ.5వేల కోట్లు వసూలు చేశారని ఆ డబ్బుతో స్థలాలు, భూములు కొనుగోలు చేయడంతో పాటు రిసార్ట్స్ నిర్మించారని బాబు తెలిపారు. 2015లో డిపాజిట్ దారులకు డబ్బులు తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు అగ్రి గోల్డ్ యాజమాన్యం చే తులు ఎత్తేసిందని బాధితుల ఆందోళనతో యాజమాన్యాన్ని అరెస్టు చేసి గత ప్రభు త్వం చేతులు దులుపుకున్నదని ఆయన ఆరోపించారు. ప్రజలు కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము అగ్రి గోల్డ్‌లో డిపాజిట్ చేసి తీవ్రంగా నష్టపోయారని తెలంగాణలో అ గ్రి గోల్డ్ సంస్థకు వెయ్యి కో ట్లకు పైగా ఆస్తులు ఉన్నాయనివాటిని స్వాధీ నం చేసుకుని బాధితులకు న్యాయం చే యాలన్నారు.వినతి పత్రం సమర్పించిన వారిలో బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి , రాష్ట్ర ఉపాధ్యక్షురాలురజిత, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడికి విత్తే ప్రధానం







**ప్రజాపక్షం/ఖమ్మం :** వ్యవసాయం కార్పోరే ట్ విత్తన సంస్థల గుప్పెట్లో చిక్కుకుంది. నా ణ్యత, అధిక దిగుబడి, తెగుళ్లను తట్టుకునే రకాలంటూ విత్తన సంస్థలు ప్రచారాన్ని ఊదరగొడుతూ రైతులకు విత్తనాలను అంటగడుతున్నా యి. ఒకప్పుడు రైతులే విత్తనాలను తయారు చేసుకునే వారు. ఏ పంటకు సంబంధించిన వి త్తనమైనా రైతుల వద్దే లభించేది. తాము పండించిన దానిలో మేలు రకం ఎంపిక చేసుకుని విత్తనాల కొరకు నిల్వ చేసుకునే వారు. హైబ్రిడ్ వి త్తనాలు రంగంలోకి వచ్చిన తర్వాత ప్రతి యే టా విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కొన్ని విత్తన కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ ద్వారా పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నాయి. ఫలా నా కంపెనీ విత్తనాలు అత్యధిక దిగుబడినిస్తున్నాయి కానీ అవి మార్కెట్‌లో దొరకడం లేద ంటూ ప్రచారాన్ని మొదలు పెట్టి అధిక ధరలకు రైతులకు అంటగడుతున్నారు. దశాబ్ద కాలంగా పలు విత్తన కంపెనీలకు చెందిన విత్తనాలు దిగుబడిలోనూ, నాణ్యతలోనూ, తెగుళ్లను తట్టుకోవడంలోనూ విఫలమయ్యాయి. ఈ విషయమై రైతులు ఫిర్యాదు చేస్తే వాతావరణ ప్రభావం లే దా ఇతర కారణాలు చెబుతూ రైతులకు పరిహా రం అందించేందుకు కూడా మొండి చేయి చూ పుతున్నాయి. అధికార యంత్రాంగం జిల్లాలో అమ్ముడయ్యే విత్తన కంపెనీల వివరాలను సేకరించడంతో పాటు నకిలీకి తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.విత్తు సంగతి ఇలా ఉంటే ఈ ఏడాది విత్తము (పెట్టుబడి) పరిస్థితి దయనీయంగా ఉంది. గతంలో పంటలు రాగానే బ్యాంకు రుణాలు చెల్లించి వ్యవసాయ సీజన్ ప్రారంభంలో తిరిగి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వారు. రు ణమాఫీ పుణ్యమా అని రైతుల వద్ద నుంచి బ్యాంకుల చెల్లింపులు దాదాపుగా నిలిచిపోయా యి. రుణాలు చెల్లించకపోవడంతో ఒక పక్క బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు చెల్లించాల్సి రావడంతో పాటు ప్రైవేటు వ్యక్తుల ను పెట్టుబడి కోసం ఆశ్రయించాల్సి వస్తుంది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేయాల్సి న పరిస్థితి రైతులకు దాపురించింది. మొత్తంగా ఇప్పటికీ నూటికి 65 శాతం మంది ఆధారపడి న వ్యవసాయ రంగాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. దిగుబడికి తొలిమె ట్టు అయిన విత్తనం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరించాల్సి ఉంది.

# ప్రణాళికాబద్ధంగా భూ సేకరణ ప్రక్రియ

### నిర్వాసితులకు అందించే భూముల లేఅవుట్ అభివృద్ధి చేయాలి

### సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నది భూ సేకరణ, ప్రత్యామ్నాయ భూమి లేఅవుట్ అభివృద్ధిపై జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మొత్తం భూమి, అసైన్డ్ ప్రభుత్వ పట్టా ఎంత ఉంది, ప్రైవేటు పట్టా భూమి ఎంత సేకరించాలో స్పష్టమైన సమాచారంతో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ భూమి ఎంత సేకరించాలో వివరాలు అందిస్తే ప్రత్యామ్నాయ భూముల్లో అటవీ పెంపకం చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో మండలాల వారీగా సేకరించాల్సిన అటవీ భూమి అసైన్డ్ ప్రభుత్వ భూములు, ప్రైవేటు పట్టా భూముల వివరాలతో నివేదిక శుక్రవారం నాటికి అందించాలని కలెక్టర్ తెలిపారు. భూ సేకరణలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలన్నారు. భూముల సేకరణ, సర్వే నిమిత్తం డిజిపిఐ ఆధునిక సర్వే యంత్రాలతో సర్వేయర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి జూన్ 12 నాటికి వివిధ కేటగిరీల వారీగా భూ సేకరణకు సంబంధించి తుది నివేదిక తయారు చేయాలన్నారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి 11 విద్యుత్ స్తంభాలు, నాలుగు టవర్లు, షిఫ్టింగ్‌కు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని దీనికి అవసరమైన చెల్లింపులు విద్యుత్ శాఖకు వారం రోజుల్లో చేపట్టాలని సంబంధిత పనులు రాబోయే వర్షాకాలం లోపు పూర్తి చేయాలన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం రైతులకు, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఅవుట్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మే 25 నాటికి ప్రజలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లి లేఅవుట్ చూపించాలన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఎటువంటి గ్యాప్స్ ఉండటానికి వీలు లేదని మున్నేరు నది రిటైనింగ్ వాల్ 17 కిలో మీటర్ల స్ట్రేచ్‌లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, కల్లూరు ఆర్‌డిఒఎల్. రాజేంద్ర గౌడ్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో ముందు తన పేరు వచ్చిందని తర్వాత తొలగించారని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. నాగులవంచ రెవెన్యూ గ్రామానికి చెందిన జి. రాములు తనకు సర్వే నెం. 279/ఆ/1/1లో 1.10 ఎకరాల భూమి ఉందని నాగులవంచ, చొప్పకట్లపాలెం రోడ్డు నాలుగు అడుగుల ఎత్తులో వేస్తున్నారని దీని వల్ల తన భూమితో పాటు 100 ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని పంట పొలాలు వర్షపు నీరుకు మునిగిపోకుండా తూములు వేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. . ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# రైతుల శ్రేయస్సే లక్ష్యం



ప్రజాపక్షం/కొడకండ్ల: రైతుల శ్రేయస్సే లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకూడదన్న దృక్కోణంతో కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అదికారి, మొండ్రాయి, కోల్కొండ, ఏడునూతుల మిల్లర్స్ యజమానులతో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం కొనుగోలులో ఎలాంటి పొరపాట్లు జరుగకూడదన్నారు. తప్పులు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆమె వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# సరస్వతి పుష్కరాలకు జనగామ నుండి ప్రత్యేక బస్సులు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి పుష్కరాలకు జనగామ డిఫో నుండి ప్రత్యేక బస్సులు ఈ నెల 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు నడపబడుతాయని జనగామ ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎస్ స్వాతి తెలిపారు. జనగామ నుండి కాళేశ్వరం వరకు పెద్దలకు 390 రూపాయలు, పిల్లలకు 220 రూపాయలు ఛార్జీగానిర్ణయించడం జరిగిందన్నారు. ఉప్పల్ నుండి కాళేశ్వరంకు ప్రత్యేక డీలక్స్ బస్సు నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్కడి పెద్దలకు 670 రూపాయలు పిల్లకు 370లకు రూపాయలు చార్జీగా నిర్ణయంచడం జరిగిందన్నారు. సరస్వతి పుష్కరాలకు వెళ్లెవారు ఈ సదుపాయాలు వినియోగించుకోవాలన్నారు. సమాచారం కోసం 7382926139 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

## రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ సత్యశారద



ప్రజాపక్షం/వర్ధన్నపేట : వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట, రామవరం గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ భూ సమస్యలపై వస్తున్న దరఖాస్తులను, రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌ను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. రైతులకు చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ విజయ్ సాగర్,పర్యవేక్షకులురమేష్,రెవిన్యూసిబ్బంది,రైతులుతదితరులు పాల్గొన్నారు.

## సిపిని మర్యాదపూర్వకంగా కలసిన నూతన ఎసిపిలు



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :కాజీపేట, నర్సంపేట డివిజన్ల నూతన ఎ సిపిలుగా బాధ్యతలు చేపట్టిన ప్ర శాంత్‌రెడ్డి రవీందర్ రెడ్డి సోమవా రం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. నీతి, నిజాయితీలతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవాలందిస్తూ, పోలీస్ శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకరావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ నూతన సిపిలకు సూచించారు.

## గుండెంగలో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్‌నాయక్



ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగలో అటవీ భూములపై వచ్చిన పిర్యాదు మేరకు ఆ భూములను జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా భూమి ఉన్న ప్రతి రైతులకు బావులు తవ్వడానికి అనుమతి ఇవ్వాలని, మట్టితల్లిని నమ్ముకుని జీవిస్తున్న రైతులు భూములు వరంగల్‌, మహబూబాబాద్ సరిహద్దుల్లో ఉండడంతో కొంతమంది ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు కాలేదని ఆయన అన్నారు. సంబంధిత అధికారులకు రైతుల పక్షాన ఆలోచించి దరఖాస్తులుతీసుకుని వారికి పట్టాలు మంజూరు చేయాలని హుస్సేన్ నాయక్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహసీల్దారు, ఫారెస్ట్ అధికారులు, స్థానిక నాయకులు, తండ ప్రజలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దగ్గర ఓపెన్ కాస్ట్ గనులను ఒప్పుకోం :ఎమ్మెల్సీ కవిత



ప్రజాపక్షం/వెంకటాపూర్ : ప్రపంచ చారిత్రక వారసత్వ సంపద అయిన రామప్ప దేవాలయం సమీపంలో ఓపెన్ కాస్ట్ గనులను ఏర్పాటు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం రామప్పలో రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2012లోనే రామప్ప ఆలయానికి 5 కి.మీ.ల దూరంలో ఓపెన్ కాస్ట్ మైన్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే అప్పుడు ఉద్యమ నాయకుడుగా కెసిఆర్ ఆ ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఆ ప్రయత్నాలను ముందుకు సాగనివ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ ఓపెన్ కాస్ట్ మైన్ పేరుతో బొగ్గు తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఆలయానికి 5 కి.మీ.ల దూరంలో బ్లాస్టింగులు జరిపితే ఆలయం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో ఈ ఒక్క ప్రయత్నంతో తేలిపోతుందన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలోనే రామప్ప ఆలయానికి గుర్తింపు తెచ్చుకున్నామని గుర్తు చేశారు. అప్పుడు చిన్నపాటి పనులు పెండింగ్‌లో ఉంటే ఏడాదిన్నరగా పట్టించుకోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మంత్రి సీతక్క ఇప్పుడు అందాల పోటీల కోసం పై పై మెరుగులు దిద్దుతున్నారని అన్నారు.ములుగు నియోజకవర్గంలో రైతులు, ప్రజలు చనిపోతున్నా మంత్రి సీతక్క పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

**నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురంలో ఎరుకల నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. రామానుజపురంలో నాంచారమ్మ జాతరకు హాజరై నాంచారమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం ఎరుకల కులస్తులతో కలిసి కవిత సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, 800 ఏళ్ల క్రితమే ఇక్కడ నాంచారమ్మ ఆలయం ఉన్నట్టుగా గురుతులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు, నాయకులు కేతిని రాజశేఖర్, లోకిని సమ్మయ్య, మానపాటి రమేష్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ

జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. సోమవారం చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట, కిష్టాజీ గూడెం, చిల్పూర్ అలాగే పాలకుర్తి మండలంలోని గూడూరులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలులో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని, వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం తరలించాలని, గన్ని బ్యాగ్‌లలో, రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్‌లు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

# 15న అట్టహాసంగా సరస్వతి పుష్కరాలు

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి / కాళేశ్వరం: త్రివేణి సంగమం అయిన కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా పుష్కరాలు నిర్వహించుటకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాల ఏర్పాట్ల పనులను జిల్లా కలెక్టర్ ఎస్‌పి కిరణ్ ఖరేతో కలిసి పుష్కర పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాలలో ఏకైక త్రివేణి సంగమం, దేశంలో రెండో ప్రాంతం అయిన కాళేశ్వర క్షేత్రం అద్భుతమైన ఘట్టానికి వేదిక కాబోతోంది. సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహించే త్రివేణి సంగమం అయిన కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా పుష్కరాలు నిర్వహించుటకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ నెల 15న అట్టహాసంగా ప్రారంభం కానున్న సరస్వతి నది పుష్కరాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నట్లు తెలిపారు. ప్రతిరోజు కాశీ పీఠాధిపతిపతులచే నది హారతి కార్యక్రమాలు జరుగుతాయని జి ల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం అన్నారు. ప్రతి రోజు ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ 15వ తేదీన రాష్ట్రముఖ్యమంత్రి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరించడంతో పాటు గోదావరి హారతి, త్రిలింగ క్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని తెలిపారు. ప్రపంచంలో యముడు, శివుడు లింగాకరంలో వెలిసిన ఏకైక క్షేత్రం త్రివేణి సంగమమైన కాళేశ్వరంలో సాక్షాత్కరిస్తుండడం ఈ ఆలయానికి ఉన్న మరో ప్రత్యేకతని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఈ సరస్వతి పుష్కరాలకు అత్యంత అరుదైన చరిత ఉందని తెలిపారు. కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కర వేడుకులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో సకల సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పుష్కరాలు నిర్వహించనున్న 12 రోజుల పాటు భక్తులకు సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అంతా అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు చేశామన్నారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## తెలంగాణ సాయుధ పోరాటంలో పశ్య కన్నమ్మ స్ఫూర్తిదాయకం

సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరావు



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: తెలంగాణ సాయుధ పోరాటంలో పశ్య కన్నమ్మ స్ఫూర్తిదాయకంగా నిలిచారని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరావు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి కొనియాడారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాతృమూర్తి పశ్య కన్నమ్మ చిత్రపటానికి వారు పుష్పాంజలి ఘటించి సంతాపం వెలిబుచ్చారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పశ్య కన్నమ్మ సంతాపసభ సందర్భంగా వారు నివాళులర్పించి మాట్లాడుతూ ఆమె పోరాట పటిమ, ఆమె వారసురాలిగా పశ్యపద్మ అందిపుచ్చుకుని అంచలంచలుగా ఎదిగి జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా పనిచేయడం వారి కుటుంబానికి పార్టీ పట్ల ఉన్న నిబద్ధతే నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరావు, ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు, మహిళా సంగరాష్ట్రనాయకురాలు మండ సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది

మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



ప్రజాపక్షం/మహబూబాబాద్: కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాదని, పార్టీ బలంగా ఉంటేనే కార్యకర్తలు బలంగా ఉంటారని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఫంక్షన్ హాల్‌లో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అధ్యక్షన మహబూబాబాద్ నియోజకవర్గ పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా పోట్ల నాగేశ్వరావు, రవళిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కార్యకర్తల కష్టంతోనే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. నాయకులు ఎవరైనా, కార్యకర్తలు ఎవరైనా పార్టీనిఇబ్బంది పెట్టేవిధంగా వ్యవహరించకూడదని ఎమ్మెల్యే హెచ్చరించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో కమిటీ ఏర్పాటులోపై స్థాయి నుండి కింది స్థాయి రావడం సరైంది కాదని, గ్రామ స్థాయి నుండి పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అప్పుడే సరైన నాయకత్వానికి అవకాశం లభిస్తుందని అన్నారు. సిఫార్సుల ద్వారా నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమక్షంలో సమావేశాలు నిర్వహించి అర్హతను బట్టి పదవులు కేటాయించాలని తెలిపారు. కమిటీల ఏర్పాటుకు ఒక నియమావళిని రూపొందించి దానికి అనుగుణంగా కమిటిలు ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ రాజీలేని పోరాటం

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



ప్రజాపక్షం/హసన్ పర్తి : జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, హసన్ పర్తి మండల కేంద్రంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే సిపిఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం హసన్ పర్తి మండలకేంద్రంలో నిర్వహించినవిలేకరుల సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా 2వ మహాసభల వాల్ పోస్టర్లను సిపిఐనాయకులతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైన జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలంఅయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలంఅయిందని, దేశాన్ని కార్పొరేట్ లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోడీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ,ఈడి లను ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు రెండులక్షలరైతు రుణమాఫీ పూర్తిగా ఇవ్వాలని, ఇందిరమ్మఇండ్ల పంపిణీ పారదర్శకంగా అర్హులైనపేదలకు అందించాలని,జిల్లాలో అసంపూర్తిగా ఉన్నా దేవాదుల ప్రాజెక్టును పూర్తిగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన చేసిన తర్వాత ఏర్పడ్డ హనుమకొండ జిల్లా పట్టణ ప్రాంత జిల్లాగా విలసిల్లుతొందని, గ్రామీణ ప్రాంతం ఉన్నప్పటికీ పట్టణ జనాభానే అధికంగా ఉందని,హైద్రాబాద్ తర్వాత పెద్దనగరంగాఉందని, పారిశ్రామికంగాపాలకులుఅనేక వాగ్దానాలు చేసినా అమలుకు నోచుకోలేదని అవేదనవ్యక్తం చేశారు.జిల్లాలో నిరుద్యోగం బాగా పెరుగుతున్నదని,అటు వ్యవసాయకంగా,ఇటూ పారిశ్రామికంగాజిల్లాప్రజల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని పాలకులు పరిపాలన చేయట్లేదని అన్నారు. ఈ నెల 26, 27 తేదీలలో హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా 2వ మహాసభలు జరగబోతున్నాయని, జిల్లాలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని, ఈ మహాసభల్లో మొదటి రోజు మే 26న ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు లు హాజరు కానున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఐ సీనియర్ నాయకులు మోతె. లింగారెడ్డి, నేదునూరి. రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్, స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మ ణ్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, కొట్టేపాక.రవి, మాలోత్. శంకర్, కొట్టే వెంకటేష్, దామెర, సుదర్శన్, మండల కార్యదర్శి మెట్టు.శ్యామ్ సుందర్ రెడ్డి, నాయకులు వస్కుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నేను మాటలు చెప్పను.. పనులు చేసి చూపిస్తా : శ్రీహరి



ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్/జనగామ ప్రతినిధి: కొందరు నయా పైసా పని చేయరు. నిధులు తేవడం వారికి చేతకాదు. నేను మాత్రం మాటలు చెప్పను పనులు చేసి చూపిస్తా అని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ము ఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. సోమవారం నియోజకవర్గ కేం ద్రంలో జరుగుతున్న బంజారా భవన్, వంద పడకల హాస్పత్రి పనుల ను ఆయన పరిశీలించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ కొంత మంది ప్రజల్ని కావాల ని తప్పుదోవ పట్టించే పనులు చేస్తున్నారని, నియోజకవర్గంలో జరిగే పనులను చూసి అయినా జ్ఞానం తెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని అసత్య ప్రచారాలు చేసినా పనులు ఆగవని, 800 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలు తల ఎత్తుకునేలా చేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాలకు 77 కోట్లతో పక్కా రోడ్లు చేపట్టినట్లు తెలిపారు. దాదాపు 20 తండాలకు 38 కిలో మీటర్ల మేర నిర్మాణాలు జరిగాయని, నియోజకవర్గ కేంద్రంలో బం జారా భవనం ఉండాలనే ఉద్దేశ్యంతో 2 కోట్ల రూపాయలతో బంజారా భవనం నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. నూతన పంచాయితీలు అయినా 8 తండాలల్లో కోటీ 60లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో 63లక్షల రూపాయలతో ఎస్‌టి హాస్టల్ భవనం పనులు జరుగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. బంజారా భవన్ వద్ద లేవలింగ్, డైనింగ్‌హాల్ నిర్మాణ ప్రతిపాధనలు సిద్ధం చేయానలి అధికారును కడియం శ్రీహరి ఆదేశించారు. అతి త్వరలోనే స్టేషన్‌ఘనపూర్ రూపురేఖలు మారబోతున్నాయని, మున్సిపాల్టీ అభివృద్ధికి 70 కోట్లతో ప్రతిపాధనలు సిద్దం చేసినట్లు తెలిపారు. వాటికీ వీలైనంత త్వరగా మంజూరు తీసుకోస్తామని, 26కోట్ల రూపాయలతో డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్ నిర్మాణం జరుగుతుందన్నారు. వంద పడకల హాస్పటల్, డిగ్రీ కళాశాల, యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ వంటి పనులు జరుతుతున్నాయన్నారు. ప్రజల్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని, రాజకీయ విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఎవరెన్నీ అసత్య ఆరోపనలు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదని, నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ వెంకన్నతో పాటు వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మెనోటీసు



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ యూనియన్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఐసిడిఎస్ పిడి, సిడిపిఓ, మెడికల్ ఆఫీసర్‌కు సోమవారం సమ్మెనోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్లారీశ్వరి, ఆశా వర్కర్స్ యూనియన్ కన్వీనర్ పుచ్చుకల రజనీ మాట్లాడుతూ మే 20న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలోకార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్మికులు సాధించుకున్న 44కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్‌గా సవరించాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చారు. అంగన్వాడీ, అశావర్కర్లు, మధ్యాహ్న భోజనకార్మికులంతా కేంద్ర ప్రభుత్వ స్కీం వర్కర్స్ లక్షలాదిమంది శ్రమదోపిడికి గురవుతూ అతి తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ప్రయత్నిస్తుంటే బిజెపి ప్రభుత్వం కనీస ఆలోచన చేయకుండా కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని, కార్మికుల ప్రయోజనాలను చట్టాలను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులందరూ ఈనెల 20న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో కీసర సౌమ్యశ్రీ, రమ, మైమూద్, ఉపేంద్ర, పద్మ, ఉమ, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నేడే' పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష

ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ వెల్లడి




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో 3 సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్‌ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా, వ్యవసాయ డిప్లొమా,వెటర్నరీ డిప్లొమా ప్రవేశం కోసం జరిగే పాలీసెట్2025ను మే 13వ తేదీ (మంగళవారం) రోజున ఉ. 11.00 గం. నుండి మ. 1.30 గం. వరకు నిర్వహించనున్నట్లు,ఇందు కోసం సకల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,06,000 మంది అభ్యర్థులు హాజరవుతున్న ఈ పరీక్షకు వరంగల్ నగరంలోని 12 కేంద్రాలనుండి 6424 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి ఒక గంట ముందుగానే, ఉదయం 10.00 గంటలకే, అనుమతిస్తారు. కావున విద్యార్థులు ఉదయం 10.00 గంటలకే పరీక్ష హాలులోకి చేరుకొని ఒఎమ్‌ఆర్ షీట్లోని రెండు వైపుల లోని వివరాలు పూర్తి చేసి సంతకం చేయవలసి ఉంటుందన్నారు.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట బ్లాక్ పెన్సిల్, ఎరేసర్,బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావలన్నారు.పరీక్ష ప్రారంభమైన ఉదయం 11.00 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడరని తెలిపారు.హాల్ టికెట్ మీద ఫోటో లేకపోతే ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో,ఐడి ప్రూఫ్ (ఆధార్ కార్డు) తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్ష కేంద్రంలో సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని,ఇంజనీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితం 60 మార్కులు, భౌతిక శాస్త్రం 30 మార్కులు, రసాయన శాస్త్రం 30 మార్కులు కోసం పరీక్ష రాయవలసి ఉంటుందని, వ్యవసాయ,వెటర్నరీ డిప్లొమా చేయాలనుకునే వారు అదనంగా జీవశాస్త్రం 30 మార్కులు పరీక్ష రాయవలసి ఉంటుందన్నారు.

## ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి



ప్రజాపక్షం/శాయంపేట : దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని, శాయంపేట మండలంలో గుడిసె వాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. సోమవారం శాయంపేట మండలంలోని మాందారిపేట, గట్ల కానిపర్తి, సూరారం గ్రామాల భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ మహాసభలు బండారి సాంబయ్య అధ్యక్షతన జరగగా ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బిజెపి పార్టీ నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోదీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఇడిలను ప్రయోగిస్తున్న మోదీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తిగా ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా అర్హులైన పేదలకు అందించాలని, జిల్లాలో అసంపూర్తిగా ఉన్నా దేవాదుల ప్రాజెక్టును పూర్తిగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని వారు అన్నారు. ఈ నెల 26, 27 తేదీలలో హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా 2వ మహాసభలు జరగబోతున్నాయని, జిల్లాలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలపై చర్చించెందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని, ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు వల్లాల రమేష్, ఎండి అంకుషావలి, సముద్రాల మణెమ్మ, బొంకురి కోమల, సుగుణ మరియు తదితరులు పాల్గొన్నారు. తదనంతరం మాందారిపేట శాఖ కార్యదర్శిగా బండారి సాంబయ్యను, గట్ల కానిపర్తి శాఖ కార్యదర్శిగా సముద్రాల మణెమ్మను, సూరారం శాఖ కార్యదర్శిగా బొంకురి కోమలను ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో మూడు గ్రామ శాఖలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఫోకస్

# యువతరంగం




## ఆత్మవిశ్వాసమే బలమైన ఆయుధం

ఎవరికైనా ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు. ధైర్యంతో ప్రయత్నిస్తే సాధించలేని లక్ష్యాలు లేవు. యువత శక్తికి మారుపేరు. మార్పు, ఆశ, ఆశయాల చిహ్నం. కానీ, సమాజానికి ఉపయోగపడే యువత ఎలా ఉండాలి అన్నదానిపై చాలా మందిలో స్పష్టత లోపిస్తున్నది. యువత ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నది ప్రాథమిక సూత్రం. యువత తమ సామర్థ్యాన్ని నమ్మాలి. ఓడిపోతే నెగ్గే శక్తి తమలో ఉందని తెలుసుకోవాలి. తమ లక్ష్యాలను స్పష్టంగా పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో జీవించాలి. యువతీయువకుల్లో ఈ లక్షణం మరింత దృఢంగా ఉండాలి. నిరంతర సాధన, సమయపాలన, నియమ నిష్టలు అవసరం. క్రమశిక్షణతో ఉన్న యువత ఎలాంటి రంగంలోనైనా గొప్ప విజయాలను సాధించగలరు. దేశభక్తి కలిగిన వారై ఉండాలన్నది సామాజిక అవసరం. తమకు లభించిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే తపన యువతలో ఉండాలి. దేశం కోసం ఏదైనా చేయాలన్న చిత్తశుద్ధి ఉండాలి. 'ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్' అని గురజాడ ప్రశ్నించిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఎముకులు క్రుళ్ళిన, వయస్సు మళ్ళిన సోమరులను చావమన్నాడు మహాకవి శ్రీశ్రీ. నెత్తురు మండే, శక్తులు నిండే వారికై పరితపించాడు. శారీరక, మానసిక శక్తికి ప్రతిరూపం యువత. అందుకే, యువతీయువకులు ఆరోగ్యంగా ఉండాలి. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం వల్లే వారి శక్తి, సామర్థ్యం వినియోగంలోకి వస్తుంది. వ్యాయామం, సమతుల్యాహారం, నిద్ర వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అవసరం. మానవత్వం యువత నైజం కావాలి. ఇతరుల బాధలు అర్థం చేసుకోగలగాలి. సహానుభూతి, సేవాభావం కలిగి ఉండాలి. మనుషుల మధ్య గోడలు కట్టే కాక, వారిని దగ్గర చేస్తూ జీవించాలి. సాంకేతికతను ఉపయోగించగల సామర్థ్యం యువతకు అత్యవసరం. నేటిడిజిటల్ ప్రపంచంలో యువత టెక్నాలజీని చెడ్డకు కాదు, మంచికి ఉపయోగించాలి. జ్ఞానం పెంచుకోవడానికీ, సమస్యలు పరిష్కరించడానికీ టెక్నాలజీ సహాయం కావాలి. సాధ్యమైనంత వరకూ పొరపాట్లు చేయకూడదు. తప్పులు చేయకుండా ఉండడం ఎవరికైనా అసాధ్యం. తెలిసో, తెలియకో పొరపాట్లు జరుగుతుంటాయి. అయితే, వాటి నుంచి నేర్చుకోవాలి. ప్రతి తప్పు ఒక పాఠం. భయపడకుండా ఎదురు చూడాలి. తిరిగి లేచే ధైర్యం కలిగి ఉండాలి. యువత ఎప్పుడూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలి. తమ ప్రవర్తన, మాటలు, ఆచరణలతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. చుట్టూ ఉన్నవారిని ప్రోత్సహించగలగాలి. యువత అనేది ఓ శక్తివంతమైన దశ. ఇది భవిష్యత్తుని నిర్మించే సమయం. యువత నిజాయితీగా, శ్రమతో, విలువలతో కూడిన జీవితాన్ని గడిపితే అది ఒక వ్యక్తి జీవితమే కాదు, దేశం ముందుకు సాగే మార్గమవుతుంది

## వృద్ధాప్యంలో జీవన సరళి 'మారాలి..



వృద్ధాప్యం అనేది జీవన యాత్రలో ఒక దశ. ఇది సాధారణంగా 60 లేదా 65 ఏళ్ల వయస్సు నుంచి ప్రారంభమవుతుంది. ఈ దశలో శరీర శక్తులు తగ్గుతూ, జీవన శైలి, అవసరాలు మారుతూ ఉంటాయి. శారీరక శక్తితోపాటు జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది. పలు ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. మానసిక ఒత్తిళ్లు తలెత్తుతాయి. నడక, వినికిడి, చూపు లోపాలు తప్పవు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణవృద్ధుల ఆరోగ్యం అనేది ముఖ్యమైన అంశం.

రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. వయసు పెరుగుతున్న కొద్దీ జీవన సరళి మారాలి. వృద్ధాప్యం వచ్చిందనే విషయాన్ని జీర్ణించుకోక తప్పదు. వయస్సు దాటి, సేకరించిన అనుభవాలను ముందు తరాలవారికి అందించడం లక్ష్యం కావాలి. జీవితం అనేక మలుపులు తీసుకొని, అనుభవాల సముద్రంగా మారుతుంది. అందుకే సమాజానికి వృద్ధులు శిరోమణులు. అయితే వయస్సు పెరిగేకొద్దీ శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వారి జీవన సరళిలో మార్పులు చోటు చేసుకుంటాయి. ముందుగా వృద్ధాప్యం అనేది ఏమిటి? ప్రశ్న తలెత్తుతుంది. వృద్ధాప్యం అనేది జీవన యాత్రలో ఒక దశ. ఇది సాధారణంగా 60 లేదా 65 ఏళ్ల వయస్సు నుంచి ప్రారంభమవుతుంది. ఈ దశలో శరీర శక్తులు తగ్గుతూ, జీవన శైలి, అవసరాలు మారుతూ ఉంటాయి. శారీరక శక్తితోపాటు జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది. పలు ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. మానసిక ఒత్తిళ్లు తలెత్తుతాయి. నడక, వినికిడి, చూపు లోపాలు తప్పవు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణవృద్ధుల ఆరోగ్యం అనేది ముఖ్యమైన అంశం. డయాబెటిస్, హై బీపీ, ఆర్థ్రైటిస్, హృద్రోగాలు అల్జైమర్స్, డిమెన్షియా తదితర ఆరోగ్య సమస్యలు సర్వసాధారణం. ఆరోగ్యవంతమైన ఆహారం, మితమైన వ్యాయామం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ధ్యానం, యోగా, వైద్యులు సూచించిన మందులు సేవించడం వంటి చర్యలు అవసరం. ఆహారపరమైన జీవన శైలివృద్ధులు తీసుకునే ఆహారం ఎంతో ముఖ్యమైనది. సరైన ఆహారం శరీర శక్తిని నిలిపి ఉంచుతుంది. శ్రేష్ఠమైన ఆహారాలు: పచ్చి కూరగాయలు, పండ్లు తక్కువ ఉప్పు, చక్కెర శరీరానికి తేలికైన ఆహార పదార్థాలు తీసుకోవాలి. తీపి పదార్థాలు పరిమితంగా తినాలి. సాధారణంగా వృద్ధులు ఒంటరితనం, నిరాశ, నిరుద్యోగం వంటి భావాలతో బాధపడతారు. మానసిక ఆరోగ్య మెరుగుదల కోసం, కుటుంబ సభ్యుల మద్దతు స్నేహితుల సాంగత్యం చర్చా వేదికలు, కళా కార్యక్రమాలు ధ్యానం, ప్రార్థన వంటి మార్గాలు ఉన్నాయి. వృద్ధులు ఉద్యోగ విరమణ తర్వాత ఆదాయ వనరులు కోల్పోతారు. ఇది వారి స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేస్తుంది. పెన్షన్ పథకాలు, సేవింగ్ స్కీములు, ఇన్సూరెన్స్, కుటుంబ సహకారంతో ఆర్థిక సమస్యలను అధిగమించవచ్చు. వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరం. వారిని సమాజంలో అంగీకరించడం, గౌరవించడం సమాజ బాధ్యత. వృద్ధాశ్రమాలు (పాజిటివ్ వైపు) వృద్ధ సంఘాలు గౌరవోత్సవాలు వారిని సేవలలో భాగస్వాములుగా చేయడం అవసరం. ఈ డిజిటల్ యుగంలో వృద్ధులు కూడా టెక్నాలజీ నేర్చుకొని, తమ జీవన ప్రమాణాన్ని మెరుగుపర్చుకోవచ్చు. హెల్త్ మానిటరింగ్ యాప్‌లు, వీడియో కాల్స్ ద్వారా కుటుంబ సభ్యులతో సంభాషణ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ ఎడ్యుకేషన్ తదితర విధానాలు వృద్ధులకు మానసిక ఆరోగ్య సంతులనానికి ఉపయోగపడతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటాయి. జాతీయ వృద్ధుల పాలసీ వృద్ధాప్య పెన్షన్ పథకం, ఆరోగ్య బీమా పథకాలు ఉన్నాయి. కుటుంబ వ్యవస్థలో వృద్ధుల స్థానంపురాతన భారతీయ సంస్కృతిలో వృద్ధులకు విశేష స్థానం ఉంది. వారు కుటుంబానికి మార్గదర్శకులు. న్యూక్లియస్ కుటుంబాల పెరుగుదల కారణంగా వృద్ధులను విస్మరించడం సాధారణమైంది వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వృద్ధులు ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోడం వాటిలో ప్రధానమైనది. ప్రతిరోజూ తప్పనిసరిగా ఎంతోకొంత వ్యాయామం చేయాలి. మానసికంగా ఉత్సాహంగా ఉండే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులతో సమయం గడపాలి. హాబీలు అభివృద్ధి చేసుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలి. సాధ్యమైనంతవరకు స్వతంత్రంగా జీవించాలి. వృద్ధాప్యం అనేది జీవితంలో ఒక దశ మాత్రమే కాదు, అనుభవాలతో నిండిన ఓ పర్వం కూడా. ఈ దశలో కూడా జీవితం అందంగా, ఉత్సాహంగా ఉండాలి. కుటుంబం, సమాజం, ప్రభుత్వం... ఇలా ప్రతి ఒక్కరు వృద్ధులకు గౌరవంగా, ఆదరణగా ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుంది. మనం నేడు గౌరవించాలంటే, రేపు మనం కూడా గౌరవించబడతాం.



### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## పర్యావరణ కార్యకర్త దిశ

భారత దేశానికి చెందిన ప్రముఖ పర్యావరణ కార్యకర్త దిశా రవి. బెంగళూరులో, 1998లో జన్మిం దిశ మౌంట్ కార్మెల్ కాలేజీ, బెంగళూరులో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఎ) పట్టభద్రులుగా చదువుకుంది. దిశ 19 ఏళ్ల వయస్సులో పర్యావరణ కార్యకలాపాల్లో పాల్గొనడం ప్రారంభించింది. ఆమె 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా' (భారత భవిష్యత్తు కోసం శుక్రవారాలు) అనే గ్లోబల్ క్లైమేట్ స్ట్రైక్ ఉద్యమం భారత విభాగాన్ని స్థాపించింది. ఆమె పర్యావరణ న్యాయం కోసం పోరాడుతూ, పర్యావరణంపై ప్రభావితమయ్యే సముదాయాల కోసం వాదిస్తున్నది. ఢిల్లీ పోలీసులు 2021 ఫిబ్రవరి 13న, దిశను అరెస్టు చేశారు. 'టూల్‌కిట్' అనే డాక్యుమెంట్‌ను సృష్టించిందని ఆమెపై ఆరోపణలు మోపింది. వాటిని పంచడం ద్వారా రైతుల నిరసనలకు మద్దతు ఇవ్వడమేగాక, వారు హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడేలా రెచ్చగొట్టిందని ఢిల్లీ పోలీసులు దిశపై ఆరోపణలు చేశారు. అంతేగాక చార్జిషీట్‌లో ఆమెపై దేశద్రోహం, కుట్ర వంటి నేరాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ అరెస్టు అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలకు గురైంది. అరెస్టు తర్వాత కూడా, దిశా రవి పర్యావరణ న్యాయం కోసం తన కార్యకలాపాలను కొనసాగిస్తునే ఉంది. ఆమె 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా'లో 'మోస్ట్ ఎఫెక్టెడ్ పీపుల్ అండ్ ఏరియాస్' (ఎక్కువగా ప్రభావితమైన ప్రజలు.. (ప్రాంతాలు) విభాగాన్ని నెలకొల్పింది. పర్యావరణ న్యాయం కోసం గ్లోబల్ స్థాయిలో ఆమె కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. దిశ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా పర్యావరణ న్యాయం కోసం తన అభిప్రాయాలను పంచుకుంటున్నది. ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ భయపడకుండా ముందుకు వెళ్లడం, అనుకున్నది సాధించే దిశగా దూసుకెళ్లడం దిశ వంటి అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యం. అందుకే, ఆమె జీవితం యువతకు స్ఫూర్తిదాయకం.




---

# ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు

**పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి**

**త్యాగాలు, ఉద్యమాలు సిపిఐ సొంతం : ఎమ్మెల్సీ సత్యం**







**ప్రజాపక్షం/చండూరు :** ప్రజల పక్షాన నిలబడి దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం సిపిఐ చండూరు మండల 15వ మహాసభలు మండల పరిధిలోని దోనిపాముల గ్రామంలో జరిగాయి. ఈ మహాసభలకు పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. దోనిపాముల గ్రామశాఖ ఆద్వర్యంలో గ్రామంలోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన పార్టీ అరుణ పతాకాన్ని పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. మందడి నర్సింహ్మారెడ్డి మహాసభ ప్రాంగణంలో అరుణ పతాకాన్ని ఎగురవేసి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కశ్మీర్ పహల్గాం లో పర్యటకులపై ఉగ్రవాదులు దాడిచేసి చంపేయడం దారుణమన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించేందకు కేంద్రప్రభుత్వానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ కులా లు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పోరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తు ప్రజాసమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భూసంస్కరణలు, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఉద్యమాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అన్నారు. నల్లగొండ జిల్లాలో శాశ్వత కరువు నివారణ కోసం ఎస్‌ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకం పాజెక్టు పూర్తిచేసి చర్లగూడెం రిజర్వాయర్‌తో మునుగోడు, దేవరకొండ నియోజవర్గాలకు సాగుఅందించాలనే లక్ష్యంతో సిపిఐ ఉద్యమాలు నిర్వహించిందన్నారు. చండూరు మండలంలో సిపిఐకి పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు చేసిన పార్టీగా గుర్తింపు ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్దంగా ఉండాలన్నారు. మండల పార్టీ సహాయకార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మి , బరిగెల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు, దోటి వెంకన్న, బండమీది వెంకటేశం, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇరిగి సంజీవ , బోయపల్లి బిక్షమయ్య, జంగయ్య, పాలకూరి సత్తయ్య, పల్లె నర్సింహ్మా, శివర్ల లింగ స్వామి, జోగు రమేష్, గడ్డం నవీన్, ఎండి కరీం, దశరథ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి

**సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి**

**ప్రజాపక్షం/రామడుగు :** గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతికార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం రామడుగు మండల మహాసభ గోపాలరావుపేట గ్రామంలో మచ్చరమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతుందని, సమసమాజ స్థాపనే లక్ష్యంగా, దోపిడీ లేని సమాజం కోసం అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి, కార్పోరేట్ బహుళజాతి సంస్థలకు సంపన్నవర్గాలకు అనుకూల నిర్ణయాలు చేస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఆలస్యం చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, నిరుద్యోగభృతి, ఉద్యోగాల కల్పన, పెన్షన్స్ పెంపు, రైతుల రుణ మాఫీ తదితర హామీలను నెరవేర్చాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, ఉమ్మెంతుల రవీందర్‌రెడ్డి, నాయకులు ఎగుర్ల మల్లేశం, శంకరయ్య, లక్ష్మి , నర్సయ్య, ఐలయ్య, రాజేష్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.




---

# ఉక్కు పరిశ్రమ స్థాపించేవరకూ కేంద్రంపై పోరాటం ఆగదు



సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి :** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిందేనని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేవరకూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటం ఆగదని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. ఉక్కు పరిశ్రమ ఉద్యమం కేసులో భాగంగా సోమవారం కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ళు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 2014 విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ నేటికీ ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. పదేళ్ళు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫమమైందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల మానుకోట జిల్లాలో ఎక్కువ మంది గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేయడానికి కృషి చేయాలని, తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంతన్‌రామరాజు, తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతు, మిరియాల మల్లికార్జున్‌లు కోర్టుకు హాజరయ్యారు.

# 44 కార్మిక చట్టాల అమలుకు సార్వత్రిక సమ్మె

**సమ్మె సన్నాహక సమావేశాల్లో ఎఐటియుసి నాయకులు**




నిజామాబాద్ అర్బన్

**ప్రజాపక్షం/తాండూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా కార్మిక లోకం సమరశంఖం పూరించిందని, తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మికులు ఏకం కానున్నారని, ఈ పోరాటంలో భాగంగా ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాల అమలుకు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, హమాలీ సంఘం నాయకులు శ్రీనివాస్, మహేందర్, చందు, లక్ష్మణ్, వెంకటేష్, గణేష్, అంకేష్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** మధ్యాహ్న భోజన కార్మికులకు స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోవునూరు చక్రపాణి అన్నారు. సోమవారం ఎఐటియుసి కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా కౌన్సిల్ సమావేశంను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించి 20న జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు స్రవంతి, ఎఐటియుసి నాయకులు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి లో కొత్త గనులు రావడం కోసం, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్‌లపై ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఐఎన్టీయుసి నాయకులు గడ్డం క్రిష్ణ, సిఐటియు నాయకులు నాగరాజు గోపాల్, టిబిజికేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, ఐఎఫ్టీయు నాయకులు కే.విశ్వనాథ్ లు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె ఓసిపి 5లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, మాదన మహేష్, రంగు శ్రీను, గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, గుర్రం ప్రభుదాస్,ఉదయ భాను, చంద తిరుపతి, గంద్ర దామోదర్ రావు, కే.శంకర్, మెండె శ్రీనివాస్, రాజ మౌళి, గౌస్, వడ్డెపెల్లి శంకర్, నూనె కొంరయ్య, పర్లపెల్లి రవి పాల్గొన్నారు.

**జగిత్యాల :** ఈ నెల 20న దేశవ్యాప్తసార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐయుటిసీ రాష్ట్ర నాయకులు సమ్మయ్య కోరారు. సోమవారం జగిత్యాలలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి.ముక్రమ్, సాయిశ్వరి, వెన్న మహేష్, ఎం.కిరణ్, సుమలత, వనిత, మమత, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




జగిత్యాల...




పెద్దపల్లి..




మంచిర్యాల జిల్లా తాండూర్



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ప్రజావాణికి 171 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీసీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఆర్డీఓ స్రవంతి, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం

మైనంపల్లి హనుమంతరావు

ప్రజాపక్షం/పాపన్నపేట: అన్ని రంగాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామతీర్థంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప స్వామి కామరతి దేవి కళ్యాణ్ ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కురుమ సంఘం నాయకులు ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదలు అందజేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోవిందు నాయక్, నాయకులు ఈశ్వరప్ప, శంకరప్ప, సాహెద్ పాషా, మాజీ కోఆప్షన్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 73 వినతులు




ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: నేటి ప్రజావాణికి 73 వినతులు వచ్చాయని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ మాధురి చంద్రశేఖర్, డిఆర్ఓ పద్మజారాణి ఇతర అధికారులతో కలిసి ప్రజావాణిలో కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వాణిలో మొత్తం 73 దరకాస్తులు వచ్చాయని అట్టి వినతులను సంబందిత శాఖ అధికారులు సాద్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఏలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. తమ వినతులకు తప్పకుండ పరిష్కారం లభిస్తుందనే నమ్మకాని ్న అధికారులు ప్రజలకు కలిగించేలా ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయిలో త్వరగా విచారణ చేసి వివిధ సమస్యల పైన వచ్చిన వినతులకు పరిష్కారం చూపాలన్నారు.బయోమెట్రిక్ హాజరు అనుసరించకపోతే శాఖపరమైన చర్యలు తప్పవు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, చంద్రశేఖర్, మాదురి రెవెన్యూ అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## మచ్చేందర్ కుటుంబానికి రూ. 34 లక్షల చెక్కు అందజేత



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: పోలీసు సాలరీ ప్యాకేజ్ లో భాగంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోమ్ గార్డ్ మచ్చేందర్ కుటుంబానికి యాక్సిస్ బ్యాంక్ నుండి యాక్సిడెంటల్ డెత్ క్రింద రూ. 34 లక్షల చెక్‌లను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ చేతుల మీదుగా అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సాలరీ ప్యాకేజ్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి పోలీసు సాలర్ ప్యాకెజ్ కి మారవలసిందిగా సూచించారు. తేది 31.12.2024 నాడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన హోమ్ గార్డు మచ్చేందర్ కుటుంబానికి యాక్సిస్ బ్యాంక్ నుండి యాక్సిడెంటల్ డెత్ క్రింద 30 లక్షలను ఇద్దరు పిల్లల ఎడ్యుకేషన్ కొరకు తలా రూ. 2లక్షల చొప్పున మొత్తం రూ. 34 లక్షలు మంజూరు కావడం జరిగిందని అట్టి చెక్‌లను సోమవారం తేది 12.05.2025 నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో మచ్చేందర్ భార్య బాగ్యలక్ష్మి కి అందజేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలియజేశారు. అదే విధంగా పోలీసు శాఖ నుండి రావలసిన అన్ని రకాల బెనిపిట్స్ త్వరగా అందే విధంగా చూస్తామని పోలీసు శాఖ వారికి వారి కుటుంబానికి ఎల్లవేళలా సహాయ సహకారాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి , ఇ కళ్యాణి ,ఆర్ ఐ డానియల్ ,రాజశేఖర్ రెడ్డి, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ సిబ్బంది ,మచ్చేందర్ కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం..



ప్రజాపక్షం/ఖానాపూర్: ప్రమాదవశాత్తు స్క్రాప్ షాప్‌లో అగ్ని ప్రమాదం ఖానాపూర్ పట్టణంలో సోమవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కాలేజీ పక్కన గల గుగ్గిళ్ళ శంకర్ స్క్రాప్ షాప్ ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది.వెంటనే ఫైరింజిన వచ్చి వాటర్ తో మంటలు పూర్తిగా అదుపు చేయడం వలన ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఫైర్ సిబ్బంది.వ్యవహరించారు.3 ట్యాంక్ ల వాటర్ కొట్టి మంటలను పూర్తిగా అదపులోకి తీసుకొచ్చారు.ఆస్తి నష్టం 2 లక్షల వరకు జరిగి ఉంటుందని అంచనా వేశారు.దీంతో చుట్టుపక్కల ఉన్న వారు.మంటలు అదుపు కావడంతో ఊపిరిపీల్చుకున్నారు.ఈ సంఘటనలో ఫైర్ సిబ్బంది. జావేద్ అలీ, కట్ల వెంకటేష్, శ్రీకాంత్ సాయి పాల్గొన్నారు.

## బోరేగాం గ్రామంలో ఉద్రిక్తత..



ప్రజాపక్షం/ముధోల్ : మండలంలోని బోరేగాం గ్రామంలో సోమవారం దళితులు,ఇతర వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది.గ్రామ శివారులోనీ ప్రభుత్వ భూమిలో హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో,దళితులు సైతం బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి బౌద్ధ పూర్ణిమను పురస్కరించుకుని దళితులు అదే స్థలంలో బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి బౌద్ధ విగ్రహాన్ని ప్రతిష్టించారు.బుద్ధ విగ్రహ ప్రతిష్టించడంతో ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్ళు రువ్వుకున్నారు.దీంతో పలువురికి గ్రాయాలవ్వడంతో వారిని బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.గొడవ జరుగుతున్న విషయం తెలియగానే ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు బలగాలు చేరుకుని గొడవ సద్దుమణిగేలా పటిష్ట చర్యలు తీసుకున్నారు.వారితో పాటు అర్డిఓ కొమల్ రెడ్డి,తహసీల్దార్ శ్రీకాంత్ చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు.గొడవ మరింత జరిలంకాకుండా పోలీసులు గ్రామ పరిసరాల్లో బందోబస్తును చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో బైంసా ఏఎస్పీ అవినాష కుమార్,సీఐ మల్లేష్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు వినియోగించుకోవాలి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/బోధన్: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తుందని ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు వినియోగించుకోవాలని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బోధన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వై ద్యం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. వైద్యం కోసం వచ్చే వారు వైద్యులను ఇబ్బందులకు గురి చేయవద్దని పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేద ప్రజల కోసం పూర్తి స్థాయిలో విద్య, వైద్యం కొరకు అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆస్పత్రిలో గర్భిణీల కోసం చికిత్సలు నిర్వహించేందుకు గైనకాలజీ డాక్టర్లను నియమించామని, నెలకు 170శస్త్ర చికిత్సలు, సాధారణ కాన్పులు ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో తాహెర్ బిన్ హందాన్, ఏసీపీ శ్రీనివాస్, విఠల్, సీఐ వెంకట నారాయణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్, ఆర్ఎంవో రహీం, డాక్టర్ సోఫీ, వైద్యులు నర్సింగ్, సూపరింటెండెంట్, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది, గంగా శంకర్, పామోహినోద్దీన్, నాగేశ్వర రావు, శీల శంకర్, ఎల్లయ్య, నాయకులు దామోదర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



**సొసైటీ భవనం నిర్మాణం భూమి పూజలో ఎమ్మెల్యే**

బోధన్ నియోజకవర్గం సాలూర మండలం హున్స గ్రామంలో సహకార సంఘం నూతన భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం సొసైటీ ఛైర్మన్ మందర్నా రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి హాజరై భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ మందర్నా రవి పాలక వర్గ సభ్యులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఘనంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తహెర్ బిన్ హుందాన్ గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బ్లాక్ నాగేశ్వర రావు, మార్కెట్ కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ చీల శంకర్, పార్టీ నాయకులు,, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు వెంటనే పరిష్కారం



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైనూర్ మండలం ఊహేగాం, పోచంలొద్ది గ్రామాలకు చెందిన రైతులు తమ పంపుసెట్లు, వ్యవసాయ బావులకు త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పెంచికల్ పేట మండలం గుంట్లపేట గ్రామానికి చెందిన సాగర్ తాను దివ్యాంగుడినని తనకు పింఛన్ మంజూరు చేయాలని, రెబ్బెన మండలం పర్సనంబాల గ్రామానికి చెందిన ఆదే యాదవ్ తనకు 65 సంవత్సరాల వయసు ఉందని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని పలువురు వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్ : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తాండూర్ మండలం గోపాలరావుపేటకు చెందిన కాసిపాక లక్ష్మి తనకు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరున్నా ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి కోరారు. మంచిర్యాల రాజీవ్‌నగర్‌కు చెందిన బొడ్డు భీమన్న తాను ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టానని బిల్లులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దండేపల్లి మండలం పాతమామిడిపల్లికి చెందిన ఆరేపల్లి సత్తయ్య తన తండ్రి భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, దానిని తన తల్లి పేరున పట్టా మార్పిడి చేయాలని కోరారు. హాజీపూర్ మండలం గుడిపేట, ముల్కల్ల, వేంపల్లి ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తమకు ఉపాధి కల్పించాలని కోరారు. చెన్నూర్ మండలం గంగారానికి చెందిన చల్ల రాజు తన భూమి కాలువలో పోవడంతో నష్టపరిహారం అడిగారు. బెల్లంపల్లి పెద్దపల్లికి చెందిన కుసనపల్లి అన్నపూర్ణ తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన కొండూరు గౌడ కులస్తులు



ప్రజాపక్షం/నందిపేట్ : నందిపేట్ మండలంలోని కొండూరు గ్రామ గౌడ కులస్తులు సోమవరం రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు వారి బాధలను వివరించారు.

## ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తదితర అంశాలపై ప్రజలు తమ వినతులను కలెక్టర్‌కు అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించాలంటూ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ లోఉన్న దరఖాస్తులను శాఖల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పరిష్కార వివరాలను రిమార్కుల విభాగంలో నమోదు చేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సంబంధించిన సమాచారం దరఖాస్తుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెలిఫోన్ ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫోన్లను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు.దూర ప్రాంతాల ప్రజలు 9100577132 నంబరును సంప్రదించి వాట్సాప్ ద్వారా సమస్యలు పంపవచ్చునని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని, అభ్యంతరాలను స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్




ప్రజాపక్షం/జన్నారం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కృషి చేయాలని, నిత్యం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, ఎఐసిసి జాతీయ ట్రైనింగ్ కన్వీనర్ రాహుల్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో శిక్షణకు వచ్చిన ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి వారు యోగా చేశారు. అనంతరం అక్కడి నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు పాదయాత్ర నిర్వహించారు. జై బాపు, జై సంవిధాన్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఆ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొజ్జు పటేల్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎఐసిసి జాతీయ ట్రైనింగ్ కన్వీనర్ రాహుల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడకుండా ఉండాలంటే పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, నియోజకవర్గ ఇంచార్జీలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరిపై గంగమ్మ తల్లి ఆశీస్సులు

ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం రూరల్ నియోజకవర్గం ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ గంగమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడారు. శ్రీ గంగమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవానికి తాను రావడం ఎంతో అదృష్టంగా భావిసున్నానన్నారు. గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం 40 లక్షల నిధులను కేటాయించానన్నారు. దేవాదాయశాఖలో పూజారి కోసం దరఖాస్తులు ఇవ్వటం జరిగిందని, పేపర్ వర్క్స్ సంబంధించి ప్రతిఒక్కటి చూసుకుంటానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆలయంకు సంబంధించి ధ్వజ స్తంభం, విగ్రహాల ప్రతిష్టాపన వంటివి పూర్తయినందున చాలా సంతోషంగా ఉందన్నారు. ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులకు గంగమ్మ తల్లి అయినందున చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బాడ్సీ శేఖర్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, గంగమ్మ తల్లి ఆలయ కమిటీ, ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, చిన్నబాల్‌రాజ్, నాయకులు మోహన్, సంతోష్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## నేటి పాలిసెట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

ఎస్‌పి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: పాలీసెట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ (బాయ్స్), తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్), మాతృశ్రీ డిగ్రీ కాలేజ్, వాంకిడి మండలం బెండర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో 4 పరీక్ష కేంద్రాలలో 1032 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. ఈ పరీక్షల సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ఉదయం 07:00 నుండి మధ్యాహ్నం 03:00 వరకు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## నేర రహిత సమాజ మార్పునకు ఆపరేషన్ చాబుత్ర

అర్ధరాత్రి 30 మంది అరెస్ట్

ప్రజాపక్షం / మందమర్రి: మందమర్రి పట్టణాన్ని నేర రహితంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు ఆపరేషన్ చాబుత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మందమర్రిలో ముగ్గురు ఎస్ఐలు, 25 మంది సిబ్బందితో దిగ్బంధించి ఆపరేషన్ చాబుత్ర చేపట్టి అర్ధరాత్రి రోడ్లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి 18 బైకులు, ఒక కారు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి అరుగుల మీద బాతాఖానీలు వేస్తూ, రోడ్లపై ఇష్టానుసారంగా బైక్‌లపై తిరుగుతూ కాలనీ వాసులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని, మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురిచేస్తున్న వారిని, గొడవలు సృష్టిస్తున్న వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఇకపై ఇలాంటి డ్రైవ్‌లు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో ఎక్కువగా మైనర్లు, 30 సంవత్సరాల లోపు ఉన్నవారే ఉంటున్నారని, వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా నేరాలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. మందమర్రి పట్టణాన్ని నేర రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ ఆపరేషన్ చాబుత్ర కార్యక్రమంలో మందమర్రి, రామకృష్ణాపూర్, కాశిపేట ఎస్ఐలు, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారుపాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలను ప్రశంసించిన జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్న తోట రాజశేఖర్‌కు జాతీయ స్థాయిలో రెడ్‌క్రాస్ అవార్డు వరించిన సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. జాతీయ స్థాయిలో అవార్డు పొందుతున్న తోట రాజశేఖర్‌ను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో బ్లడ్ డోనేట్ సేవలందిస్తున్నారని ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ , జడ్పీ సీఈఓ సాయగౌడ్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ఆర్డీఓ స్రవంతి, డీపీఓ శ్రీనివాస్‌రావు, డీయంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, టీఎన్‌జీఓ సంఘం అధ్యక్షులు సుమన్, కార్యదర్శి శేఖర్ గౌడ్, క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, కోశాధికారి కరిపె రవీందర్ పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## విద్యార్థుల నమోదు పెంపుపై దృష్టి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** 2025–26 విద్య సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపుపై దృష్టి సారించాలని ఎఇఒ మాధవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో తల్లి దండ్రుల సమావేశం నిర్వహించి వారికి ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతపై వివరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం పాఠశాలలో చేపడుతున్న విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి విద్యార్థుల హాజరు శాతం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సైదులు, శ్రీనివాస్ స్వామి, మాధవరెడ్డి, అనసూయ, శ్రీనివాస్, నరేందర్, సరోజ, ఎల్‌ఎఫ్ ఎల్ హెచ్‌ఎంలు నేతి శంకర్, సత్యం, గోపికల తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం

✻ జిల్లా ఎస్‌పి మహేష్ బి.గీతే



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి :** బాధితుల ఫిర్యాదులకు సత్వర న్యాయం చేయడానికే ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరు గుతుందని జిల్లా ఎస్‌పి మహేష్ బి.గీతే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యా దులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి :** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

## పదోన్నతితో పెరగనున్న బాధ్యతలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** పదోన్నతులతో విధుల పట్ల మరింత బాధ్యతలు కూడా పెరుగుతాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీస్ కమి షనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఎఎస్‌ఐ లుగా పదోన్నతి పొందిన సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కార్యాలయంలో అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నాన్ని అలకరించి శుభా కాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో మాట్లాడారు. ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన ఉత్తమ పోలీస్ సేవలు అందించాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెరిగే రీతిలో ప్రజలతో వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## బుద్ధుడి బోధనలు ప్రపంచానికి ఆదర్శం

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్/సుల్తానాబాద్:** బుద్ధుడి బోధనలు ప్రపంచానికి ఆదర్శమని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు అన్నారు. సోమవారం ఎలిగేడు మం డలంలోని దూళికట్ట బౌద్ధ క్షేత్రంలో 2569 గౌతమ బుద్ధ పూర్ణిమ మహోత్సవం కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన శాంతిక పోతాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి ఆలోచన విధానాన్ని ఆచరించడం అభినందనీయమని వారి ఆశయాలు నేడు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్నాయన్నారు. రానున్న రోజులో తారురోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ దేవా శ్రీనివాస్ సదా శయ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో తెలంగాణ రాష్ట్ర నేత్ర, అవయవ, శరీర, దా తల సంఘం సహ కారంతో తన మరణానంతరం అవయము దానం చేస్తానని ముందుకు రావడంతో వారికి అవయదన పత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో బౌద్ధ మత సభ్యు లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు లైసెన్స్‌ల పంపిణీ

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి:** ఇందిరా మహిళా శక్తిలో భాగంగా జిల్లాలోని ఎని మిది మహిళా స్వశక్తి సంఘాలకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయ కేంద్రాల లైసెన్సులను పంపిణీ చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి కింద ఎస్‌హెచ్‌జిలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశ్యంతో జిల్లాలోని పలు సం ఘాల బాధ్యులకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో ఎనిమిది స్వశక్తి సంఘాలకు లైసెన్స్‌లను పంపిణీ చేశారు. వేములవాడలోని శ్రీ ధనలక్ష్మి మండల సమాఖ్య సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, ముస్తాబాద్‌లోని గాయత్రి, బోయినిపల్లిలో విలాసాగర్, వేములవాడ శివరామ్‌లో, కోనరావుపేట విశ్వదర్శిని, గంభీరావుపేట విజయల, ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట భాగ్యశ్రీ తదితరల గ్రామైక్య సంఘాలకు, తంగళ్లపల్లి వినాయక పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వారికి విక్రయాల లైసెన్సులు అందజేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ శేషాద్రి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలి బేగం, అదనపు డిఆర్‌డిఒ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ప్రభుత్వ పథకాల అమలు

### నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రాజీవ్ యువ వికాసం వంటి వివిధ ప్రభుత్వ పథకాల అమలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలె క్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టరేట్‌లో వివిధ అధికారులతో సమీక్షించారు. నూతన రేషన్‌కార్డులకు సంబంధించి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను తహసీల్దార్లు పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా కరీంనగర్ నగరపాలక పరిధిలోని ప్రక్రియ వేగవంతం చేయాలని, నిర్ల క్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాగిన్‌లో ఉన్న భూభారతి దరఖా స్తులను పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. అన్ని మండల కేంద్రాల్లో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పూర్తి చేయాలని, మొదటి విడత చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల గ్రౌండింగ్ పూర్తి చేసి బ్యాంకర్లకు పంపించాలని, లబ్ధి దారుల జాబితా తయారు చేయాలని పేర్కొన్నారు. రుణాల మంజూ రులో దివ్యాంగులకు, ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలు పొందని పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. మండలాల్లో ఎంపిడిఒలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు ఈ పథకాన్ని పక డ్బందీగా అమలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడారు. జిల్లాలో అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెటర్నరీ ఉప కేంద్రాలు, ప్రభుత్వ పాఠశా లల్లో ఏర్పాటు చేయనున్న మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని తెలిపారు. కొత్తగా మంజూరైన భవనాలకు స్థల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కారం**

ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆయాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 264 దరఖాస్తులు రాగా వాటి పరిష్కారానికి అధికారులకు బదిలీ చేశారు.

## ఉద్యోగుల జెఎసి సంఘీభావ ర్యాలీ

పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు





**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం టిఇజెఎసి ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇండియన్ ఆర్మీకి మద్దతుగా భారీ సంఘీభావ ర్యాలీచేపట్టారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి అమరవీరుల స్థూపం వరకు జాతీయ జెండాలను చేతబూని భారత్ మా తాకీ జై అనే నినాదాలతో ర్యాలీ కొనసాగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై ర్యాలీని ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జెఎసి జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు అన్యాయంగా పొట్టనపెట్టుకోవడం భారత జాతిని తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రతీకారంగా భారత ప్రభుత్వం పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై దాడులు చేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరిట చేసిన దాడులకు త్రివిధ దళాలు ప్రశంసలందుకున్నాయని చెప్పా రు. ర్యాలీలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు, డ్రైవర్లు, మున్సిపల్ ఉద్యోగులు, డిఫెన్స్ విధ్యార్థులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్, జిల్లా అధికారులు లక్ష్మి కిరణ్, ప్రఫుల్ దేశాయ్, సుప్రియ సరస్వతి, రామకృష్ణ, టీచర్ల సంఘం నాయకులు కరుణాకర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, తదితరులున్నారు.

## ‘రైతు ముంగిట్లో’ కార్యక్రమంపై అవగాహన



**ప్రజాపక్షం/ముత్తారం:** పొలంలో మట్టి పరీక్షలు నిర్వహించి ఏరకమైన పంటకు నేల అనుకూలం, ఏ మేరకు దిగుబడి వస్తుంది. ఆ భూమిలో వాడాల్సిన రసాయన ఎరువుల మో తాదుకు మించి ఎరువులు వాడితే ఎలాంటి తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. భూసారం ఏ విధంగా దెబ్బతింటుంది. అదే జరిగితే భవిష్యత్లో ఎలాంటి పరిణామాలు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందనే వివరాలను తదితర అంశాలపై వ్యవసాయ పరిశోధన స్థానం కూనారం డాక్టర్ శ్రీధర్‌సిద్ది, డాట్‌సెంటర్ కరీంనగర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు పలువురు శాస్త్రవేత్తలు రైతు లకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు.సీడ్స్ కరీంనగర్ ఆర్‌ఎం విష్ణువర్ధన్ మాట్లాడుతూ వానాకాలం సాగు కు రైతులను సమాయత్తం చేసేందుకు మెరుగైన సాగు పంటలపై తెగుళ్ల దాడిని ముందే అరికట్టి దిగుబడి పెంచి అన్నదాతకు ఆర్థిక స్వావలంబన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నారు పోసిన నాటి నుంచి వరికోతకు వచ్చే వరకు పలురకాల తెగుళ్లు పంటలపై దాడి చేస్తున్నాయి. వాటి నివారణకు రైతులు లెక్కకు మించి పురుగు మందులు వాడుతున్నా రు. దీంతో భూములు విషతుల్యం అవుతున్నాయని భావించిన రాష్ట్ర ఉన్నతాధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలను ముందుగానే పల్లెలకు పంపి అన్న దాతలకు పంటల సాగుబడిపై తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయ అధికా రులు చర్యలుతీసుకుంటారన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకే రసాయనాలను వినియోగించడం, వి త్తనాలు కొన్నప్పుడు రసీదులు భద్రపరచుకోవడం, పంటమార్పిడి,ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం, వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించడం లాంటి తదితర అం శాలపై రైతులను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీడ్స్ కరీంనగర్ ఆర్‌ఎం విష్ణు వర్ధన్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సింగిల్విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఎంపీడీవో సురేష్, ఆర్టికల్చర్ అధికారి జ్యోతి, మండల వ్యవసాధికారి అనూష, ఎఇఒలు హారిక, శ్రీలేఖ, ఏపిఎం పద్మ, సింగిల్ విండో డైరెక్టర్లు, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు శిశువులకు అండగా ‘ఊయల’

### కలెక్టర్ పమేలా సత్పతి

### కరీంనగర్ ఎంసిహెచ్‌లో క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్ ప్రారంభం




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అప్పుడే పుట్టిన శిశువును వద్దనుకునే వారు నిర్లక్ష్యంగా రోడ్లపై, చెత్తకుప్పలో వదిలి వేయొద్దని, శిశువుల సంరక్షణకు ఏర్పాటు చేసిన ఊయల (క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్)లో వదిలి వెళ్లాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాత శిశు సంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్)లో ప్రభుత్వ ప్ర ధాన ఆస్పత్రిలో మహిళా శిశు సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆద్వర్యంలో ఏర్పా టు చేసిన శిశువుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువులను వద్దనుకునే వారు ఊయలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. శిశువులకు అనారోగ్య సమస్యలు ఉన్నా వైద్యం అందించి శిశు గృహకు తరలించి పెంచి పెద్ద చేస్తారన్నారు. ఈ ఊయల వద్ద ఎలాంటి సిసి కెమెరాల పర్యవేక్షణ ఉండదని, ఊయలలో వేసిన వారిపై నిఘా, విచారణ వంటివి ఉండవని తెలిపారు. వివరాలు వెల్లడించినప్పటికీ అవి గోప్యంగా ఉంచబడతాయన్నారు. నేరుగా శిశును అప్పగించాలనుకునే వారు 94908 81098 నెంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వారి వివరాలు గోప్యం గా ఉంచ బడుతాయని తెలిపారు. శిశువులను రోడ్లపైన, చెత్తకుప్పలపైన వదిలేయడం వల్ల మరణించే అవకాశం ఉందని, ఎంతోమంది పిల్లలు లేని దంపతులు దత్తత కోసం ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వదిలి వేసి శిశువులను చట్టప్రకారం దత్తత ఇస్తారని వివరించారు. ఆపదలో చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098ను సంప్రదించాలని సూచించారు. త్వరలో జిల్లాలోని జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఊయలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌లో రైల్వేస్టేషన్లలోనూ ఊయల ప్రారంభిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డిఎంహెచ్‌ఒ వెంకటరమణ, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ వీరారెడ్డి, ఆర్‌ఎంవో నవీన, డిసిపిఒ పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఊయలను డిఎంహెచ్‌ఒ వెంకటరమణ, డిడబ్ల్యూఒ సరస్వతి, తదితరులు ప్రారంభించారు.

## ఫీజుల దోపిడీకి విద్యాశాఖ అధికారుల వత్తాసు

### ఎంఇఒను సస్పెండ్ చేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** హుజురాబాద్ పట్టణ కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యావ్యాపారం చేస్తు న్నాయని, అక్షరాలతో లక్షలు వసూలు చేస్తూ ఇష్టానుసారంగా ప్రకటనలు, ప్రచారం చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఎఐఎస్‌ఎఫ్ మండల కార్య దర్శి రాంపెల్లి రోహిత్ అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్ట కుండా వారికి వత్తాసు పలుకుతూ వారు చేస్తున్న విద్యావ్యాపారానికి సహకరిస్తున్న మండల విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం హుజురా బాద్‌లో ఎఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఇఒ,ఎంఇఒల అం డదండలతోనే ప్రైవేట్ పాఠశాలల వారు ఇష్టానుసారంగా ఫీజుల వసూలు చేస్తున్నారన్నారు. అడ్మిషన్ ఫీజు స్కూల్ ఫీ, యూనిఫామ్ ఫీజు, పుస్తకాలు, స్టేషనరీ పేరిట లక్షలు వసూలు చేస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలలు ఎక్కడా విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదని పేర్కొ న్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా రెగ్యులేషన్ కమిటీ ఏర్పాటు చేసి ఫీజుల దోపిడీ అరిక ట్టాలని, జిల్లాలో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మండల నాయకులు రాధాకృష్ణ, శివ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం



జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సం బంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యా దులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ వివిధ ప్రాంతాల నుం డి ప్రజలు ఎన్నో వ్యయ ప్ర యాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారీగా స్వీ కరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించి, సమస్యల పరిష్కారానికి ప్రాధా న్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత ఆర్డీఓలు మధు సుధన్, శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### సత్వరమే అర్జీల పరిష్కారం

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖా స్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### ఆర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

### ✻ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి :** ప్రజావాణి ద్వారా వచ్చే ఆర్జీల పరిష్కారంలో జాప్యం వద్దని అధికారులకు తగు ఆదేశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జారీ చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల తో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలకు సానుకూలంగా స్పందించారు. ప్రతి సోమ వారం ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికా రులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ శేషాద్రి, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పకడ్బందీ చర్యలు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పకడ్బందీ చర్యలు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త వేరుగా సేకరించడం వంటి పలు అంశాలపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలను భాగస్వామ్యం చేయాలని, తడి , పొడి చెత్త ప్రజలు వేరువేరుగా సేకరించి మున్సిపల్ వాహనాలకు అందించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వార్డు అధికారులు ప్రతిరోజు ఉదయం ఫీల్డ్‌లో అందుబాటులో ఉండి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ తరలింపు వంటి అంశాలను పరిశీలించాలన్నారు. స్వశక్తి మహిళా సంఘాల సమావేశాలో కూడా తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కల్పించాలన్నారు. పారి శుధ్య వాహనాల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో సహకరించే ప్రజలకు అవార్డులు అందిస్తామన్నారు. పట్టణంలో ఎక్కడైనా పారి శుధ్య నిర్వహణపై ప్రజల నుంచి మున్సిపాలిటీకి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరి ష్కరించాలన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యులుగా అక్కున చేర్చుకుంటా మన్నారు. మిడ్ మానేరు నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ క్రింద 4696 ఇండ్లు మంజూరు చేపించామని, ఇంకా పెండింగ్ సమస్యలు కూడా అతి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. వేములవాడ గుడి విస్తరణ పనులు కూడా శృంగేరి పీఠాధిపతుల సూచనమేరకే వారి అనుమతులతోనే పనులు జరుగుతాయి అని, ఎవరికి ఏ సందేహాలు ఉన్న సూచనలు చేయవచ్చని తెలపారు. ఈ కార్యక్రమంలో కట్ట శ్రీనివాస్ గౌడ్ (సింగిల్ విండో డైరెక్టర్ ), పర్వతి భూమేష్ గౌడ్ (అగ్రహారం టెంపుల్ మాజీ డైరెక్టర్), మాదాసు కరుణాకర్ (మాజీ ఎంపీటీసి), దావనపెల్లి రవీందర్, గాలిపెల్లి శ్రీకాంత్ గౌడ్ , కట్ట దేవయ్య, తాడేం శ్రీని వాస్, నేరెళ్ల బాలయ్య, బెజగం శ్రీధర్, పర్వతి మధు,మైలారం లచ్చయ్య, పాముల రాజానర్సు, గొల్లపెల్లి శేఖర్, బొమ్మ పర్శరాము, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.100 కోట్ల లక్ష్యం పూర్తి చేస్తాం

### ✻ నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు



**ప్రజాపక్షం/మల్లాపూర్:** ప్రజలకు రైతులకు యువతకు ఎన్నో విధాలుగా కరీంనగర్ సహకార బ్యాంక్ సేవలు అందిస్తుందని నాఫ్స్కాబ్ చైర్మన్ కొం డూ రు రవీందర్‌రావు అన్నారు. ఈ మేరకు మల్లాపూర్ మండల కేంద్రంలో ఒక కోటి 20లక్షల రూ.లతో నూతనంగా నిర్మించిన కేడిసిసి బ్యాంక్ భవ నా న్ని స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి సోమవారం ప్రారంభిం చారు. గత పది ఏళ్లకు పైగా మల్లాపూర్ మండలప్రజలకు కమర్షియల్ బ్యాం కులకు మించి సహకార బ్యాంక్ ఎన్నో సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిందన్నారు.రైతులకు, విదేశాల్లో విద్యను అభ్యసించే యువతకు, స్థాని కంగా ఉన్న యువతకు స్వయం ఉపాధి రుణాలు ప్రతి ఒక్కరు కరీంనగర్ సహకార బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మె ల్యే సంజయ్ మాట్లాడుతూ సహకార బ్యాంక్ సేవలను రైతులు యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి దిశగా ముందుకు సాగాలని, రుణాలు అం దిం చేందుకు సహకార బ్యాంక్ అన్ని విధాలుగా తోడు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేడిసిసిబి సిఈవో సత్యనారాయణ రావు, కేడిసిసిబి డైరెక్టర్ మోహన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, తక్కల్ల నరేష్ రెడ్డి, బద్దం అంజిరెడ్డి, నేరేళ్ల మోహన్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, సూపర్‌వైజర్ చిలివేరి శ్రీనివాస్, పాక్స్ సిఇఒ పాదం భూమేష్, వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు ఖాతాదారులు తదితరులు ఉన్నారు.

# క్రీడ

## టెస్టులకు విరాట్ కోహ్లీ గుడ్ బై..



ఇంగ్లాడ్ పర్యటనకు ముందు క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. స్టార్ క్రికెటర్, మాజీ సారథి విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. కెప్టెన్ రోహిత్ శర్మ బాటలోనే అతడు కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. తాను కూడా టెస్టుల నుంచి రిటైరవ్వాలనుకుంటున్నట్లు ఇటీవల బీసీసీఐకి చెప్పిన కోహ్లీ.. తాజాగా దీనిపై అధికారిక ప్రకటన చేశాడు. ''14 ఏళ్ల క్రితం తొలిసారిగా టెస్టు క్రికెట్ జెర్సీ ధరించా. ఈ ఫార్మాట్ నన్ను ఇంత దూరం తీసుకెళ్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలు నేర్పించింది. తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నా మనసుకు చాలా ప్రత్యేకమైనది. నిశ్శబ్దమైన ఆనందం.. సుదీర్ఘమైన రోజులు.. ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉంటాయి'' ''అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. నేను ఆశించిన దానికంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో దీని నుంచి వైదొలుగుతున్నా. వెనక్కి తిరిగి నా టెస్టు కెరీర్‌ను చూసుకుంటే నా ముఖంలో చిరునవ్వు కన్పిస్తుంది. ప్రేమతో ఇక సైనింగ్ ఆఫ్..'' అని కోహ్లీ తన పోస్టులో రాసుకొచ్చాడు.కాగా.. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ, కోహ్లీ ఒకేసారి పొట్టి క్రికెట్‌కు టాటా చెప్పారు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం రోహిత్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు షాకిచ్చాడు. అతడు వైదొలగడంతో ఇంగ్లాండ్ పర్యటనకు కోహ్లీ అత్యంత కీలకమవుతాడని అంతా భావించారు. అంతలోనే తాను కూడా రిటైర్ అవ్వాలనుకుంటున్నానని విరాట్ బీసీసీఐకి సమాచారమిచ్చాడు. దీంతో అతడికి సర్దిచెప్పేందుకు బోర్డు ప్రయత్నించింది. కానీ, కోహ్లీ మాత్రం తన టెస్టు కెరీర్‌ను ముగించేందుకే సుముఖత చూపించాడు. 2011 మధ్యలో టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కోహ్లీ.. ఇప్పటివరకు 123 టెస్టులు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 శతకాలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ ఫార్మాట్‌లో విరాట్ వ్యక్తిగత అత్యధిక స్కోరు 254 పరుగులు. 2025 జనవరి 3న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడాడు. టెస్టుల్లో ఎన్నో గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్.. పది వేల పరుగుల మైలురాయికి కొద్ది దూరంలోనే నిలిచి.. ఈ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

> కోహ్లీ.. గుండె ధైర్యం, పరుగుల దాహం, పట్టువదలని క్రీడాస్ఫూర్తి .. కోహ్లీకి ప్రత్యేకమైనవి. కోహ్లీ నిజంగా కింగే. హుందాగా ఆడుతూనే అతను ఆ ఫార్మాట్‌ను డామినేట్ చేసిన తీరు.. క్రికెట్ హిస్టరీలోనే ఓ కొత్త అధ్యాయంగా నిలిచిపో-

> అతనికి అతనే సాటి. టెస్టుల్లో అతనో మైటీ వారియర్. ఆ యోధుడు ఇప్పుడు టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై ప్రకటించాడు. అద్భుతమైన కెరీర్‌కు ఫుల్ స్టాప్ పెట్టేశాడు. ఎందరో క్రికెటర్లకు ఇన్‌స్పిరేషన్‌గా నిలిచాడు ఆ స్టార్

### కోహ్లీ రిటైర్మెంట్‌పై అనుష్క శర్మ ఎమోషనల్ పోస్టు



కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ అతని సతీమణి అనుష్క శర్మ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్టు పెట్టింది. 'అందరూ రికార్డులు, మైలురాళ్ల గురించే మాట్లాడవచ్చు.. నాకు మాత్రం నువ్వు దాచుకున్న కన్నీళ్లు.. బయటకు తెలియకుండా నీతో నువ్వు చేసిన యుద్ధాలు గుర్తుండిపోతాయి. టెస్టు ఫార్మాట్‌పై నీవు చూపిన ప్రేమను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ప్రతి టెస్టు సిరీస్ తర్వాత నువ్వు ఎంతో గొప్పగా తిరిగి వచ్చేవాడివి. నువ్వు ఎదిగిన విధానాన్ని పక్కన ఉండి చూడటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఏదో ఒక రోజు టెస్టుల నుంచి రిటైర్ అవుతావని తెలుసు. కానీ, నువ్వు ఎల్లప్పుడూ నీ మనసు చెప్పిన ప్రకారమే నిర్ణయం తీసుకుంటావు. ఆటలో ప్రతిదీ సాధించావు. గుడ్ బై చెప్పడానికి అర్హుడివని భావిస్తున్నా' అని అనుష్క శర్మ భావోద్వేగానికి గురైంది.

### థ్యాంక్యూ విరాట్ కోహ్లీ.. బిసిసిఐ వీడియో రిలీజ్

బ్యాటర్. టెస్టు బ్యాటింగ్ యావరేజ్‌తో అందర్నీ స్టన్ చేసిన విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై సోమవారం బీసీసీఐ ఓ వీడియోను రిలీజ్ చేసింది. తెలుపు దుస్తుల్లో కోహ్లీ చాటిన ఘనతను ఆ వీడియోలో ప్రజెంట్ చేసింది బిసిసిఐ. టెస్టు క్రికెట్‌లో తనను ఉత్తేజపరిచింది ఆ గేమ్‌లో ఉన్న ఛాలెంజ్ అని కోహ్లీ వీడియోలో పేర్కొన్నాడు. బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన వీడియోను మీరూ తిలకించండి.

# రీల్

## తారక రామారావు సినీ రంగ ప్రవేశం..



నందమూరి హరికృష్ణ మనవడు, జానకీరామ్ కుమారుడు నందమూరి తారక రామారావు హీరోగా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. నందమూరి వంశం నాలుగో తరం వారసుడిగా తారక్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నేడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి తదితరులు హాజరయ్యారు. నారా భువనేశ్వరి హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టి వారిని అభినందించారు. అయితే ఈ మూవీ ప్రారంభమైన సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తారక రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. తారక రామారావు ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను అని సీఎం చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మూవీ ప్రారంభోత్సవం అనంతరం హీరో తారక రామారావు మాట్లాడుతూ, మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకీరామ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ రోజు నా కుటుంబ సభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి మీడియా ఎంతో సహకరించింది. వారందరికీ కృతజ్ఞతలు అని అన్నారు.

## సూర్య కుమార్‌గా ఉపేంద్ర ఎంట్రీ!




ఉస్తాద్ రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. దర్శకుడు పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో సాగర్ అనే పాత్రలో సరికొత్త మేకోవర్‌తో రామ్ నటిస్తున్నాడు. ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను రామ్ బర్త్‌డే కానుకగా మే 15న రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ వెల్లడించారు. అయితే, తాజాగా ఈ మూవీ నుంచి మరో సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర సూర్య కుమార్ అనే పాత్రలో నటిస్తున్నాడు. ఈ మేరకు ఆయన ఫస్ట్ లుక్‌ను రివీల్ చేశారు. ఈ సినిమాకు వివేక్‌మెర్విన్ ద్వయం సంగీతాన్ని అందిస్తున్నాడు. మరి ఈ సినిమాకు ఎలాంటి టైటిల్ పెడతారా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## 'విద్యా బాలన్' కోసం పాత్ర రెడీ! పూరి జగన్నాథ్







డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా ఓ సినిమా రాబోతుంది. నేటి రాజకీయాల పై ఈ చిత్రం ఉండబోతుందని.. పైగా సినిమాలో పొలిటికల్ సెటైర్లు చాలా ఉంటాయని.. నేటి సమాజానికి తగ్గట్టు పూరి స్క్రిప్ట్ రెడీ చేశాడని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ విద్యా బాలన్ ఓ కీలక పాత్రలో నటిస్తోందని, పైగా రాజకీయ నాయకురాలి పాత్రలో ఆమె కనిపిస్తారని తెలుస్తోంది. సహజంగా పూరి క్యారెక్టర్స్‌లో డెప్త్ ఉంటుంది. మరి రాజకీయాల పై ఎలాంటి పాత్రలు రాశాడో చూడాలి. ఐతే, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా వచ్చిన డబుల్ ఇస్మార్ట్ ఆశించిన స్థాయిలో పాజిటివ్ టాక్ ను తెచ్చుకోలేక పోయింది. ముఖ్యంగా పూరి గత సినిమాలతో పోల్చుకుంటే.. ఈ సినిమాలో బలమైన కంటెంట్ మిస్ అయ్యింది అంటూ కామెంట్స్ వినిపించాయి. ఈ నేపథ్యంలో పూరి, విజయ్ సేతుపతి కోసం బలమైన కథను రాశాడట. మరి ఈ సినిమాతో పూరి ఏ రేంజ్ హిట్ ను అందుకుంటాడో చూడాలి.




గురువు గారికి అశ్రునివాళి

మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషి మాకు అన్ని విధాలుగా వెన్నుతట్టి ప్రోత్సహించిన మా గురువు గారు గురు ప్రసాదరావు గారి ఆకస్మిక మరణానికి చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కామ్రేడ్ ఆళ్ళ గురుప్రసాదరావు గారు అడ్వకేట్, కొత్తగూడెం

కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే, కొత్తగూడెం

SK.సాబీర్‌పాషా CPI జిల్లా కార్యదర్శి

వై ఉదయ్ భాస్కర్ అడ్వకేట్
పి రాధాకృష్ణమూర్తి అడ్వకేట్
జివి ప్రసాద్ అడ్వకేట్
బి మాధవరావు అడ్వకేట్
పి గణేష్ బాబు అడ్వకేట్
ఎల్ సత్యనారాయణ అడ్వకేట్
వై బాబురావు అడ్వకేట్
ఆర్ విజయ్ కుమార్ అడ్వకేట్
ఆర్ వెంకటరత్నం అడ్వకేట్
పి పట్టాభి అడ్వకేట్
ఎంవి ప్రసాదరావు అడ్వకేట్
ఎన్ చెన్నకేశవరావు అడ్వకేట్
వి.వెంకటేశ్వరరావు అడ్వకేట్
వై వి రామారావు అడ్వకేట్
జె శివరామ ప్రసాద్ అడ్వకేట్
చంద్ర నరేంద్ర అడ్వకేట్
ఎం. రవిచంద్ర అడ్వకేట్
ఎస్ సత్యనారాయణ అడ్వకేట్
ఎన్.వి రాజేష్ అడ్వకేట్
వి.వి సుధాకర్ అడ్వకేట్
పి మాధవ రావు అడ్వకేట్
ఏ రాం ప్రసాదరావు అడ్వకేట్
ఉప్పుశెట్టి సునీల్ అడ్వకేట్
ఎం.. వెంకటేశ్వర్లు అడ్వకేట్
జె. పద్మనాభరావు అడ్వకేట్
ఏ నాగిరెడ్డి అడ్వకేట్

పెద్దకర్మ: ది.13-05-2025 కొత్తగూడెం క్లబ్‌లో సంస్మరణ సభ నిర్వహించబడును.

నోట్: ఈ ప్రకటననే కార్డుగా భావించగలరని మనవి


## రైతులకు పూర్తిస్థాయి రుణ మాఫీకి చర్యలు తీసుకోవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సిపిఐ నేతలు చాడ వెంకటరెడ్డి, టి నరసింహ్మా విజ్ఞప్తి..



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు పూర్తిస్థాయి రుణ మాఫీ చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును చాడ వెంకటరెడ్డి, ఈటి నరసింహా కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామి ఇచ్చిన రైతు రుణమాఫీకి సంబంధించి రూ.2లక్షల లోపు ఉన్న రుణాలు కూడా చాల మంది రైతులకు ఇప్పటికి మాఫీ కాలేదని, వాటిని తక్షణమే మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. గతంలో కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక లక్ష రూపాయల రుణమాఫీ చేపట్టి విడుతల వారిగా అమలు చేయడంతో రైతులపై వడ్డీ భారం పడిందని, ప్రస్తుతం ప్రభుత్వం విధించిన షరతుల ప్రకారం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఏర్పడిందన్నారు. కుటుంబంలో యజమాని, ఆయన భార్య, కుమారుడు, కోడలు ఇలా భూమి పేరు మీద ఉన్నవారందరూ రుణాలు తీసుకున్నారని, దీంతో అవి మొత్తం కల్పితే రూ.2 లక్షలకుపైబడి ఉంటాయి. కుటుంబాన్ని యూనిట్‌గా తీకోవడంతో దాదాపు 40 శాతం పైబడి రైతులకు రుణమాఫీ కాలేదు .ఉదాహరణకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో 2 లక్షల రుణమాఫీకి అర్హులైనవారు 9588 ఉండగా అందులో 5864 మందికి రుణమాఫీ కాగా, ఇంకా మిగిలిన రైతులు 3724 మందివి రుణమాఫీ పెండింగ్‌లో ఉండటంతో రైతులు బ్యాంకర్లు, వ్యవసాయ అధికారి కార్యాలయాల చుట్టు తిరిగి విసిగి వేసారి పోతున్నారని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ప్రభుత్వం అప్పును మాఫీ చేయనుంది, రెండు లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని రైతులు బ్యాంకులకు చెల్లించాలనే స్పష్టమైన హామీ ఉంటే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రైతులకు అసలు, వడ్డీ కలిపి రెండులక్షలకు పైబడి బాకి ఉన్నట్లు చూపించడంతో వారికి కూడా మాఫీ కావడం లేదని తెలిపారు. మరోవైపు జూన్‌లోపు పంట రుణం రెన్యూవల్ చేసుకోకపోతే ప్రభుత్వ నిబంధనలు అనుసరించి వడ్డీ మాఫీ కాదని, రుణం రెనివ్వల్ చేసుకుంటే రుణమాఫీ అయ్యే అవకాశ ముండదేమో అనే మీమాంసంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే దీనిపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి ఈ సమస్యలకు పరిష్కార మార్గం చూపాల్సిందిగా తుమ్మల నాగేశ్వరరావుకు చాడ వెంకటరెడ్డి, ఈటి నరసింహా కోరారు.

## కమిషనర్ల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

బోరెడ్డి అయోధ్యరెడ్డి ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురి పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫైల్‌ను పంపింది. తాజాగా ఆయన ఆమోదం తెలపడంతో ప్రభుత్వం వారి నియామకంపై ఉత్తర్వులు జారీ చేసింది.కాగా ఇటీవలనే రాష్ట్ర ప్రధాన సమాచార చీఫ్ కమిషనర్‌గా జి.చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో నలుగురు ఆర్‌టిఐ కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.పౌరులకు సమాచారం అందించడంలో ఆర్‌టిఐ చట్టం కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే. కొత్తగా నియమితులైన కమిషనర్లు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంలో సమాచార కమిషన్ పాత్ర అత్యంత ముఖ్యమైనది.



## టెర్రరిస్టులను మట్టుబెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

సభ జరిగింది. ముఖ్య అతిధులుగా నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కశ్మీర్‌లో అమాయకులను చంపి అందులో కొత్తగా పెళ్లయిన జంటలోని నేవి ఆఫీసర్‌ను చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. టెర్రరిస్టులు ఇప్పటి వరకు ఎక్కడైన ఆకస్మికంగా కాల్పులు జరపడం వెళ్లిపోవడమే చూశామని, మొదటిసారి మత ప్రాతిపదికన చంపడం జరిగిందన్నారు. దేశంలో జరుగుతున్న టెర్రరిస్టు దాడులపై ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. దేశంలో ఎన్నికలు జరిగినప్పుడే టెర్రరిస్టులు దాడులు జరపడం అమాయకులు బలికావడం దానిని బిజెపి పార్టీ వాడుకోవడం, అనుమానాలకు తావిస్తుందన్నారు. అమెరికా ఒకవైపు, పాకిస్తాన్‌లో ఆర్థిక సంభంధాలు కొనసాగిస్తునే టెర్రరిస్టు కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. టెర్రరిస్టులను అంతమొదించడం ప్రపంచ దేశాలన్ని కలిసి శాశ్వత పరిష్కారం వెతకాలన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ముస్లింలందరూ టెర్రరిస్టులు కాదని, అక్కడ కూడా టెర్రరిజాన్ని వ్యతిరేకించే సామాన్య ప్రజలు ఉన్నారని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. పాకిస్తాన్‌లోని టెర్రరిస్టులను అంతమొందించాలి కాని, సామాన్య ప్రజలను కాదన్నారు. తీవ్రవాద సమస్యకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేయడం బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుందని విమర్శించారు. మతాన్ని, టెర్రరిజాన్ని ఎన్నికల లబ్ధి కోసం ఉపయోగించుకోవడం అటవీక సాంప్రదాయమని, అది కొంతమంది నాయకుల శాడిస్టు మెంటాలిటీని తెలియజేస్తుందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్ రెండు ఒకే సంవత్సరం ఆవిర్భవించిన దేశం కోసం పోరాడిన చరిత్ర నిజమైన దేశభక్తి కమ్యూనిస్టులదే అన్నారు. దేశ రక్షణ, ప్రజా ప్రయోజనాల రక్షణకు సిపిఐ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

### నిజాన్ని, నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉంది : కూనంనేని సాంబశివరావు

నిజాన్ని నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అసలైన కమ్యూనిస్టులు తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా చెప్తారన్నారు. కమ్యూనిస్టుల భావజాలం ప్రకారం ఎక్కడ వెనుకబడి లేరని నిర్ణయక పాత్రలో ఉన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు మద్దతు ఉన్న పక్షమే అధికారం చేజిక్కించుకోవడం దీనికి నిదర్శనమన్నారు. ఎన్నికలలో డబ్బులు ఖర్చు పెట్టడంలో కమ్యూనిస్టులు వెనుకబడి ఉన్న మాట వాస్తవమేనని, డబ్బులే ఖర్చు పెడితే కమ్యూనిస్టులే గెలుస్తారన్నారు. దేశంలో ప్రజల భావోద్వేగాలను రాజకీయాలకు వాడుతున్నారన్నారు. మనిషికి ఆకలి ఉన్నంత కాలం ఉద్యమాలు ఉంటాయని, ఉద్యమాలు ఉన్నంత కాలం కమ్యూనిస్టులుంటారని, ప్రజల పట్ల సమాజం పట్ల అంకిత భావం ఎర్రజెండాకే సాధ్యమన్నారు.

### వ్యాపారం కోసమే యుద్ధం : శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రజల ప్రయోజనాలకు ఏమీ కావాలో దేశ ప్రయోజనాలకు ఏం కావాలో కమ్యూనిస్టులు గ్రహించి వివరించడంలో వెనుకబడ వద్దని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీలో ఉన్న నాయకులకైనా భావజాలన్ని అందించింది కమ్యూనిస్టులేనన్న విషయం మరువరాదన్నారు. కమ్యూనిస్టులు ప్రమాదకర పరిస్థితులను ప్రజలకు చెప్పడంలో ముందుండాలని అన్నారు. ప్రపంచ చరిత్రలో అమెరికా ఏ యుద్ధంలో ఇప్పటి వరకు గెలవలేదని కేవలం వ్యాపారం కోసమే యుద్ధాలు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, అక్కినేని వనజ, జాతీయ మహిళ సమాఖ్య కార్యదర్శి రజిని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, రైతాంగ పోరాట నాయకుడు దొడ్డా నారాయణరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు హేమంత రావు, రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి ప్రసాద్, రాష్ట్రమహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రంగారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, గంగాభవాని, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, ప్రేమ్, పావని, అమీనా, సదాలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


# సంస్మరణ



అమరజీవి కా॥ ఆళ్ళ గురుప్రసాదరావు గారు ప్రముఖ న్యాయవాది

ఎందరికో మార్గదర్శి, విలువల ఱేడు ఉన్నత విద్యావంతుడు, ప్రముఖ న్యాయవాది సిపిఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమరజీవి కా॥ ఆళ్ళ గురుప్రసాదరావు గారి అకాల మరణానికి చింతిస్తున్నాం. మీరు చూపిన బాటలో నడుస్తూ మీ ఆశయసాధనకు పున:రంకితమవుతూ...

కుమార్తె ఎ. అరుణ

సంస్మరణ సభ : 13-05-2025
స్థలం : కొత్తగూడెం క్లబ్
సమయం : ఉదయం గం॥ 10-00లకు

కార్డు అందని వారు ఇదే కార్డుగా భావించగలరు.


Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com